# డాక్టరు

రచయిత:

పోతరాజు రాఘవరావుగారు



పబ్లిషర్సు:

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో

రాజమండ్రి.

1955

కాపీరైటు రిజిష్టర్డు]

# హెచ్చరిక

ఈ "డాక్టరు" నాటకముయొక్క కాపీరైటు సర్వహక్కులు మాకు చెందియున్నవి. కావున మా వ్రాత పూర్వకమైన పర్మిషను లేనిదే యే సంఘముగాని యే సినీమా నటులుగాని ప్రదర్శింపరాదు, మరియు టాకీస్క్రీనింగు, గ్రామఫోను రికార్డింగు, యితర భాషలలోనికి తర్జుమాలు వగైరాలు చేయకూడదు. అట్లు అతిక్రమించిన వారలు మేము జరుపు సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు కాపీరైటు హక్కుదారులు,

రాజమండ్రి
4-9-1944

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో
రాజమండ్రి.

# అంకితము

సీ. జిల్లాధికారియై ♦ చిరతరకీర్తి వె
న్నెలఁజిగిఁగ్రాలె నే ♦ నియమమూర్తి
ఎంతధనికుఁడైన ♦ నుంతగర్వపడక
దీనులఁజూచు నే ♦ జ్ఞానమూర్తి
బంధుమిత్రుల గడు ♦ వాత్సల్యమునఁజూచి
పెద్దలఁగొల్చు నే ♦ ప్రేమమూర్తి
తండ్రిపోవంగనే ♦ తాను ప్రేముడిని మ
మ్మాదరించెనిట నే ♦ సాధుమూర్తి.

గీ. ప్రథిత మంత్రిప్రగడవంశ ♦ వార్ధిసోము
డమల చరితుండు నరసింహ ♦ యధిపుఁకును
అంజలీఘటించి భక్తితో ♦ నంకితంబొ
నర్తు మహాకావ్యకన్య పు ♦ ణ్యాత్ములార!

# గమనింపు

ఇందలిపాత్రలు కేవల మూహించి వ్రాసినవే కాని ఎవరిని నుద్దేశించి వ్రాసినవి కావు.

## పాత్రముల వివరము

### పురుషులు :

| | |
|---|---|
| ఆనంద్ M. B. B. S. | కథానాయకుడు |
| కుమార్ | కాలేజీవిద్యార్థి |
| జగ్గన్న | హెడ్మాస్టరు |
| బాలకృష్ణన్ | కాలేజీ ప్రిన్సిపాల్ |
| సీతాపతిరావు | సంపన్నగృహస్థుడు |
| పట్టాభిరామయ్య | జమీందారు |
| జనార్ధనం | తప్పిపోయిన సీతాపతిరావు గారి కుమారుడు |

### స్త్రీలు :

| | |
|---|---|
| పూర్ణ | కథానాయకురాలు |
| రాజ్యం | రెండవ కథానాయకురాలు |
| లీల | కాలేజీ విద్యార్థిని |

# డాక్టరు

## ప్రథమాంకము

### మొదటి రంగము

ప్రదేశము : హెడ్మాష్టరు జగ్గన్నగారి యిల్లు.

[ప్రవేశము : పూర్ణ]

పూర్ణ—(ప్రవేశించి పాడుకొనుచుండును.)

ఆనం—(సూటుకేసుతో ప్రవేశించి పూర్ణ తన్ను గుర్తింపకుండుట గ్రహించి) పూర్ణా! పూర్ణా! (పూర్ణ పలుకకుండును)

ఆనం—(ఆలోచన నభినయించి) సరే! (గొంతుక సవరించుకొని బిగ్గరగా) ఉప్పుకప్పురంబులొక్క పోల్కనుండు. చూడచూడ రుచులు జాడవేరు.

పూర్ణ—(పాటనాపి, ఆనంద్ వైపు చూచి) ఆనంద్! వచ్చావా! అబ్బ! నీరాకకోసమే యెదురుచూస్తూ యున్నాను. రా! యిలా కూర్చో!

ఆనం—Thanks. దేవిగారికి యిప్పటికైనా తెలివి వచ్చింది. నయమే (కూర్చుండును)

పూర్ణ—(ఆనంద్ వద్ద కూర్చొని ఎంతసేపయిందివచ్చి? నీవువస్తావన్న సంతోషములో మునిగిపోయి నీరాక గుర్తించలేదు.

ఆనం—నేను యిప్పుడే వచ్చాను. పిలిచి చూచేను. పలుకుతేరా? అందుచేత మామూలుగా పిలిస్తే తెలిసిరాదని సంగీతము మొదలుపెట్టేను.

పూర్ణ—ఓహో! ఏమి సంగీతమండి. గార్దభస్వరము.

ఆనం—ఆస్వరము ఉపయోగిస్తేనేగాని యీరాణీగారికి తెలివిరాదే అయినా నీవంటి గాయకురాలికుండు నాపాట సముద్రములో కాకిరెట్ట.

పూర్ణ—ఆఁ దానికేమిగాని Mail లో వస్తానని వ్రాసేవుకదా! యింత ఆలస్యమయిందేమి?

ఆనం—అసలు Mail లో రావలసిందేకాని seats లేవు. అందుచేత ప్యాసింజరులో వచ్చేను.

పూర్ణ—ఆనంద్! నీరాకకోసము ఎంతసేపటినుండి నిరీక్షిస్తున్నానో తెల్సునా? కళ్ళు కాయలు కాచిపోయేయి వచ్చేబళ్ళుపోయే బళ్ళు తెగగాలించేను. Mail time దాటిపోగానే నిస్పృహ చెంది యింక యీవాళకు రావనుకున్నాను.

ఆనం—పూర్ణా! నిన్ను చూడాలని నాహృదయమెంత తపించిపోయినదో తెల్సునా? ఎప్పుడు నిన్ను చేరుకుందామా అని నామనసు రైలుకన్న వేయిరెట్లు వేగముతో పరుగెత్తింది నీవైపు.
(అని దగ్గరగా చేరుకొనును.)

పూర్ణ—యింక మనకెంతో ఆనందము. యీ సెలవలు నెల్లాళ్ళు సుఖంగా కాలక్షేపం చేయవచ్చును.

ఆనం—యింక నెల్లాళ్ళెక్కడున్నాయి? అప్పుడే పది రోజులు గడిచి పోయాయిగా!

పూర్ణ—పోనీలే. యీ ఉన్న యిరువది రోజులైనా త్వరగా గడువకుండా కాలచక్రాన్ని నిరోధిద్దామా?

ఆనం—ప్రేమోపాసకులకు అలాగే యుంటుంది కాని అంతటిశక్తి వంతులమే అయితే ప్రపంచాన్నిలా ఉండనిద్దుమా?

పూర్ణ—అవును భూమ్యాకాశాలను చాపక్రింద చుట్టేసి హిరణ్యాక్ష హిరణ్యకశిపులులాగ గర్జించేస్తాను, అప్పుడు మళ్ళీ శ్రీ మహావిష్ణువు మనకోసం ప్రత్యేకం అవతారమెత్తవలసియుండును.

ఆనం—అంత పని చేయకు, మీనాన్నగారేడి ?

పూర్ణ—ఇందాక నీకోసము Stationకి వచ్చేరు. నీవు రాలేదని నిరాశ చెంది School కి వెళ్ళిపోయేరు.

ఆనం—అబ్బ! మీ నాన్నగారికి నేనంటే అంత అభిమానమున్నదన్న మాట.

పూర్ణ—అలా అనుకుంటున్నావేమిటి? ఆనందు! నాన్న సంగతి నీవిప్పట చదువుకుంటూన్నప్పటినుంచి ఎరుగుదువే ? నీకొఱకు ప్రాణత్యాగమైనా చేయడానికి సిద్ధుడౌతాడాయన.

ఆనం—ఇదివరకులాగే ఉన్నారా ఇప్పుడూ అని.

పూర్ణ—ఆయన హృదయంలో మార్పు లేదు. ఎప్పుడూ ఒకటే మాదిరి.

ఆనం—నిజమే. అమాయకులు మనమిద్దరము ఆనందంగా కాలం గడుపుతూ ఉంటే నాన్న కరిగిపోతుంటాడు. పాపము! నేనంటే ఎంతో గారాబము.

పూర్ణ—వచ్చేవేళయింది. ఇంటికి బడినుంచి వచ్చేయుంటారు. మళ్ళీ నీకోసం Station కి గాని వెళ్ళేరేమో ?

[ ప్రవేశము Head Master పుస్తకము చదువుతూ ]

జగ్గ—O ! Mighty Caesar ! Dost thy lie so low !

Are all they conquests, glories, triumphs Spirits Shrunk to this little measure ? Eare thee well ! I know not gentle men ? What you intended to do ? Who must be let blood ?(అని చదువును.)

ఆనం—అదుగో! అప్పుడే Shakesphere గారు మాటలలో నేవచ్చేరు. Good Morning Sir.

జగ్గ—O ! I see ! ఓ ఆనందా ! Very good Morning Take your seat ఎంతసేపయింది వచ్చి.

పూర్ణ—Passenger లో వచ్చేడండి. యిప్పుడే మీమాట అనుకున్నాము. ఇంకా రాలేదు. అలాగ మళ్ళీ Station కి గాని వెళ్ళేరేమో అని.

జగ్గ—వెడదామనుకున్నానుగాని షేక్స్పియర్ నాటకం హడావిడిలో పడి మరచిపోయాను.

ఆనం—మేష్టారూ! సర్వకాల సర్వావస్థలయందు షేక్స్పియరు నాటకాలతో కాలక్షేపం చేయడమేనటండీ! నుంచున్నా, అదే, కూర్చున్నా అదే యింటికి వస్తున్నా అదేనా ?

జగ్గ—నీకేమి తెల్సునోయి వానిలోని మాధుర్యము. మజ్జిగ తరచిన కొద్దీ కొద్దో గొప్పో వెన్న వస్తూనేయుంటుంది. ఆలాగే యిది చదువుతున్నకొద్దీ వీనిలోని మాధుర్యము తెలుస్తుంది.

ఆనం—నిజమే లెండి. నేను కాదనను. మిగతా authors - Milton అంటే Goldsmith అంటే యిలాగ ఎంతమందో ఉన్నారు కదా ! వాళ్ళ Books ఎందుకు చదువకూడదు ? అని.

జగ్గ—చదువకేమి ? అవీ చదువుతూ ఉంటాను. యీ ఏడాది S. S. L. C. Class కి Julias Caesar లో ఒక act వేసేరు. యిందాక క్లాసులో అది Teach చేసేను. అప్పుడే మళ్ళీ ఆ Scene చదవాలనిపించింది. అందుచేత యింటికి వచ్చేటప్పుడు దారిలో చదువుకుంటూ వచ్చాను.

పూర్ణ—ఏలాగైనా నాన్నగారూ ! మీకు చాదస్తమెక్కువండీ. అస్తమానూ షేక్సిపియరు Books తోనే కాలక్షేపంచేస్తారు.

జగ్గ—నీవు చిన్నదానవు. నీకేమి తెల్సును. Every one must have to admit that Shakespear is a great author.

ఆనం—Yes Your honour ! Sir !

జగ్గ—ఆ! సరిగాని నాయనా! మీ వాళ్ళంతా కులాసాగా ఉన్నారా? ప్రస్తుతము మద్రాసులో నీవు సీతాపతిరావుగారింట్లోనే ఉంటున్నావా?

ఆనం—ఆ! అందరూ కులాసాగానే ఉన్నారు సీతాపతిరావుగారింట్లోనే ఉన్నాను.

జగ్గ—వారికి కుశలమేనా?

ఆనం—ఆ, కుశలమే. మేష్టారూ! అన్నిటిమాట అటుంచి ముందు School విషయాలు చెప్పండి.

జగ్గ—ఏముంది నాయనా! చెప్పటానికి. యీమధ్యనే 'బాలకృష్ణన్' అను Tamilian ఒకడు Principal గా వచ్చేడు. ఆయనకు Andhras అంటేగిట్టదు. రంగేళీపురుషుడు. ఆయన లోకువ తీసికొని ఆడవాళ్ళు మగవాళ్ళు యిష్టమొచ్చినట్లు తందానా లాడుతున్నారు. యిది నాకు గిట్టదు. అందుచేత ఏదోవిధంగా రోజు ఆయనకు నాకు రామరావణయుద్ధం జరుగుతూంది. ఆకసితో నామీద జమీందారుగారికి చాడీలు చెప్తూన్నాడు. ప్రిన్సిపాల్ గారు మహానుభావుడనుకుంటాడా గుడ్డి జమీందారుగారు యిలాఉంది కాలేజీస్థితి.

ఆనం—అయ్యయ్యో! అఖండఖ్యాతి నార్జించిన యీసంస్థ ప్రస్తుతమంత నీచస్థితిలో ఉందన్నమాట.

జగ్గ—అదటుంచి నాయనా! యీ సెలవులంతా నీవిక్కడే కాలం గడపాలి. ఏమంటావు?

ఆనం—మీ మాటను కాదంటానా? అలాగే! యింతకూ పూర్ణ ఏమీ అభ్యంతర పెట్టదుకదా!

పూర్ణ—మంచివాడవే. కోడలు కంటానంటే అత్తగారు వద్దంటున్నట్లుంది నీమాట. నీవుంటానంటే నేనభ్యంతర పెడతానా!

జగ్గ—దానిప్రాణాలన్నీ నీమీదనే ఉన్నాయి. నీవు మద్రాసులో ఉన్నంతకాలమూ, క్రిష్టమస్ సెలవలెప్పుడొస్తాయా, నీదర్శన

భాగ్యమెప్పుడు లభిస్తుందా అని ఎదురుతెన్నులు చూసుకొని కూర్చుంది.

ఆనం—నేనంటే అంత అభిమానమున్నమాట పూర్ణకు యింకేమి.

జగ్గ—అమ్మాయి! ఆనంద్‌కు 'టీ' యిచ్చేవా! ఆతనికోసం ప్రత్యేకంగా ఫలహారాలు తయారుచేస్తానన్నావే?

పూర్ణ—అయ్యో! తెలివితక్కువదాన్ని. యీ ఆనందంలో పడిపోయి ఆసంగతే మఱచిపోయేను.

జగ్గ—ఎంతపని చేసావు? త్వరగా తీసుకొనిరా. శ్రమపడివచ్చాడు.

ఆనం—ఊఁ. గానివ్వండి త్వరగా.

పూర్ణ—పట్టుకొస్తానుండు (లోపలికి పోవును)

జగ్గ—నాకు లోపలపనుంది. వెళ్ళివస్తాను నీవేమి మొహమాట పడకనాయనా! సొంతయిల్లులా మసలాలి.

ఆనం—నాకు మొహమాటమేమిటండీ! అంతకాలము మీ యింట్లో పెరిగేనుకదా! మీకటువంటి సందేహమక్కఱలేదు.

జగ్గ—మంచిది. అలాగేఉండాలి వెడతాను. (నిష్క్రమించును)
(పూర్ణ ఫలహారముల పళ్ళెముతో ప్రవేశించి, ఆనంద్ ఎదుట బెట్టి వడుచూ తినిపించుచుండును) (తెర పడును)

## రెండవ రంగము

ప్రదేశము : Hostel సమీపమున

[ప్రవేశము : కుమార్ సైకిలుపై]

కుమా—(సైకిలునాపి) ఉస్. అబ్బ! ఏమి తాపత్రయముపట్టుకుందిరా బాబు. (యిటునటుజూచి) లీల యీపాటికి వచ్చియుండాలే? ఎక్కడా కనుపించదే? (కొంచెమునడచి) యిదేలాఉంది లీల ఉండదగది. కేకేసిచూస్తాను. కొంపదీసి ఎవరైనా వింటారేమో? (మఱల ధైర్యము తెచ్చుకొని) Damit యింకా

ఆశ్చర్యమేమిటి? కేకేసిచూస్తాను. లీలా! లీలా! లీలా! నెమ్మదిగా (నిస్పృహతో) No reply (మెల్ల నెమ్మదిగా యీల వేయును) యీవాళకూడా disappointment అన్నమాటే. యివాళ తప్పక వస్తానని letter వ్రాసిందే (ఆలోచించి) అయినా ఆడవాళ్ళ హృదయ మగాధము. వాళ్ళని attract చేయడానికెన్నైనా అవస్థలు పడాలి.

సీ. సూట్లు బూట్లు ధరించి ♦ షోకుబనాయించి
మన్మథుడాయన ♦ మసలవలయు
ప్రేమలేఖలు చాల ♦ గానములు పరివ్రాసి
పండితోత్తముడన ♦ బరగవలయు
కాంత కోరినవెల్ల ♦ కాదనకుండగా
యిబ్బంది పడకున్న ♦ యింపుగా మెలగు
చెప్పినపనియంత ♦ తప్పక [illegible]
సేవకునివిధాన ♦ చేయవలయు
గీ. సర్వమును విడి దాసుడై ♦ సన్నుతాంగి
పాదసేవనే సల్పుచు ♦ ప్రాణసఖుడ
పెన్నిధి లభింపనుండెనే ♦ పిదపనైన
కాలము గడుపవలె నిది ♦ కర్మగాదె?

నా lecture finish అయిందికాని లీలాదేవి దర్శనభాగ్యము లభింపదయ్యె 'కష్టఫలదే' అన్నారు పెద్దలు కాస్సేపిక్కడ wait చేస్తాను. (అని కూర్చుండును)

[లీల సొగసుగా అక్కడ ప్రవేశించును]

కుమా—(లీలను జూచి కన్నులు మూసి) హా! లీలాదేవీ! నీలీలలు తెలియంగ నాతరమా? నా హృదయ [illegible] రావా! నన్ను నీ బాహుబలబంధనముల బంధింపవా! సర్వకాల సర్వావస్థల యందును నీనామామృతమే పానముచేయుచున్న నాకు నీ యధరామృతము చవిచూపి ధన్యుని చేయవా! హా! భగవత్స్వరూపిణి! పాహిమాం, పాహిమాం.

లీల—(తనలో) వెఱ్ఱివాడు. నాకై ఎంతపరితపించుచున్నాడు యీతడు నిష్కల్మషహృదయునివలె గన్పించుచున్నాడు స్ఫురద్రూపి. నేనాడించినట్లల్లా ఆడేలా గున్నాడు. యిటువంటి chance పోగొట్టుకొని, నా నవ యవ్వనశోభ నడవికాచిన వెన్నెలవలె వ్యర్థాచేయనేల?

(కుమార్ కన్నులువిప్పి, లీలవైపుచూచును. లీల అటుచూడగనే మాటల యథాప్రకారముగా నుండును)

కుమా—ఓ! దేవతా! నీకింకను కరుణరాదా!

లీల—(తనలో) నన్ను చూచి నాటకం ప్రారంభించినట్లున్నాడు. ఒక ఆట ఆడించాలి. (పైకి) వత్సా! నీభక్తికి మెచ్చితిని తెమ్ము. నీయభీష్ట మెయ్యదియో కోరుకొనుము.

కుమా—ధన్యుడను. ధన్యుడను. దేవతా! నాపై యనుగ్రహము కల్గినదా! నిశ్చయముగా నేను కృతార్థుడను. (తెరచికన్నులు నులిమికొనుచు లీలవైపు నడచుచుండును)

లీల—నిజముగా నిను ధన్యునిచేయవచ్చినాను. రమ్ము కైవల్యపద మిప్పింతును. నేను మృత్యుదేవతను రమ్ము.

కుమా—ఆ! మృత్యుదేవతా! అమ్మో! (కన్నులువిప్పి) హల్లో My dear angel లీలా! నీవా! ఎంతయదృష్టము (దగ్గరగా చేర బోవును)

లీల—మొదట దూరముగా ఉండి మాట్లాడు యిప్పుడు మనమెక్కడున్నామో తెలుసునా! నా లేడీహాస్టలు యిది.

కుమా—యెచ్చట నున్న నేమి? లీలా! నీకొఱకు నేనెట్టికష్టమైనను భరింతును. నిన్ను మనసార ప్రేమించితిని. నాప్రేమ దేవతవు. నా అర్థాంగివి కమ్ము. నాధర్మపత్నివి కమ్ము. నాపాలిటభాగ్యలక్ష్మివి.

లీల—ఊఁ! అను. గృహలక్ష్మి, వరలక్ష్మి, చెంచులక్ష్మి.

కుమా—(నిరుత్తరుడై నిలచియుండును)

లీల—అబ్బబ్బ! ఏమిటీసోది? చెవులు బ్రద్దలయిపోతున్నాయి.

కుమా—ఏమీ! నా కవితాధోరణి నీవీనులకు వెగటుగా దోచెనా! అట్లయిన నన్నిప్పుడాంధ్రమున మాట్లాడుమందువా? ఆంగ్లమున మాట్లాడమందువా?

లీల—నీ పాండిత్యము వెల్లడవుతూంది, చాలించా ధోరణి. మామూలుగా సామాన్యభాషలో మాట్లాడలేవా?

కుమా—అయిన గ్రాంథిక భాషలోనా? గ్రామ్యభాషలోనా? లేక అచ్చ తెనుగునా?

లీల—నీకే 'కవిసార్వభౌముడో ఉభయకవి మిత్రుడో, సహజ పాండిత్యో' ఏదో బిరుదు తగిలించేవరకూ వదలేటట్టులేవు. సామాన్యభాషలో ఏదనమంటూంటె అర్థంకాదూ!

కుమా—నాకు భాషలో ఏడవడము రాదే!

లీల—అలాగైతే నే నేర్పిస్తానుండు. (అని చెవిపట్టుకొని, తనవద్దనున్న ఉత్తరములకట్ట పైకితీసి) యీ గ్రంథమంతా ఏమిటి! మహేండి చేసినపనేనా యిది.

కుమా—(చూచి) అవి, యీ కుమారుగారు లీలాదేవికి మనఃపూర్వకముగా, నిష్కల్మష హృదయముతో వ్రాసిన ప్రేమలేఖలు.

లీల—ప్రేమలేఖలా? ఎవరికి వ్రాసేవో తెల్సునా!

కుమా—నేను మొదటే చెప్పేను. Collgege hostel లో నివసిస్తూన్న నా క్లాసుమేటు శ్రీమతి లీలాదేవిగారికి—

లీల—చాలించు నీవాగ్ధాటి. కనబడిన ఆడదానికల్లా ఉత్తరము వ్రాయడమేనా? మంచీచెడ్డా ఆలోచించుకోనక్కఱలేదా? ఆడవాళ్ళంటే అంత లోకువగా నున్నారనుకున్నావా? యిప్పుడీ ఉత్తరాలన్నీ అధికారులకు చూపిస్తే నీ పనేమవుతుందో ఆలోచించుకొన్నావా?

కుమా—(కంగారుతో యిటునటు జూచి) ఆ! వస్తున్నానురా! ఆగు. మఱి నే వెళ్ళివస్తాను. (పోవును)

లీల—ఎక్కడకీ ప్రయాణము. నిన్ను నేను వొదులుతాననుకొన్నావా? ముందు వీటికి సమజాయిషీ చెప్పు.

కుమా—తరువాత మాట్లాడుకొందాము. అదుగో! నా కోసము frierd ఒకడు wait చేస్తున్నాడు. వెళ్ళివస్తాను.

లీల—friend లేడు. గిండూ లేడు. ఆగవోయి. నాకు సమాధానము చెప్పి మరీ పో.

కుమా—సమాధానాని కేముంది లీలా! నిన్ను మనసార ప్రేమించేను. నా ప్రేమ ఐహిక సుఖములనాశించుతుచ్ఛ ప్రేమ కాదు. అంతరంగికమైన, అనుపమానమైన యద్భుత ప్రేమ. నా ప్రేమను నీకు వెల్లడిచేయడానికి నీకీ ఉత్తరాలు వ్రాసేను. యిన్నాళ్ళ నీవ్రాకకుండి ఈవాళ ఇక్కడ Meet అవుదాము రమ్మని కబురంపబట్టి యిక్కడకు వచ్చేను. యిప్పుడు వెళ్ళిపొమ్మంటే వెళ్ళిపోతాను.

లీల—వెళ్ళిపోవడానికేనా నీవు వచ్చింది? నీ సంగతి పూర్తిగా కనుక్కుంటే నేగాని వదలను.

కుమా—నిజమే నా ప్రాణాలన్నీ నీ చేతిలో ఉన్నాయి. నా ప్రేమను నీవాదరించినావు సరే. అనగ్రదొక్కినావు సరే! నా మనస్సులోని ఉద్దేశ్యాన్ని వెలిబుచ్చేను. తర్వాత నీయిష్టము.

లీల—ప్రేమ లేదు గీమ లేదు. యిటువంటి పిచ్చిపిచ్చి వేషాలెప్పుడూ వేయకు. యీసారికి క్షమిస్తున్నాను. నడు; యింటిదారిపట్టు.

కుమా—సరే! నీహృదయము యింత రాతిహృదయమని గ్రహించలేదు. శలవు. Good night (అని కొంతదూరము నడచి తిరిగివచ్చి) ఆ ఉత్తరాలు మాత్రము చించెయ్యి.

లీల—అలాగే లే.

కుమా—మరి వెళ్ళిపొమ్మంటావా? అంతేనా?

లీల—యింకా సందేహమా? ఊఁ నడు. త్వరగా.

కుమా—అంతేనా! యింకేమీ.....

లీల—నడు. నడు. త్వరగా.

కుమా—శెలవు (పోబోవును)

లీల—కుమార్! కుమార్! అబ్బ! నిజంగా వెళ్ళిపోతున్నావు?
(తీసికొనివచ్చును)

కుమా—నిజంగాక అబద్ధమనుకుంటున్నావా? వెళ్ళిపొమ్మన్నాకా యింకెందుకు నేనిక్కడ

లీల—వేళాకోళాని కన్నానుగాని నీమీద నాకుమటుకు ... ...

కుమా—వేళాకోళమా అది. అయితే నీవు నన్ను ప్రేమిస్తున్నావన్న మాట!

లీల—యిటువంటి హృదయాలు ఒక్కటే.

కుమా—లీలా! ఎన్నాళ్ళకు నీహృదయము మిచ్చేవు. ధన్యుడను. సరిగాని. ఆకారాగృహమునుండీ ఎలా యివతల పడ్డావు. చెట్టు క్రింద ముళ్ళకంచెలోగా అక్కడ Servant-maid లేదూ?

లీలా—లేకేమి? దాన్ని వలలో వేసుకున్నాను ఆపది తలచుకుంటే అడ్డుటుందా?

కుమా—లీలా! నాకోరిక నెరవేరింది యిక్కడనుంచి మనవివాలాగ రహస్యంగా కలుసుకుంటూ మనజీవితాన్ని సార్థకం చేసుకుందాము.

లీల—అవును. ఆనందంకోలికలలో నోలలాడుదాము పదు.

(నిష్క్రమింతురు) (తెర పడును)

---

## మూడవ రంగము

ప్రదేశము కాలేజీలో ప్రిన్సిపాల్ గారి ఆఫీసుగది

[ప్రవేశము ప్రిన్సిపాల్, బాలకృష్ణన్.]

బాల—(కుర్చీలో కూర్చొని ఆఫీసువర్కు చేసుకొనుచుండును)

జగ్గ—(చేతిలో పేపర్సుతో ప్రవేశించి) Good morning Sir!

బాల—(జగ్గన్నను జూచి) Good morning. Weil, come along. Head-master. Take your seat.

జగ్గ—Thanks (కూర్చుండును)

బాల—ఇప్పుడు ఏమిపనిమీద వస్తిరి?

జగ్గ—అయ్యా! నేను కొన్ని ముఖ్యవిషయాల్ని తమరు ప్రశాంతంగా విన్నట్లు అయితే మనవిచేసుకుందామని వచ్చాను.

బాల—అవును, నాకు యిప్పుడేమి objection లేదు, ఏదీ, అందువలన మీకు చెప్పదలచుకొన్నది చెప్పవచ్చును.

జగ్గ—అయ్యా! నేనిప్పుడు నిష్కల్మషహృదయంతో నిర్మొగమాటముగా మాట్లాడబోవుచున్నాను. ఒకవేళ మీకు ఏమైనా కొంచెం కష్టంకలిగించే విషయాలుండవచ్చును, కానిఅవి నేను తమకు మనవిచేయక తప్పదు. కాబట్టి మీరు ఆగ్రహించక అనుగ్రహంతో వింటారని తలుస్తాను.

బాల—మీరు చెప్పదలచుకొన్నదీ చెప్పొచ్చునని యిదివరకే చెప్తినిగదా!

జగ్గ—చిత్తము. రౌతునిబట్టి గుఱ్ఱము నడుస్తుంది అలాగే అధికారిని బట్టి అతనిక్రిందివారుంటారు. అధికారి అసమర్థుడైనట్లయితే అతని క్రిందివారిష్టమొచ్చినట్లాడతారు. యీవిషయం మీరొప్పుకుంటారా లేదా?

బాల—అవును. ఒప్పుకుంటాము. అయితే,

జగ్గ—యిప్పుడు మనమొక మహాసంస్థకధికారులము. ఈసంస్థయొక్క హానివృద్ధులు మనమీద ఆధారపడి ఉన్నాయి అందుచే బాధ్యతను గుర్తించుకొని మనము ప్రవర్తించాలి. ఏవిషయమైనా సరే, నిష్పక్షపాతబుద్ధితో న్యాయాన్యాయవిమర్శన చేయాలి, మనవిధిని మనము జాగరూకతతో నిర్వర్తించుకోవాలిగాని. తల్లియే పిల్లలకు విషమిడినట్లు, కంచెయే చేను మేసినట్లు ప్రవర్తిస్తే ప్రయోజనముందా?

బాల—అయితే యిప్పుడు నన్ను ఏమిచేయమందురు?

జగ్గ—అయ్యా! అధికార్లకు మీకు తెలియనిదేముంది. మన మేపనైనా, ఆతడు నియోగి, యీతడు వైదీకి యనిగాని అతడాని

ధ్రుడు, యీతడరవయునిగాని ఏవిధమైన భేదము లేకుండా చేయాలి. అంతేగాని ఆంధ్రులను గోంగూర పచ్చడని అరవలు, అరవలను సాంబారు యిష్టీయని ఆంధ్రులు, దూషించుకుంటూ ఐకమత్యము లేకుండా ఉంటే లాభముందా ?

శాల—మీరుచ చెప్పింది నాకుడా grasp అయింది. నేనుద ఎప్పుడటువంటి feeling ఉంచుకోనలేదు. ఆంధ్రులకే అంతా preference యిస్తినే.

జగ్గ—అయ్యో! గురివిందగింజ అడుగుననున్న మచ్చను తెలిసికోలేదు. అలాగే మనతప్పు మనకు తెలియదు. ప్రతీవానికి స్వజాత్యభిమానముండవలసినదే. కాని దానివలన న్యాయానికి భంగం రాకూడదు. ఇతరులకు హాని జరుగకూడదు. మన దృష్టిపథంలో అందరిను సమానంగానే చూడాలి జాతిమత వైషమ్యాలను పాటించకూడదు.

శాల—అడ్డడ్డా! మీరు చెప్పింది నాకు నిండా బోధపడింది అలాగ నేనుదా ఎప్పు ప్రవర్తించలేదని చెప్పుటనికదా!

జగ్గ—మీరంటున్నారు కాబట్టి నేను నిర్మొగమాటంగా, నిర్భయంగా, నిరూపిస్తాను యీమధ్యనే మీరొక Tamilian boy కి free గా చదువుకోటానికి permission యిచ్చేరు. ఆంధ్రుడొక డాప్రశయిస్తే వీలులేదన్నారు. జ్ఞాపకముందా? యిది సమంజసమేనా ?

శాల—I see. ఇదియా మీరుచేప్పేది. నేను Tamilians కన్న Andhras నే చూస్తి అలా admit చేస్తిని Then next.?

జగ్గ—అక్కడికా విషయముయిందా? యింక రెండవదేమిటంటే; మందలో ముందు గొర్రె ఎలానడుస్తే మిగతా గొర్రెలు దాన్ని వెంబడిస్తాయి. అలాగే మన ప్రవర్తననుబట్టి మన క్రిందివాళ్ళుంటారు. ప్రస్తుతము మన Leniance తీసికొని ఆడవాళ్ళు మగవాళ్ళు యిష్టమొచ్చినట్లు గంతులేస్తున్నారు.

విచ్చలవిడిగా తిరుగుతున్నారు. హాస్టలులో ఎటువంటి దారుణాలు జరుగుచున్నాయో చిత్తగించారా ?

బాల—ఏమిజరిగింది ?

జగ్గ—లీల అనే ఒక అమ్మాయి కుమార్ అన్న ఒక student తో సంబంధమేర్పరుచుకొని రోజు Hostel నుండి ఉపాయముగా తప్పించుకుంటూ విహరిస్తూంది. ఆమె నాకళ్ళల్లో అనేక సార్లు బడ్డది. నేను యిద్దరికికూడా అనేక warnings యిచ్చేను. కాని నామాట పెడచెవిని పెట్టేరు.

బాల—అయితే ఏమిచేసిరి ?

జగ్గ—అశ్రద్ధవహిస్తే లాభంలేదని యిద్దరిని చెరొక పదిహేనురోజులు suspend చేశాను.

బాల—అడ్డడ్డ రొంబకష్టం తెచ్చిపెట్టిరే. మనందా అంత strict గా ఉంటేయెలాగ ? ఆ వారు యిప్పుడు క్లాసులో ఉంటారు కాబోలు. వారిని ఒకసారి పిలిపించండి.

జగ్గ—అలాగే (అని తెలవండి జూచి) ఒరేయి! అప్పడూ! స్కూల్ ఫైనల్ 'సి'' సెక్షనులో లీల అనే అమ్మాయి, కుమార్ అనే అబ్బాయి ఉంటారు. Principal గారు రమ్మంటున్నారని త్వరగా తీసికొనిరా !

(తెరలో చిత్రము)

బాల—ఎంత litigation వచ్చింది?

జగ్గ—అయ్యా ! మనము సంస్థ నభివృద్ధిలోనికి తీసికొని రావాలంటే యిటువంటి విషయాల్లో strict గా ఉండక తప్పదు. బాగా ఆలోచించండి. యిదిగో ! యీ సందర్భములో వారివద్ద పుచ్చుకొన్న explanations వగైరాలు. యీ రికార్డుచిత్తగించండి (Principal record చూచుచుండును. లీల, కుమార్ ప్రవేశింతురు)

లీల—నమస్కారమండి, ప్రిన్సిపాల్ గారూ !

బాల—(చూచి) ఏమి నీవుదా లీలవు. అమ.

కుమా—Good morning Sir.

జగ్గ—అతడే కుమార్ అను విద్యార్థి.

లీల—నన్ను బిలువనంపిన కారణము ?

బాల—అమ. నీమీద హెడ్మాస్టరుగారేదో ఫిర్యాదు చేస్తున్నారు. నీవు ఆవిషయంలో ఏమి చెప్పెదవు ?

లీల—అయ్యో ! చెప్పడానికేముంది ? యీతను నాకు దగ్గరబంధువు, మా ఊరివాడే. అందువలన యీతను నేను మాట్లాడుకుంటాం. దగా చూచి అనవసరంగా Head-master గారనుమాన పడ్డారండీ !

కుమా—అంతేనండి. నిజమే అనవసరంగా మామీద అపవాదు వేస్తున్నారండి. తమరు బాగా ఆలోచించాలి.

జగ్గ—Damit యింకా నన్ను బుకాయిస్తున్నారా ? అయ్యో ! మీర్ని బంధువులే అయితే పగలు మాట్లాడుకోక, హాస్టలునుండి తప్పించుకొని గహాస్వస్థలంలో రాత్రి మాట్లాడుకోవలసిన అగత్యమేమొచ్చింది ? మీళ్లు చెప్పేదంతా Humbug Sir ! వీళ్ళిద్దరినీ తప్పకుండా చెరొక పదిహేను రోజులు suspend చేయవలసిందే.

లీల—హెడ్మాస్టరుగారు చెప్పినదంతా శుద్ధబద్ధమండి ! మేము night ని ఎప్పుడూ కలుసుకోమండి. కావలిస్తే అక్కడ Servant-maid మీకు సాక్ష్యమిస్తుంది,

కుమా—Yes Sir ! That is right. అది నిజమేనండి.

బాల—Well. ఏమయితే నేమి ? యింతటినుండి జాగ్రత్తగా ఉండండి తెరిమ.

కుమా—నల్లతెరిమ Sir !

జగ్గ—అయ్యా! యీలాగ పిల్లకు కనేసార్లు చెప్పడమయింది. యీసారి తప్పక దండించి తీరాలి.

బాల—నేనుదా చెప్పదును. మీరు దా ఊరుకోండి. (లీలను జూచి) అమ్మాయి! యిప్పటికి మీకు శిక్షతీసివేస్తిని నీవు దా ఒకసారి నా బంగాళావద్ద meet అయితే Detailed information తీసికొందును. అందుచేత తప్పకనన్ను కలుసుకో. జాగ్రత్తగా ఉండండి. Now you can go.

లీల & కుమా—Thanks. (Hed-master వైపు కోరగా చూచుచు నిష్క్రమింతురు)

జగ్గ—అయ్యా! యిలాగ మీరు ప్రవర్తిస్తే సంస్థ బాగుపడదు. నాకు కొంత అధికారముంది. నన్ను వాళ్ళముందు fool గా చేసేరు.

బాల—మీకు దా తెలియదు. నేను Principal ని ఎలా చెప్తే అలా చెయ్యాలి. తెలిసి మసల్కోండి.

జగ్గ—సరే; లెండి. యిదెందుకొచ్చిందో, చెట్టు చెడుగాలానికి కుక్కమూతి పిందెలట ఆఖరుకి యిదెలా పరిణమిస్తుందో చూద్దురుగాని. శెలవు.

బాల—అను. (జగ్గన్న నిష్క్రమించును)

బాల—O! my God! What a fine girl she is? నాకీ అమెను తప్పక అనుభవించాలి. యింటికి రమ్మంటినిగదా! Well. ఏమవుతుందో చూద్దాము. (నిష్క్రమించును)

(తెర పడును)

# డాక్టరు

# ద్వితీయాంకము

## మొదటి రంగము

ప్రదేశము : ఉద్యానవనము

[ ప్రవేశము . పూర్ణానందులు ]

పూర్ణ—ఆనంద్ ! యీ శెలవులు యిరువదిరోజులు ఎంత ఆనందంగా గడచిపోయేయి.

ఆనం—ఆనంద్‌కు ప్రక్కన పూర్ణకూడా ఉంటే పూర్ణానందమే. అటువంటప్పుడిటువంటి వెన్నిరోజులయినా గడచిపోతాయి.

పూర్ణ—ఆనంద్ ! రేపేనా నీ ప్రయాణము.

ఆనం—అవును.

పూర్ణ—(ఆనంద్ దగ్గరగా జేరి) ప్రియా ! చూడు మా రసాలవృక్షము, అందేమున్నది ?

ఆనం—అవును. అచ్చట నొక చిలుకల జంట సంతోషముతో నాడుకొనుచున్నది.

పూర్ణ—అందొక దానిని విడదీసినచో రెండవదిపడు పరితాపము చెప్ప నలవియగునా ?

ఆనం—నిజమే. కాని వానిని వేఱుచేయగల సమర్థుడెవ్వడు ?

పూర్ణ—సమర్థులు లేకేమి ? వేటకాడు వానిని చూచినచో ఊరక విడచునా ?

ఆనం—వెఱ్ఱిదానా! వేటకాడు మాత్రము వానిని వేఱుచేయగలడా? ఆతడు వాని బాహ్యశరీరములను వేరుచేయగలడు. కాని ఆత్మలను వేఱుచేయగలడా?

పూర్ణ—ఆత్మలను వేఱుచేయలేకున్నను బాహ్యశరీరములను వేఱుచేసిన చాలదా? వియోగబాధ భరింప దుస్సహముగదా! (దగ్గరగా చేరును)

ఆనం—(చిఱునవ్వుతో) పూర్ణా! నీహృదయగతాభిప్రాయమును గ్రహించితిని. నిన్ను విడిచిపోవుచుంటినని యీ పరితాపము? యింకెంత? యీ నాల్గునెలలు గడచిన తర్వాత మన కెడబాటు లుండవుగదా!

పూర్ణ—అబ్బా! యింకా నాలుగునెలలా? నాకు నిముసము యుగంలా ఉంది.

ఆనం—నాకు అలాగే వుంది. కాని సహించక తప్పదు.

పూర్ణ—ఆనంద్! తర్వాతమటుకు యెడబాటులు లేవని ఎలా చెప్పగలము? వివాహమనెడి శాశ్వత బంధమేర్పడలేదుగదా!

ఆనం—పూర్ణా! శాశ్వతబంధ మేర్పడ కేమి? ఏనాడు మనయిరువురి హృదయాలు ఒక్కటైనవో ఆనాడే మనకు మానసికంగా శాశ్వతబంధ మేర్పడింది.

పూర్ణ—కాని శాస్త్రసమ్మతముగా యేర్పడవద్దూ? లేకపోతే లోకులు ఊరుకుంటారా?

ఆనం—అదెంత. కష్టపడిచదివి యీ Course finish చేసినంటే అదీ జరుగుతుంది.

పూర్ణ—"కష్టపడి చదవాలి, కష్టపడిచదవాలి" అని ఏమిటంత ఘనంగా చదువును గురించి చెపుతావు. ఎంతో మహాకష్టమనుభవిస్తూన్నట్టు. నేను మొన్న డాక్టరు "సుభద్రమ్మ" గారిని యీ M. B. B. S. course కష్టమేనటండీ?" అని అడిగితే "అబ్బే! అదెంతమ్మ! చాలా సులు" వని చెప్పేరే!

ఆనం—ఆడవాళ్ళ కన్నీ సుళువుగానే కనబడతాయి వాళ్ళకే పరీక్షలు, ఏ చదువులు కష్టమనిపించవు.

పూర్ణ—ఎందుచేత ?

ఆనం—వాళ్ళకంటే Preference కదూ ! చూడూ!

సీ. క్రింది తరగతుల ♦ యందు మార్కులువేసి
ప్యాసుచేయుదురెగా ♦ యద్భుతముగ
పెద్దతరగతుల ♦ ఫెయిలుగాకుండగా
ఆశ్రయింపులతోడ ♦ నది లభించు
మర్మములనుదెల్పు ♦ మానక రమ్మంద్రు
గురువుగారింటికి ♦ కూర్మితోడ
విశ్వవిద్యాలయ ♦ ఘనుత పరీక్షలు
పోయినచాన్సగా ♦ పొలతులకును

గీ. ఇన్ని సౌకర్యములుగల్గ ♦ నెందరేని
యతివలిట్టె కృతార్థులౌ ♦ టబ్బురంబె
కష్టమెంతేని, ప్యాసవ ♦ గల్గుగాదె
పురుషులకు పరికింపగా ♦ పుడమిలోన !

అందుచేత ఆడవాళ్ళు ప్యాసయినారన్నా చదువుచాలానులభమన్నారన్నా, ఆశ్చర్యము లేదు.

పూర్ణ—నిజమే, యీ females కి Preference చూపించడం విషయంలోనే కాదూ, నాన్నగార్కి Principal గారికిపడటం లేదూ !

ఆనం—ఆ! సరిగాసి! పూర్ణా! మీనాన్నవిషయం యెత్తితే జ్ఞాపక మొచ్చింది. ఇంతకూఆయన మనవివాహానికి ఒప్పుకుంటాడా?

పూర్ణ—ఏనాడు నిన్ను school లో చూచి నీ తెలివితేటలుగ్రహించి నిన్నుపైగా ఉండనీయక తాను చేరదీసెనో, ఆనాడేమనయిద్దఱిని దంపతులుగా చేద్దామని ఆయన కభిలాష జనించింది.

ఎప్పుడు నీ M. B. B. S Course పూర్తవుతుందా, ఎప్పుడు మనయిద్దర్నీ భార్యాభర్తలను చేసి తన బాధ్యత వొదుల్చుకుందామా, అని నిరీక్షిస్తున్నారు.

ఆనం—అవును. ఆయనకు మాత్రం యింకెవ్వరున్నారు? భార్యలేనే లేదుకదా! నీ ఆనందంకోసం ఆయన ఏపనైనా చేస్తారు.

పూర్ణ—మనమిద్దరము యిలా ఆనందంగా కాలక్షేపం చేయడము చూచినప్పటినుంచీ ఆయనకీ అభిలాష మరింత ఎక్కువైంది.

ఆనం—అలాగైతే ధన్యులమేకదా!

పూర్ణ—కాని ఆనంద్! నిన్ను సీతాపతిరావుగారి కుమార్తెకిచ్చి వివాహంచేయాలని మీనాన్న అనుకుంటున్నారుటగా?

ఆనం—పూర్ణ! ఎందరెన్ని అనుకొన్న నేమి? యింక నాహృదయము పరాధీనము కాదు. నీవే నాహృదయాధిదేవతవు (దగ్గరగా తీసికొనుచు)

పూర్ణ—యింతకూ ఒకఫలం ఉంటే దానికొఱకు అనేక పక్షులు కాసుకొని ఉంటాయి అందులో ఏపక్షికి దక్కుతుందో!

ఆనం—ముందునుంచీ ఏపక్షి దాన్ని అనుభవించటానికి సమయం కొఱకు వేచియుంటుందో ఆపక్షికే దక్కుతుంది.

పూర్ణ—అంతేనంటావా?

ఆనం—తప్పక.

పూర్ణ—అయితే భ్రమరము యింకే యే పుష్పముచేతను ఆకర్షించబడదుకదా!

ఆనం—ఎన్నటికీ జరుగదు. పూర్ణ! నీచే ఆక్రమింపబడిన యీనా హృదయంలో యింకొకరికి ఆశ్రయము లేదు. నీవే నాధర్మపత్నివి. నేను 'డాక్టరు' పరీక్ష పూర్తి అవగానే వచ్చి తప్పక నిన్ను పెళ్లిచేసుకుంటాను. యిందుకు యీపంచభూతములే సాక్షి.

పూర్ణ—డాక్టరుగారు మాటతప్పరుగదా!

ఆనం—నా కంఠంలో ప్రాణమున్నంతవరకు నేను మాటతప్పను. నిన్ను తప్పక పత్నిగా స్వీకరిస్తాను యిదిగో ఆభగవంతునిసాక్షిగా ప్రమాణము చేయుచున్నాను. (చేతిలో చేయి వైచును)

పూర్ణ—చాలు. నాజీవితము సార్థకమైనది. అమితానందంగా ఉంది.

ఆనం—పూర్ణా! మళ్ళీ ఎన్నాళ్ళకో! యేదీ కడసారి.........
(ముద్దు పెట్టుకొనుచుండును)

(తెర పడును)

---

## రెండవ రంగము

ప్రదేశము : ప్రాలియున్న తోటముంగిట

[ ప్రవేశము : కుమార్, లీల ]

కుమా—ఆహా! యీ నిశీధ సమయమెంత ప్రశాంతంగా ఉంది. లీలా! చూడు.

ఉ. చక్కని రాత్రులందు నవ ♦ శారద చంద్రికలుండు వేళ నే
చక్కని చుక్కయైనసతి ♦ సన్నిధియున్నయట్లైన సంతసం
బక్కజనావహిల్లు తను ♦ వంతయు గంపమునొందుగాదె యీ
రక్కలనుండి చంద్రమునకు ♦ లేశము సౌఖ్యము గల్గునట్లుగాన్ !

లీల—చింత చచ్చినా పులుసు చావలేదన్నట్లు ఒక మూల కష్టంలో ఉన్నాగాని నీ భావకవిత్వ మొదిలేవుగావు.

కుమా—అయితే నన్నిపు డేమి చేయమంటావు.

లీల—గంగలో దిగమంటాను.

కుమా—దేవీ! నీయాజ్ఞలను శిరసావహింప సంసిద్ధుడను. కలవా?

లీల—నీతో గొప్పచిక్కే వచ్చింది. ప్రస్తుత మీ విపత్సముద్రము నుండి దరిచేరేపద్ధతి చూడు.

కుమా—యీ పాడుబుఱ్ఱ కేమంటి ఆలోచనలేమీ తట్టవు. అది నీవే ఆలోచించు. నీ వెలా చేయమంటే అలా చేస్తాను.

లీల—నా కేమీ తోచడం లేదు దర్జాగా రాత్రిళ్ళు రహస్యంగా కలుసుకుంటూ కాలము గడిపేము. అసలు పుస్తకము ముట్టనే లేదుకదా! వెంటనే దానికి ప్రతిఫలంగా Selection examinations లో Marks తక్కువ వచ్చేయి. యిప్పుడు మన్ని Selectons లో ఉంచేసారు. ఏమిచేద్దాం?

కుమా—ఏముంది చేయడానికి? పోనీ ఏమైనా Marks వేస్తారేమో అని ఆ Head master గారిని ఆశ్రయించేము. ఆయనకు మన ప్రవర్తన యిష్టంలేక ఎలాగైతేనే సున్నప్పిడత చేతికిచ్చేరు. యింకెవరి నాశ్రయిద్దాము.

లీల—యీసంగతియింది తెలుస్తే Papers దిద్దేవారి నేఆశ్రయిద్దుము. చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకున్నట్లుయింది.

కుమా—అయ్యబాబోయి! యిప్పుడు నేనుగాని Select అవకపోతే యింకేమైనా ఉందా? మాబాబు చక్కగాతోమిన రాగిచెంబు చేతికిస్తాడు. మున్నెత్తుకోమని అయ్యబాబోయి. కొంప మునిగి పోదూ!

లీల—వెర్రివాడ! ముందాలోచన కానియ్యి. తర్వాతఅమ్మబాబుల సంగతి చూచుకుందాము.

కుమా—యీ విపత్సమయమున మసల నాదరించువారా ప్రిన్సిపాలు గారు తప్ప అన్యులు గానరారు. వారిని శరణంబువేడిన అభయ మీయగలరు.

లీల—అబ్బబ్బ! "చస్తున్నానందిమంత్రి మన్నట్లు" యిప్పుడుకూడా ఆ కవిత్వధోరణేనా! మామూలుగా మాట్లాడుదూ.

కుమా—ఆ! సరేలే! చెబుతున్నానుగా! ఆ Principal గారి నాశ్రయిస్తే పని జరుగవచ్చును.

లీల—బాగానేఉంది. కాని యిదివఱకొకసారి ఆయన Banga-low వద్దకు రమ్మన్నారు. వెళ్ళలేదు. కోపగిస్తారేమో?

కుమా—'లీలయింది కాదు, యిప్పుడు వచ్చేనని' చెప్పు.

లీల—పోనీ, నీవువెళ్లి చూస్తేనో!

కుమా—అబ్బెబ్బె! అదేమీలాభంలేదు మొగవాళ్లైతేమోమైనా చూడరు. ఆడవాళ్లైతే అంతా జరుగుతుంది.

లీల—యీరాత్రిసమయములో వెడితే బాగుంటుందా?

కుమా—అన్నిసమయాలకన్న యిటువంటిసమయాల్లో నే ఆడవాళ్ళతో అతిశ్రద్ధగా మాట్లాడుతారు.

లీల—యింతకు ఆయన యింట్లో ఉంటారో ఉండరో?

కుమా—95% (నైన్‌టీ ఫైవ్ పెర్‌సెంట్) ఆయన యింటిదగ్గర యుండడము Surety యే.

లీల—ఆయన యింటిదగ్గర యింకెవ్వరైనా ఉంటే యీరాత్రి నారాక చూచి అనుమానపడరా లేమో?

కుమా—అటువంటి అనుమానాలేం పెట్టుకోకు. యేమైనాసరే అనుకొన్నపని వెంటనే చేయడమే కర్తవ్యము. నదు యిటేపని [illegible] ఆలస్యము చేయకు వెళ్ళు.

లీల—సరే. నీవుకూడా రాకూడదు?

కుమా—నేనీ వేషంలో రావడమే?

లీల—అబ్బే! అలా ఎందుకు? నాలాగ తయారవు.

కుమా—నీలాగ తయారవడానికి Equipment ఏమీ లేదే?

లీల—ఏమీ అక్కర్లేదు. నేను తయారుచేస్తానుగా!

(అని [illegible] బీరువాదగ్గరకు పోవును)

కుమా—భేష్! అవసరాన్నిబట్టి పసుపుదేవ్వను గాజులు కాళ్ళు పట్టేసుకుంటా. నను. అర్ధనారీశ్వరుడులాగ ఉన్నాను. దడమాత్రమే నను.

లీల—నీవు మాత్రం లోపలికి రాకు. పక్కనుండి అంతా విను.

కుమా—కొంపదీసి ఆయన చూస్తేనో.

లీల—చూస్తే. 'రాత్రి ఒక్కదాన్ని రావడానికి భయపడి దాసీదాన్ని సాయం తీసికొచ్చా'నని చెబుతాను.

కుమా—అహాహా! ఏమి ఉపాయం. టంకప్పపాడిలాగ అతుక్కుంటుంది. అందుకనే ఆడవాళ్ళబుద్ధి అని సూక్ష్మమన్నారు.

లీల—ఆడవాళ్ళు బొంకితే గోడకట్టినట్టుంటుంది. ఊఁ నడు.

కుమా—(నడుచుచూ) యింతకు నన్ను దాసీదాన్నంటున్నావా.

లీల—అన్నంతమాత్రాన దాసీదానవు అనవు. నడు త్వరగాను.

కుమా—కానీ

క్రూరకర్మములు నేరక చేసితి
నేరము లెంచకు రామా!
వాతెరమా భవసాగరమీదను
నళినదళేక్షణ రామా!

లీల—అనవసరంగా వాగక నడు.

కుమా—ఊఁ. కానియ్యి.

(నిష్క్రమింతురు)

## మూడవ రంగము

ప్రదేశము : పడకగది

[ప్రవేశము : ప్రిన్సిపల్ బాలకృష్ణన్]

బాల—(పుస్తకము చదువుచూ. టేబులువద్ద కుర్చీయందు దాసీనుడై) అద్దద్దా! ఏమి speech ఓహో! షేక్స్పియరు! నీవుదా నిండా మంచివాడవబ్బా! Love నిండా చక్కగా Express చేసివబ్బా! (అని మాటలు వదిలి) ఓహో! జూలియట్ కొఱకు రోమియో ఎంతత్యాగము చేసినాడు. Worthy man, He sacrificed his life for the sake of love only. నిండా మంచివాడవు. (అని కళ్ళజోళ్ళు విడచి, టేబిల్ పైనున్న లీల చిత్రపటము నుద్దేశించి) లీలా! ఎంత మోసము చేసితివి. వస్తానని promise చేసితివే. లీలా! నీవుదా యింతదానవని

అనుకోలేను నీకుదా యిది ధర్మమా ? (అని ఫొటోను చేత బట్టుకొని) ఆహా ! యిడ్లీకి సాంబారు చేర్చినటుల నీఅధరమునకు నాఅధరము చేర్చిన నిండా చక్కగా ఉండేదికదా! లీలా! నిన్నుదా చూస్తుంటే జిలేబీపాకము త్రాగుతున్నంత ఆనందంగా ఉంది ఓహో! ఏమి మధురం నిన్నుద చూస్తుంటేనే యింత సుఖంగా ఉంది నిన్నుదా అనుభవిస్తే యింకా నిండా సుఖముండును కదా! (అని లేచి లీల పటమును తన హృదయమునకు హత్తుకొని) Man lives for love, Love knows no separation అందుకుదా రోమియో తన life sacrifice చేసాడు That is the best thing I' ll accompany him. (అని లీల Photo ను టేబిలుపై తిరిగి పెట్టి) యిదిగో లీలా ! నీకుదా నా జీవితము బలియిస్తాను నన్నుదా మంచి పోకు నీవుదా love చేయుండే నేనిక్కడ జీవించటం అనవసరం యిదే last kiss. last kiss (అని లీల ఫొటోను ముద్దుపెట్టుకొని) ఆహా ! ఎంతతీపి, మిఠాయికన్న తీపిగాఉంది (అని అనేకసార్లు ముద్దుపెట్టుకొని వదలలేక ఆ Photo ను టేబిలుపై యుంచి) లీలా నిజంగా చచ్చిపోతాను లీల ! My dear lovely girl లీలా ! లీలా ! (అని గొంతుక పిసికికొనుచుండగా)

[ లీల, కుమార్, ప్రవేశింతురు ]

లీల—నమస్కారమండి ! మేష్టారు !

కాల—(లీలను జూచి) నీవుదా నిండా మంచిదానవు you came here to save your lover నిండా మంచి దానవు (అని ముగ్ధుడై లీలను చేరబోవుచుండ, లీల ప్రక్కకు తప్పుకొనును ప్రిన్సిపాలు ముసుగు వైచుకొని యున్న "కుమార్"ను చేరి)

బాల—లీలా! నీకుదా కోపమొచ్చిందా? నాతో మాట్లాడవా? మంచిదానవని సంతోషిస్తినే? యేదీ! ఒక్కచూపు నీక్రీగంటి చూపు.

(అని "కుమార్" ముఖమును తనవైపు త్రిప్పుకొనబోవ "కుమార్" విదలించి వైచును లీల తనలో నవ్వుకొనుచుండును.)

బాల—యింతకోపమేమి? అబ్బా! నీవులేనిదే నేనుదా జీవించగలనా? ఏమబ్బా! మాటాడవేమి? నేనుదా ఏమిచేయుదును లీలా! యేదీ! only one Kiss. only one Kiss. నాకుదా చాలు ఏదీ—ఒక్క—(అని "కుమార్" ముఖమును దగ్గఱగా చేర్చుకొనుచుండగా, కుమార్ విదలించుచుండును)

లీల—(తనలో నవ్వుకొనుచు) ఉపేక్షిస్తే ప్రయోజనంలేదు. రహస్యము రచ్చకెక్కుతుంది ఎంత ఉన్మత్తుడై యున్నాడు! యిదే నా కార్యనిర్వహణమునకు తగిన సమయము (పైకి) మేష్టారు అదేమిటండీ! అలాకంగారు పడతారు అది దాసీ దండీ యిటు చూడండీ.

బాల—('కుమార్"ను వదలి) దాసీదీ! లీలకాదూ అరే? (అని ప్రక్కనున్న లీలనుజూచి) I see! you are Leela! come, along, come along. Take your seat.

లీల—అలాగేనండి (అని "కుమార్"ను జూచి) ఏమే వీరమ్మా! నీవుపోయి ఆ గుమ్మందగ్గఱుండు ఎవరిని లోపలికి రానీయకు తెలిసిందా భద్రము.

కుమా—(స్త్రీగొంతుకతో) అలాగేనమ్మా! తమయాజ్ఞ (అని నడచుచు) తల్లిగర్భమునుండి తిరిగి జన్మించినట్లయింది వీడిని వాదుల్చుకొనేటప్పటికి వెఱ్ఱిపీనుగ! మైకంమున్ను ఆడా మొగా వివక్షత గుర్తించుకోలేక నన్ను పట్టుకొన్నాడు యింకాస్సేపు అలాగా చేస్తే "ఫెడీ"మని గుండెలమీద ఒక్కతాపు తన్నే వాడినే అదృష్టవంతుడు తప్పిపోయేడు (అని సైడువద్ద నిలచి యుండును.)

లీల—మేష్టారు! మీరు కొంచెం స్థిమితపడండి.

బాల—అమ! నీవు ఇక్కడ కూర్చో!

(అని కుర్చీపై స్థిమితపడి కూర్చుండును)

లీల—చిత్తము (అని మఱియొక కుర్చీపై కూర్చుండును).

కుమా—నా కిక్కడ నిలువుజీతము యిచ్చేరు పారాహుషార్. ఆ జంటకు మనమిక్కడ కాపలా!

లీల—ఏమిటండీ! మేష్టారు. యిందాకా అంత పరితపించారు.

బాల—అబ్బే! ఏమీ లేదు. నిన్ను చూడగానే నాబుఱ్ఱ ఒక పెద్ద electric shock తిన్నట్లయింది అందుచే కొంచెం చలించింది.

లీల—అయ్యో! పాపము. యిప్పుడింకా నొప్పి పెట్టటం లేదుకదా! ఏమీ బీట పడలేదుకదా?

బాల—అబ్బే! అదియేమీ లేదు.

కుమా—బీటపడితే యింకా యిలాఉంటాడా? యీపాటికా దండధరునివద్ద Lectures కొడ్తూ ఉండేవాడే?

బాల—అమ! ఏమి విశేషములు?

లీల—మీరు చెప్పిననాడే వద్దామనుకొన్నాను. కాని వీలుపడింది కాదు క్షమించాలి.

బాల—ఎంతపూట నీరాకకు ఎదురుచూస్తూ ఉంటిని. యింతకు ఆ మనిషి యెవరు?

కుమా—కొంపదీసి 'లీల' అనుకొని తిరిగి నన్ను బాధించదుగదా?

లీల—అది మా Servant maid. ఒక్కదాన్ని రాలేక దాన్ని సాయంతీసికొని వచ్చాను.

బాల—అమ! ఒక్కదానివే వస్తే బాగుండునుగదా?

కుమా—ఒక్కర్తేవస్తే వాటంగా మాట్లాడదామనుకున్నావా? యిక్కడో ఘటముంది నిప్రసానికి.

లీల—అలా చేయవలసిందే. కాని.........

బాల—సరే దానికేమి? నిమీద అనవసరంగా నింద మోపినాడా Head mcster పాపము!

లీల—నిజమేనండీ! మీరు నన్ను రక్షించకపోయినట్లయితే నాబ్రతుకీపాటికి అల్లరయిపోను. చాలా ఉపకారం చేసేరుమీరు.

బాల—ఆ! అదియెంతపని? ఏదీ నీకా అభిమానముంటే నాకుదా నిండా సంతోషం.

లీల—అయినా, మేష్టారూ! లోకం గుడ్డిదండీ వెనుకాముందూ ఆలోచించదు. యిప్పుడు మనమిద్దరం యిలా మాట్లాడుకోవడం ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో?

బాల—ఏమనుకుంటారు? నీకుదా అటువంటిభయం వొద్దు. నేనున్నానుగా!

లీల—ఆ! లోకాపవాదానికి మీరుమాత్రం లొంగకుండా ఉంటారా? అప్పుడీ లీలకోసము తెగించగలరా?

బాల—అడ్డడ్డ! ఎంత పొరబడితివి నేనటు చేద్దునా? నా సంగతి నీవింకా ఎఱుగవు. ఏదీ నీ కోసము నేనుదా ఏమైనా చేద్దును తెలిసిందా?

కుమా—చెయ్యవుమరి ఆడవాళ్ళవసరం.

లీల—మీసంగతి నాకు తెలియదూ? కాని మేష్టారూ? ఆ మాట మీదనే నిలబడతారా?

బాల—నీకుదా సందేహం వొద్దు ఏదైనా కోరి చూడు. ఊఁ

లీల—అయితే మీవల్ల ఒక ఉపకారం అవవలసివుంది. తప్పకుండా చేస్తారా?

బాల—ఊఁ చెప్పు. ఏమది?

లీల—Selection examinations లో నాకూ, మా బంధువుల కుఱ్ఱాడు, ఆ వేళ మీరు చూసేరు. జ్ఞాపకముందా?

బాల—ఆ! ఆ! కుమార్!

కుమా—ఆ! వాడే! వీడు వీడేవాడు. యీ 'కుమార్' నీకు మారకుడు.

బాల—ఆ, ఆలేదు..............

లీల—అతనికి, నాకు మార్కులు తక్కువవచ్చేయండీ అందుచేత Head master గారు మమ్మల్ని public కి పంపించ లేదు. మార్కులు వేయవలసిందని, ఆయనను బ్రతిమాలేము. లాభం లేదన్నారు. ఆపని మీవల్ల జరగాలి. ఏమంటారు ?

కుమా—ఏమంటారు? నీవడగడమును కాదనడమునా ?

బాల—(నవ్వి) అదియెంతపని? నేనుండగా ఆ Head master ని ఎందుకుదా approach అయేరు? నేను తప్పక ప్యాసు చేయిద్దును. అసలుమార్కులు ఎలావచ్చేయి?

లీల—యిద్దరికి అన్నిటిలోను పదిమార్కులుకు దాటలేదండి?

బాల—యింకేమి ? ఆమాత్రందా. చాలు నేను మిమ్మల్ని తప్పక ప్యాసు చేస్తాను కాని.........

లీల—సందేహిస్తారెందుకూ ? చెప్పండి.

కుమా—ఏదో stunt కొడుతున్నాడు వినాలి.

బాల—(యిటునటు జూచి) ఏమీలేదు ఏదీ నీవు చాలా అందమైన దానవు చూస్తివా ? నేను young వయస్సులో ఉంటిని ఏదీ అందుచేత............

కుమా—అమ్మ! నీపొట్ట పొడిచివేయ, ఎన్నాళ్ళకునీయభిప్రాయాన్ని వెలిబుచ్చావు? principal వయ్యుండి నీవు చేస్తూన్నపనిదా! సరే యింక నీ బ్రతుకు నా చేతుల్లోఉంది చూద్దువుగాని నాప్రజ్ఞ.

బాల—ఏదీ యిక్కడ ఎవ్వరు లేరు ఒక్కసారి.........

లీల—(తనలో) తనపాడుబుద్ధి నిన్నాళ్ళకు విశదపరిచేడు సరే, ఒక పొడి పారేస్తాను.

బాల—ఏమిదా ఆలోచిస్తుంటివి నీకు మార్కులు తప్పక వేయిస్తానుకదా ? నాఉద్దేశ్యం చెప్పితిని ఏమంటావు ?

లీల—మీమాటకు ఎదురు చెప్పను కాని నేను మీయింటికి రావడము అనేకమంది students చూసేరు ఏమి జరుగుతుందోఅని వాళ్ళు అక్కడ కాసి ఉన్నారు యిక్కడ నేను ఆలస్యం చేసానంటే వాళ్ళు అనుమానపడతారు.

కుమా—మంచి టోకరా యిచ్చేవు భేష్.

బాల—అనుమానం ఏముంది special గా coach up చేస్తున్నానని చెప్పుదును నీకాభయం వొద్దు ఏదీ ఒక్కసారి......

లీల—మేష్టారు నేను Hostel విడచి చాలసేపయింది. యీలోపున ఎవరైనా checking కి వచ్చేరంటే కొంప మునిగిపోతుంది అప్పుడే అర్థరాత్రియింది? హా! యింక యివాళ ఏమిసుఖమనుభవిస్తాము. యింకో, రెండు మూడు గంటలలో తిరిగి వెళ్ళిపోవలసి ఉంటుంది అందుచేత రేపురాత్రి పెంద్రాళే భోజనంచేసి 8 గంటలకే వస్తాను రాత్రంతా హాయిగా కాలము గడుపవచ్చు.

కుమా—భేషో! చాలా బాగా చెప్పేవు.

బాల.—సరే అలాగే కానియ్యి.

లీల—మీరు మాత్రం తప్పకుండా యీ ఉపకారం చెయ్యాలి అంతా రేపురాత్రి లోపుగా జరగాలి అది అయిన తర్వాత రాత్రి తప్పక మిమ్మల్ని కలుసుకుంటాను మఱచిపోకండి.

బాల—అడ్డెడ్డ నీవుకు నాకు చెప్పాలా? రేపుతప్పక మీకు marks వేయిద్దును, నీవుదా రాత్రి రాకపోతే రొంబకష్టం అవుతుంది సుమా!

లీల—ఎంతమాట! మాటతప్పుతానా! మీరుమాత్రం తప్పక యీ కార్యము సాధించాలి శలవు.

కుమా—పాచిక పారింది యిక రాపోదము.

బాల—మంచిది వెళ్ళిరా రాత్రి తప్పక రావాలి యిది నీవుదా అల్లరి చేయకుమా ! తెలిసిందా ?

లీల—అల్లరయితే నాకుమటుకు హాని కాదూ. వెళ్ళివస్తాను శలవు.

బాల—ఆను

కుమా—అల్లరెందుకవుతుంది ఊరంతా సిగ్గోలవుతుంది కాని తిన్న సాంబారు కక్కిస్తానుండు.

లీల—(కుమారిని చేరి) రా ! పోదాము.

కుమా—నను యీరంగంలో విజయమేగా? నను (నిష్క్రమింతురు)

బాల—lucky chance అనుకున్నది అవుతూంది యీ ఉపకారం చేయించి ఆమెను తేపుక తప్పక అనుభవించాలి. ఆ Head master చేయకుంటే నేనే సొంతంగా చేస్తాను. యీ విషయంలో నాకుదా ఎదురుతిరిగితే జమీందారుకి చెప్పి Dismiss చేయిస్తాను. తప్పక నేనుదా లీలను అనుభవిస్తాను. O ! Leela ! My dear Leela ! Come and enjoy with me, Leela ! Comnion !

(అని లీలకరమును ముద్దుకొనుచుండును)

(తెర పడును)

# డాక్టరు

## తృతీయాంకము

### మొదటి రంగము

ప్రదేశము : గృహాంతర్భాగము

[ప్రవేశము : రాజ్యం]

**రాజ్యం**—(పాడుకొనుచూ, షికారుపోవుటకు తయారగుచుండును)

[ప్రవేశము : సీతాపతిరావు]

**సీతా**—అమ్మాయి! ఏమిటీహడావిడి అంటాను? ఎందాకా నీ ప్రయాణము.

రాజ్యం—ఆనందుతో షికారు పోదామని.

సీతా—(కూర్చుని) తల్లీ! యిలారా! కుర్చో.

రాజ్యం—ఏమండీ! నాన్నగారూ! (దగ్గఱగా కూర్చుండును)

సీతా—తల్లీ! నీకు యుక్తవయస్సు వచ్చిందిగదా! పరపురుషులతో యింత విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటే లోకు లేమనుకుంటారు తల్లీ!

రాజ్యం—నాన్నగారూ! జ్ఞానసంపన్నులు, మీరుకూడా అలా మాట్లాడుతారేమి? యింతకూ ఆనందు మనకే పరాయివాడా? దగ్గఱబంధువేగా? అతనితో షికారుపోవడం తప్పా?

సీతా—అమ్మా! ఆనందు మనకు కావలసినవాడే నేను కాదనను కాని పెండ్లిగాకముందు మగవాడితో షికారులు చేస్తూ, చనువుగాఉంటూంటే లోకులు హర్షిస్తారా? తల్లీ!

రాజ్యం—లోకులు పలుగాకులు. వాళ్ళకు న్యాయాన్యాయ విచక్షణ లేదు. గ్రుడ్డివాళ్ళు. వారికోసం మన ఆనందాన్ని భగ్నంచేసుకుంటామా ?

సీతా—తల్లీ! ఎంతైనా లోకులకు వెఱవకతప్పదు. యీపికార్లు యివన్నీచూస్తే నిన్నెవ్వరైనా పెండ్లిచేసుకుంటారా ? తల్లీ! అప్పుడు మనం ఏమవుతామో ఆలోచించు.

రాజ్యం—నాన్నగారూ ! యింకొకరు నన్ను పెండ్లిచేసికొనవక్కఱ లేదు. నామనోనాథుడు ఉండనే ఉన్నాడు.

సీతా—తల్లీ! నేడు క్రొత్తగా మాట్లాడుచున్నావేం ! నీవెవరినైన ప్రేమించేవా ?

రాజ్యం—నాన్నగారూ! మీరడుగుచున్నారు కాబట్టి నేను భీతివీడి చెప్పుచున్నాను. ఎవరినో కాదు; మన ఆనందునే నేను త్రికరణ శుద్ధిగా ప్రేమిస్తున్నాను.

సీతా—(ఆశ్చర్యముతో) ఆనందును ప్రేమిస్తున్నావా!

రాజ్యం—అవును. ఆనందునే ప్రేమిస్తున్నాను ఏనాడతడు M. B. B. S. Course చదవడానికి యీవూరు వచ్చి మనయింట్లో బసచేసాడో, ఆనాడే నాహృదయ మాతనియందు హత్తుకుంది. నాసర్వస్వము ఆతనికి సమర్పించదలంచుకున్నాను. ఆనందుచే ఆక్రమింపబడిన యీహృదయ మన్యాధీనము కాదు. ఆతడే నాప్రియపతి.

సీతా—వెఱ్ఱితల్లీ! యుక్తాయుక్త విచక్షణలేకుండా తొందరపడుచున్నావుసుమా !

ఉ. ఆతడె సర్వమంచు మది ♦ నమ్ముల నొల్లవు నిస్సిరో యిదే
రీతి చరించుటల్ తగవు ♦ లేశము నీవిటు సాహసింప
నీతినిజూడకుండ నత ♦ నిన్ వరియించిన చాలగన్ వృథా
యాతనఁగల్గు నీకిక న ♦ నంతమనోవ్యథకల్గు నంత్యమున్!

అమ్మా! వెనుకముందు లాలోచించకుండా కనబడినదల్లా పాలను కొనుట తగదుసుమా!

రాజ్యం—నాన్నగారు! బాగా ఆలోచించే ఆతని ప్రేమించేను. మనకు బంధువు విద్యావంతుడు వినయవంతుడు యేదో కొద్దో, గొప్పో స్థితిపరుడు. యింక అందమునకా.

సీతా—తల్లీ! ఆతనియందు లోపముందని నేననను. అన్నిలక్షణాలు కల్గినవాడే కాని ఆతనిహృదయము గ్రహించేవా?

రాజ్యం—ఆతడు నాకోరికను కాదనడు. ఎల్లప్పుడు నాతోనే కాలము గడుపుతూఉంటాడు. ఎక్కడకు నేనులేనిదే వెళ్ళడు గదా! నాతో ఎంతో చనువుగా ఉంటాడు.

సీతా—అమ్మా! నీవు చిన్నదానవు. నీకు అనుభవము తక్కువ. చనువుగా ఉన్నంతమాత్రాన ప్రేమిస్తున్నాడని అనుకోను. పురుషులు మోసకారులు. చాలా జాగ్రత్తగా మసలాలి. హృదయము గ్రహించిమరీ హృదయమివ్వాలి.

రాజ్యం—నాన్నగారూ! మీరు ఎన్నైనా చెప్పండి. ఆనందు నన్ను ప్రేమిస్తున్నాడని ఘంటాపథంగా చెప్పగలను. ఆతడు తప్పక నావాడే. యిక నా ఆనందానికి మీరొడ్డురారని తలుస్తాను.

సీతా—పిచ్చితల్లీ! ఎంతపొరబడుచున్నావమ్మా! నీఆనందానికి నేనడ్డువస్తానా? నీవు తప్ప నాకింకెవ్వరున్నారు చెప్పు. ఆడదైనా మొగాడైనా నీవేగదా! యిల్లాలా ఏనాడో గతించింది. ఏకైక పుత్రుడా, బాల్యమునందే తస్కరింపబడినాడు. యిట్టిస్థితిలో నీ ఆనందాన్ని భంగం చేసి నేనేమి సుఖపడతాను తల్లీ! నీవు హాయిగా కాలక్షేపం చేయడమే నాకు కావలసినది. నీసుఖం కోసమే నేనెప్పుడూ శ్రమపడుతూ ఉంటాను.

రాజ్యం—అయితే, యిప్పుడేమి చేయమంటారు?

సీతా—అమ్మా! ముందాతని హృదయమును గుర్తించను.

రాజ్యం—అలాగే. యిప్పుడొస్తాడుగా. అడిగేస్తాను. నన్ను ప్రేమిస్తున్నాడో, లేదో?

సీతా—అమ్మా! యింత మంకుతనము తగదు సమయాసమయముల
నాలోచించవద్దా? అతడు ఖులాసా ఉన్నసమయం జూచి
అతని అభిప్రాయం తెల్సుకో.

రాజ్యం—సరేలెండి అలాగే చేస్తాను.

సీతా—తల్లీ! మీరియిరువురు ప్రేమించుకుంటూన్నట్లయితే నాకేమి
ఆటంకము? నేను అడిగేదంతే. ఆతని తల్లిదండ్రులు కూడా
కాదనరు. అప్పుడు మీరిద్దరూ ఆనందంగా కాలంగడుపవచ్చు.

రాజ్యం—(టైముజూచి) యింకా ఆనందు రాలేదు. ఎందుచేతనో?

(తెరలో రాజ్యం! రాజ్యం!)

రాజ్యం—(సంతోషముతో) Coming, Coming.

[ప్రవేశము : ఆనంద్]

ఆనం—యింకా తయారవలేదా?

రాజ్యం—యిదిగో వస్తున్నాను.

ఆనం—(సీతాపతిని జూచి) ఓహో! మామగారుకూడా యిక్కడే
ఉన్నారే!

సీతా—అమ్మాయి ఏమిచేస్తూందో చూద్దామని వచ్చేను. సరేగాని
త్వరగా వస్తారుకదూ?

ఆనం—భోజనంవేళకు వస్తాములెండి.

రాజ్యం—ఊఁ పదు టైమై పోతూంది.

ఆనం—మామగారూ! వెళ్ళి వస్తాము.

సీతా—మంచిది వెళ్ళిరండి.

(రాజ్యం, ఆనందు నిష్క్రమింతురు)

సీతా—ఆహా! యీమె ఆనందుయందు బద్ధానురాగయై యున్నది.
యింకొకనిని వరించుటకల్ల నేనీమె మనస్సు త్రిప్ప ప్రయత్నిం
చుటయు వ్యర్థమే యగును.

గీ. ఔర! ఏమిచెప్పినగాని ♦ భారమగును
రోగి పథ్యాన్నము భుజింప ♦ రోసినట్లు

ఏమి కానున్నదో గదా! ♦ యీశ్వరేచ్ఛ
సర్వమున కీవె కావవె ♦ సత్యదేవ!
కానిమ్ము, వారి యిష్టప్రకారమే చేయుదును

(నిష్క్రమించును)

(తెరపడును)

---

## రెండవ రంగము

ప్రదేశము : వ్రాలియున్న తెరముంగిట

[ప్రవేశము : జనార్దనుడు భిక్షుక వేషముతో]

జనా—(విచారము సూచించుచు) ఆహా! పరమేశ్వరా! లక్షాధికారిని క్షణములో భిక్షాధికారిగ చేసితివిగదా! ఎంత నిర్దయాత్ముడవు. ఆహా క్రూరవ్యాఘ్రము లనఁదగు ఆజపానీయులు కలకత్తా నగరముపై దాడి సలుపనేల? నా దారాపుత్రాదులను, యావదాస్తిని కబళింపనేల? నేనిప్పుడేకాకినై, నిలువనీడ, తిన తిండి, కట్టగుడ్డలేక దేశదేశముల ద్రిమ్మరనేల? పావనంబైన యీ భరతభూమి ఆ భయంకరమగు క్రూరమృగములనోటఁబడ కావలసినదేనా? మరి ఫిరంగులనుండి, బాంబులనుండి వెలువడు భయంకరమగు అగ్నిజ్వాలలందు మిడుతలవలె మండి పోవలసినదేనా? భారతీయులిట్లు క్రుళ్ళి క్రుశింపవలసినదేనా? (యించుక నడచి) చెట్టుమీఁద నివసించు పక్షులకయినను యాధారమున్నది కాని నాకీజగాన యాధారము లేదు. అధిక ప్రయాస కోర్చి యీ మద్రాసు నగరముచేరి ప్రాణము దక్కించుకొంటిని. యిక జీవనోపాయము? (అని రెండడుగులు వైచి) తిరిపెమెత్తుట అంతే (అని ముందుకు నడచును)

[ప్రవేశము : సీతాపతిరావు]

జనా—(సీతాపతిని జూచి) మహాశయా! నమస్కారములు.

సీతా—(చూచి, సాదరపూర్వకముగ నమస్కరించి) నాయనా! నీ వెవ్వడవు. నీ యుదంతమేమి?

జనా—అయ్యా! కొలదికాలము క్రిందట లక్షాధికారినై మహాభోగ భాగ్యముల తేలుతూగి నేడు భిక్షాధికారినై యూరూర తిరుగు చున్న దేశద్రిమ్మరిని.

సీతా—అయ్యో! పాపము. నీ యీ యద్భుత పరివర్తనమునకు కారణము?

జనా—అయ్యా! నాదీనచరిత్ర మేమని విన్నవింతును?

మ. ఘనవహా శత్రుదళంబు దర్పముగ బెం♦గాల్ రాష్ట్రమున్ నాక్రమిం
ప నభోమధ్యమునుండి బాంబులను గా♦ర్పణ్యాగ్నితో వేయ బ్రా
పునగత్యంతర మేమిలేక వడినా ♦ భోగాదులన్ వీడ్తినో
యనఘా! దీనుని నన్ను బ్రోవగ విదే ♦ యర్థింతు మిమ్మిత్తరిన్!

సీతా—ఏమి! నీవు ప్రత్యర్థులు "జపనీ" యులహస్తముల జిక్కిన వాడవా? అయ్యయ్యో! ఆ దుష్టులవలన నీ కెంతటి యవస్థ సంభవించినది.

జనా—అయ్యా! నేనొక్కడనే కాదు నావలె ఎందరో నిర్భాగ్యులు కుటుంబ సమేతముగా వారినోట కెరలైరి. ఎంతమందియో నిరాధారులై "అన్నమో! రామచంద్రా" యని వాపోవు చున్నారు. భరతదేశమున నిట్లు దరిద్రపిశాచము తాండ వించుచున్నను భారతీయులు నిద్రించుచున్నారు.

సీతా—నిజమే. భారతీయుల ప్రజ్ఞావిశేషములు బూడిదలో పన్నీ రట్లు వ్యర్థమైనవి.

గీ. అక్కటా! పావనంబైన ♦ భరతదేశ
మున జనించి కడుపునిండ ♦ భుక్తిలేక
భారతీయులిట్లేడ్చుచు ♦ బ్రతుకవలసె
పాపమేమిచేసినదో? మా భరతమాత!

నాయనా! నేటికాలమునకు 'నాపుత్రుల ఆకలిబాధ తీర్పలేకున్నానే' యని భారతజనని విలపించుట తటస్థించినది. గ్రహాస్థితి! సరిగాని నీవేమైనా చదువుకున్నావా?

జనా—B. A. ప్యాసయితిని.

సీతా—ఆదినుండియు నీ నివాసస్థానము కలకత్తాపట్టణమేనా ?

జనా—అయ్యా! నేనీ ప్రాంతమువాడనే. చిన్నతనమందే దొంగలచే తస్కరింపబడి కలకత్తానగరమునకు గొంపోబడితిని

సీతా—(ఆతురతతో) చిన్నతనమునందు దొంగలచే తస్కరింపబడితివా ? నీ తల్లిదండ్రు లెవరు నాయనా !

జనా—అదేమో నాకు తెలియదు. బాల్యమునందే నాతల్లిదండ్రుల వీడితిని.

సీతా—అహా ! వింతమాట.

జనా—అటువిన్నట ఆదొంగలతో కొంతకాలముండి, నాకు ప్రాజ్ఞత వచ్చినపిదప వారినుండి తప్పించుకొని, స్వయంకృషిచే చదువుకొని, శ్రమపడి పనిచేసి, యిల్లువాకిలి నిలబెట్టుకొని ధనికులలో చేర్చంటిని అటుపిదప సర్వస్వమునుదుర్వ్యలుడై, నమానుష మునగ వర్తించి "జననీయు"ల చేతినిడి నిట్లు దిమ్మరుచుంటిని యిది నా చరిత్రము.

సీతా—నాయనా ! నీకు ప్రాజ్ఞత వచ్చినపిదప నీవేదేశమువాడివో, నీ తల్లిదండ్రు లెవరో తెలిసికొన ప్రయత్నించలేదా ?

జనా—నాకాయిచ్ఛ జనించనందుననే నాకృత్యమునకు గడంగ లేదు.

సీతా—(నిదానించి, తనలో) యీతని వృత్తాంతము నా కుమారుని చరిత్రమును బోలుచున్నది. యీతడు నా కుమారుడు కాడు గదా ! నా మొగమున కంతభాగ్యము కూడనా ? యింకెక్కడికుమారుడు ? యిది వట్టిభ్రమ.

జనా—అయ్యా ! నావిషయమున మీరు సందేహించుచున్నారను కొందును నేను చెప్పినదంతయు సత్యము యిందొక్క విషయమైన అసత్యమున్న యెడల నా భారతజనని రక్తమునుత్రాగిన వాడ నగుదును నన్ను రక్షించుభారము పితృసమానులగు మీయదియే !

సీతా—నాయనా! నీవిషయములో నే ననుమానించుటలేదు నిన్ను చూడగనే గతించిన నా కుమారుడు జ్ఞప్తికి వచ్చినాడు అందుచే నిదానించితిని.

జనా—అయ్యా! నా కాకలిబాధ మిక్కుటమగుచున్నది యిప్పటికి నెలదినములనుండి సరిగా తిండిలేదు కావున నన్నీ యాపద నుండి రక్షించి, పుణ్యము గట్టుకొన ప్రార్థన.

సీతా—నాయనా! నిన్నుజూచి, నీచరిత్రమును విన్నపిదప ఏ భారతీయునిగుండె ద్రవ్యాలు గాకుండును? ఏభారతీయునిమనస్సు చలింపకుండును ఏభారతీయుడు కంటివెంట రక్తబిందువుల కార్చకుండును యింకనూ భారతదేశమున దీనరక్షణపూర్తిగా నశించలేదు. రా! నావద్దనే నావ్యవహారముల చూస్తూ యుండువుగాని నీకు నెలకు రూ 20 లు జీతమిస్తాను రా.

జనా—(ఆనందముతో) ఆహాహా! నట్టనడి సంద్రాన దరిగానక తపించుచున్న వానికి సహాయము దొరికినటుల, ఎడారిమధ్యమున దాహముచే దపించుచున్న వానికి నీరము లభించినటుల, యాకలిబాధచే తపించుచున్న నాకు మీవాక్కు యమృతోప తుల్యములైనవి తండ్రీ! మీయాజ్ఞను శిరసావహింతును

సీతా—అట్లయినరమ్ము యింటికిపోదము.

జనా—అయ్యా! మీరెంత ఉదారస్వభావులు! మీవంటినే ప్రతిభారతీయుడు నున్నయట్లైన యీసరికి భారతజనని దాస్యశృంఖలముల విడగొట్టబడియే యుండును కాని యింకనూ ఆస్థితి రాలేదు.

సీతా—దానికేమి ఏనాటికైయిన ఆ సుదినము రాకపోదు మనము చూడలేకున్న మనపుత్రులయిన చూడగలరు.

జనా—నిజమే.

సీతా—ముందు నీవునడు. కొంత విశ్రాంతి తీసికొందువుగాని అదిగో! ఆకనబడునదే నా భవనము.

జనా—చిత్తము (నడచుచుందురు)

సీతా—నిజము నిలకడమీద తేలగలదు ఏది ఎట్లున్నను కోటిమాన వుడు తన్నాశ్రయింప ఉన్నదానిలో నాతనికింత బెట్టుట ప్రతి భారతీయుని ముఖ్యకర్తవ్యముగదా! నావిధిని నేను నెరవేర్చు కొందును. (నిష్క్రమించును)

---

## మూడవ రంగము

ప్రదేశము : వసారాచావడి

[ప్రవేశము : జమీందారు పట్టాభిరామయ్య, బాలకృష్ణన్]

పట్టా—ప్రిన్సిపాల్ గారూ! యీాయననుగురించి మీరిదివరకనేక సార్లు చెప్పేరుగా! యిప్పుడు మళ్ళీ ఏమొచ్చింది?

బాల—మీాకుఁ చెప్పడానికి ఏముంది సార్! యింతవరకుఁ ఏమైన సరిపడుతుందేమోనని ప్రయత్నిస్తిని కాని ఆయనకు మనతో కుదరదు సార్!

పట్టా—కారణము?

బాల—ఆయనకు Tamilians అంటె బొత్తిగా గిట్టదు Sir!

పట్టా—ఏమి? Tamilians కి ఏమైనా హానిచేశారా?

బాల—యీామధ్యని నేనుఁ ఒక Tamilian boy కి free గా చదువు కోటానికి Permission యిస్తిని అను, అప్పుఁ అది చూచి 'అట్లావీలుపడదు, మీారుఁ Tamiliams కి ఎక్కువ Preference చూపిస్తున్నారని నాతోఁడిద పెద్దదెబ్బలాట జరిగింది. తరిమ నాకుదా నిండా కష్టమనిపించింది Sir!

పట్టా—అయితే మీారాంధ్రులపట్ల ఏమైన అసహనము చూపించేరా?

బాల—అడ్డడ్డ నానఁద ఎందుకు అలాచేద్దును నాయబ్బసొమ్మాయిది నేనుఁద ఆంధ్రులనే జాస్తి admit చేస్తిని సార్!

పట్టా—తర్వాత?

బాల—Then coming to the next, what I am to say is ఆయన టీచర్సుని రొంబకష్టపెడుతున్నాడు. నాకుద చాలా reports వచ్చినవి. నేనీవిషయం యిదివరకే తమతో మనవి చేసికొంటిని.

పట్టా—అవును. యీ విషయంలో నేను ఆయనకు warning యిచ్చేనే? తర్వాత.

బాల—ఆయనదా Bribes తీసికొని మార్కులు వేస్తున్నట్లుగా నా notice లోకి వచ్చింది. అంతేగాకుండా ఆడపిల్లలను అన్యాయంగా బాధిస్తున్నట్లు వింటిని.

పట్టా—ఏమిటీ! ఆడవాళ్ళను బాధిస్తున్నారా ? ఏవిధంగాను ?

బాల—ఏమిదాఉంది. వారిని బలాత్కరించి రాకపోయినట్లయితే, ఏదీ Marks cut చేసి public examinations కి select చేయడం లేదట. యిదంతా చాలాఉంది Sir! నానోద ఏమి చెప్పమను?

పట్టా—సరిపోయింది. యీయనకు యీపాడుబుద్ధి ఉందన్నమాట. అలా యెవరినైనా చేసినట్లు ఋజువుచేయగలరా?

బాల—Yes. మన hostel లో ఉంటూన్న లీల అనే అమ్మాయిని అలా చేసాడు. ఆ అమ్మాయిని బలాత్కరిస్తూంటే ఒకకుర్రాడు కూడా చూసేడుట. అంతా దొంగమాదిరి పనులు సార్!

పట్టా—అలాగా ? తొండముదిరి ఊసరవెల్లి అయిందన్నమాట. వందల కొలది జీతాలు పుచ్చుకొని చేస్తూన్న పనిదా? School లో Head master అంటే ఎంత ఆదర్శప్రాయంగా ఉండాలి. అటువంటిది తానే దుష్టుడయితే ఎలాగ ?

బాల—నేను చెప్పలేదు? వాడిదిఅంతా దొంగమాదిరి Sir! గజదొంగ ఏదీ నేను అంటే అసలే గిట్టదు. తమకు యీవిషయం చాలా సార్లు చెప్తిని. కాని వింటిరి కాదు.

పట్టా—నేనుమటుకు ఊరుకున్నానా? మీమాట మీదే ఆయన కెన్నో warnings యిచ్చితినిగదా?

బాల—అబ్బెబ్బె! ఆయనకుద warnings అంటే లెక్కయిల్లే Sir! ఏదీ యిలా ఉంటే నేనుదా చెప్పుండా కాలేజీ తప్పక పాడవుతుంది. మీరుద ఆలోచించాలి.

పట్టా—నిజమే! యిటువంటి వాళ్ళుంటే సంస్థ తప్పకుండా పాడవుతుంది తీసెయ్యాలి. కాని తగినంత సాక్ష్యమో?

బాల—ఓ! దానికేమి? ఆ 'లీల' అనే అమ్మాయి. అది చూసిన 'కుమార్' అనే అబ్బాయి మీకుద యీవిషయం చెపుదామని వచ్చేరు. కావలిస్తే వారిని పిలుస్తాను.

పట్టా—యింకనేమి? త్వరగా పిలవండి.

బాల—అను. (తనలో) వాడిక అంత్యం చూడాలి. నేనుద వేయమంటే Marks వేయలేదు గదా! (పైకి) లీలా! లీలా!

లీల—వస్తున్నామండి.

[లీల, కుమార్ ప్రవేశింతురు]

లీల—నమస్కారమండి. జమీందారుగారూ!

బాల—యీమెద "లీల" అనే అమ్మాయి.

కుమా—Good morning sir,

పట్టా—ఓహో! నీవేనా 'కుమార్' అను విద్యార్థివి?

కుమా—చిత్తము. మహాప్రభో!

లీల—(కుమారుని చేరి) అబ్బబ్బ! సామాన్యంగా మాట్లాడు

కుమా—ఒహో! అలాగే లే.

పట్టా—అమ్మాయి! నీవిషయంలో Head master గారు ఏదో అన్యాయం చేసారని Principal గారు చెప్పుచున్నారు. జరిగిన సంగతేమిటో దాచకుండా చెప్పు.

లీల—అయ్యా! నిజం చెప్పుతున్నాను వినండి. ఒకనాడు రాత్రిHostel
కి వచ్చి నాగదిలో ప్రవేశించారు Master గారు వచ్చేరని
మర్యాదచేసి కూర్చొనున్నాను తర్వాత ఆవిషయం ప్రస్తా
వించి ఆఖరుని తన్ను ప్రేమించవలసినదని చెప్పేరు యిది
మీకు తగదంటే గట్టిగా నోరు మూసేసి అల్లరవకుండా నన్ను
నుభవిద్దా మనుకున్నారు.

పట్టా—అరరే! చాలా గ్రంథము జరిగిందే?

బాల—నేనుద చెప్పితినిగాదు Sir!

కుమా—యిదెల్లనిక్కువంటె (సవరించుకొని) యిదంతా నిజమేనండి

పట్టా—ఉస్! నీవు మాట్లాడకు తర్వాత ఏమి జరిగిందో
చెప్పమ్మా!

లీల—నేను ఉపాయముగా తప్పించుకొని యీవిషయము మీతో
చెప్తానని బెదిరిస్తే భయపడి అప్పటికి వదలి వెళ్ళిపోయేరు.
తర్వాత అనేక సార్లు నన్ను బలవంతపెట్టేరు యీ selection
పరీక్షలలో నాకు Marks తగ్గించేసి పంపించలేదండి.

పట్టా—అలాగా! యిదంతా నిజమేనా?

లీల—నేనబద్ధ మాడటానికి ఆయనతో నాకేమి విరోధముండి?

బాల—యిది నిజమే Sr యిలా చాలా కేసులు ఉన్నాయి.

పట్టా—సరే! (అని కుమార్ నుద్దేశించి) యీ విషయంలో నీవేమి
చెప్పదలచుకున్నావయ్యా!

కుమా—మహాప్రభో! అవధరింపుము. (లీల నోకును) అయ్యా! వినండి
నేనొకనాడు సినిమానుండి వస్తున్నాను. అప్పుడు Head
masterగారు Hostel నుండి రావడం చూసేను.

పట్టా—అంతేనా నీవు చూచినది?

కుమా—అంతేనండి.

(లీల సైగ చేయును)

కుమా—అహాహా! అంతేకాదండి యింకావుంది ఉండండి చెప్తాను.
జ్ఞాపకము రానివ్వండి.

(అని ఆలోచించుచు తల గోకుకొను చుండును)

పట్టా—ఊ త్వరగా చెప్పు

కుమా—కొంచెం ఉండండి Sir!

పట్టా—నేనిక్కడే ఉంటాను చెప్పదలంచుకున్న దేదో త్వరగా చెప్పు.

బాల—అరే ఏమబ్బా! ఊరకుంటివి ఒకనాడు సాయంత్రము......

కుమా—ఆ! జ్ఞాపక మొచ్చింది ఒకనాడు School విడచినతర్వాత ఆటలాడుకొని యింటికి పోదామని వస్తున్నాను సాయంత్రం, ఎనిమిదిగంట లయింది అప్పుడు Head master గారి గదిలో మాటలు వినబడుతున్నాయి ఏమిటో చూద్దామని వెడితే, అక్కడ యీ అమ్మాయిని Head master గారు నిర్బంధిస్తున్నారు నేనా సమయంబున మిగుల జాలి నొందిన వాడనై యీ సాధ్వీరత్నమును రక్షించితిని.

పట్టా—(పక్కున నవ్వును)

కుమా—(కంగారుతో) అయ్యో! అలా నవ్వుదు రేమిటండి! అబద్ధ మనుకుంటున్నారా? పోనీ ఆ అమ్మాయినే అడగండి.

లీల—('కుమార్'ను ఊరుకొనమని సైగచేసి) నిజమేనండి యీయన వచ్చి అప్పుడు నన్ను రక్షించేరు.

పట్టా—(నవ్వునాపి) నే నబద్ధమనడం లేదు ఆతని కవితాధోరణికి నవ్వొచ్చింది గట్టివాడే.

కుమా—(తనలో) గట్టివాడను కాక మెత్తనివాడ ననుకున్నా డేమిటి! Ice fruit లాగ నోటిలో వేసుకొని నమిలేయడానికి మతిపోయి నవ్వి నా భాషనువిని నవ్వేనంటున్నాడు ఏమి నాకేమి లోటు నాభాష కేమిలోటు? వెర్రి వెంగలప్ప!

బాల—Then continue.

పట్టా—నాయనా! నీవే దేశమువాడవు.

కుమా—(సగర్వముగా) ఆఫ్రికాఖండములోనివాడను.

పట్టా—భేష్! తెలివితేటలు గలవాడవే అయితే నిన్ను లెక్కలలో వేయవలసినదే.

కుమా—యిప్పుడు వేతే వేమునక్కఱ లేదు నాది లెక్కలు Group అండి.

పట్టా—అదికాదు నిన్ను లెక్క పెట్టవలసిన దేనని.

కుమా—ఎందులోనండి చచ్చిపోయేవాళ్ళలోనా? లేక కవులలోనా?

పట్టా— అబ్బే! శుద్ధ వెర్రివెధవలలో?

కుమా—అదేమిటండీ! అలా అంటారు. నేనేమి తప్పు చెప్పేనండి.

పట్టా—తప్పు కాదూ? నేను "ఏ దేశస్థుడవంటే" ఆఫ్రికాఖండము లోని వాడనంటావా?

కుమా—ఓహో! అదా! హిందూ దేశస్థుడను. నేను, హిందూ దేశము, ఆఫ్రికాఖండములోనిదిగదా అందుచేత అలా చెపితే సరిపోతుందనుకున్నాను.

పట్టా—(మాటల నొక్కి) హిందూ దేశము ఆఫ్రికాఖండములోనిదా?

కుమా—మరి కాదుటండీ. హిందూ దేశములో కాంగో అరణ్యాలు, Black forest, నైలునది, Victoria సరస్సు యివన్నీ లేవుటండీ!

పట్టా—(నవ్వి) కదిపితే కందిరీగలపుట్టలాగ ఉన్నావు. నీతో యింక అధికంగా ప్రసంగిస్తే ప్రయోజనం లేదు.

కుమా—ప్రయోజనం లేకపోతే మానెయ్యండి?

బాల—Mend your tongue a little?

కుమా—అంటే నాలుక ముడుచుకోమనా? అలాగే (అని నాలుక పైటకుతీసి లోనికి మడత వేయును.)

పట్టా—అబ్బో! యీయన పరమానందయ్యగారి శిష్యులలో మొదటి వాడిలాగున్నాడే.

కుమా—అబ్బే! బాలకృష్ణన్ గారి శిష్యుడనండి.

బాల—Shut up ideat.

కుమా—అయ్యో బాబు, యిదేలాగండి. యిందాక నాలుక మడత వేయమన్నారు. యిప్పుడు నోరుమూసికోమంటున్నారు. యిప్పుడు ఏది చేసేది.

బాల—Shut up I say.

కుమా—అయితే అలాగే లెండి (నోరు మూసికొనును)

పట్టా—యింక కథలోకి దిగితేమంచిది ఎంతవఱకూ వచ్చేవయ్యా! Continue.

కుమా—ఓహో! మళ్ళా యిదో గొడవ ఆయన చెప్పమంటారు. యీయన నోరు మూసికోమంటారు. యిప్పు డేమి చేసేది? ఏమండి Sir! ఏమి చేయమంటారు?

బాల—ఆయన అడిగిన దానికి సమాధానం చెప్పు

కుమా—చిత్తము. (అని పట్టాభి నుద్దేశించి) ఏమిటండీ మీ ప్రశ్న?

పట్టా—ఎంతవఱకూ వచ్చేవు అని

కుమా—ఎంతవఱకూ వచ్చేను. జమీందారుగారింటివఱకూ.

పట్టా—(మరల నవ్వి) నీతో మాట్లాడడము కష్టంగా ఉంది. నీవు స్కూలుఫైనల్ యింకా మొదటి ఏడాదేనా?

కుమా—అబ్బే! V Form మొన్ననే ప్యాసయి వొచ్చ్యానండి.

పట్టా—అయితే ఫస్టుఫారంలో గజపతిమహాన్నాయుడు దండయాత్రలు సాగించవచ్చు.

కుమా—గజపతిమహాన్నాయుడా? O! Yes! I know him well. He is my class-mate. యిప్పుడు మా డివిజనులోనే ఉన్నాడండి ఆసుర్రాడు.

పట్టా—Ideat! అడిగినదానికి సమాధానం చెప్పు. తర్వాత నేమి జరిగింది?

కుమా—ఓయి బాబు అంతకోప్పడితే ఎలాగండి. చెప్తున్నానువినండి. (అని ఆలోచించి) యిందాకా ఎంతవఱకూ చెప్పేను.

పట్టా—ఆ అమ్మాయిని రక్షించేవు. తర్వాత?

కుమా—ఆ! జ్ఞాపకమొచ్చింది. అలాగా చాలాసార్లు పానకంలో పుడకలాగ ఆయనకు అడ్డువచ్చేనండి. అందుచేత ఆవిరోధం కొద్దీ నాకు Marks తగ్గించి, నన్ను కూడా select చేయలేదండి.

పట్టా—ఆ! నీ తెలివితేటలు చూచి నిన్ను తప్పక select చేయవలసిందే?

కుమా—మరేనండి అదేనండి నేనూ అంటూంట.

పట్టా—Shut up. యింతేనా నీవు చెప్పదలచుకొన్నది యింకేమైన ఉందా?

కుమా—(నోరుమూసుకొని. తాను చెప్పదలంచుకొన్నది యింకేమియు లేదని, సంజ్ఞాపూర్వకముగా సూచించి, నిలచియుండును)

పట్టా—ఏమండీ! Principal గారూ! యిదంతా నిజమేనా?

బాల—Sir! నేను మొదటనే చెప్పినగదా! యిలా చాలా ఉన్నాయి Sir! ఆయన యింకా school లో ఉంటే students strike చేయడానికి సిద్ధంగా ఉన్నారు చాలా గోలజరుగుతుంది. అంతా పాడైపోతుంది. అందుచేత నేను resign చేద్దామను కొంటున్నాను Sir! ఆయనకు నాకు యిప్పుడు యిందువలన విరోధం వస్తుంది.

పట్టా—అబ్బబ్బా! మీరు resign చేస్తే అసలు college run చేయడం చేయడం కష్టం. మీరు తప్పకుండా ఉండాలి. నేను ఆయనను పిలిపించి బాగా బుద్ధిచెప్తానులెండి.

బాల—అదియేమైన లాభంలేదు Sir! యిలా చాలాసార్లు అయింది. ఆ School లో నేను ఉండాలి, లేదా? ఆయనుండాలి. అంతే.

పట్టా—ఎందుకు? ఆయనను పిలిపించి నేను అడుగుతానన్నానుగా? యింకాముదిరినట్లయితే Dismiss చేసేస్తాను.

బాల—ముదరం కేమి Sir! యిప్పుడు సంస్థ చాలా పాడయిపోయింది. యింకా ఆయన ఉంటే కొంప మునిగిపోతుంది. ఆయన అడిగితే యివన్నీ ఒప్పుకుంటాడా? మనకు ఎదురుగా కావలసినంత సాక్ష్యముందిగా? యింక ఎందుకు? ఉపేక్షించడము?

పట్టా—అవును. దొంగను దొంగతనము చేసావా అంటే ఒప్పుకుంటాడా? అదంతా ఎందుకు? ప్రత్యక్షంగా సాక్ష్యముందిగా!

సరే యిప్పుడే Dismissal order వ్రాయండి సంతకం పెడతాను

బాల — బాగా ఆలోచించారా?

పట్టా — యింక ఆలోచన అవసరం లేదు. స్వయంగా వ్రాయండి సంతకం పెడతాను.

బాల — అను. (అని వ్రాయుచుండును)

కుమా — గ్రుడ్డిపీనుగ. మా బాగా పడ్డాడు మీ వలలో. (లీలతో) మంచి పనిజరుగుతూంటాం హెడ్మాష్టరుకి.

లీల — ఉస్! మాట్లాడకు.

కుమా — ఎవరితో మాట్లాడినా గొడవే. నా ఖర్మం (అని నోరునొక్కుకొనును)

బాల — అను. సరిగా వుంది సంతకం పెట్టండి (కాగితం యిచ్చును)

పట్టా — (కాగితము తీసికొని) యిలాగ మనం వొకడిని Dismiss చేస్తేనేగాని మిగతా వాళ్ళకు బుద్ధిరాదు లేకుంటే స్కూలు వదలి వెళ్ళిపొయ్యేటంత భ్రష్టులౌను. (కాగితము చదివి, సంతకం పెట్టియిచ్చును)

బాల — Yes! Your honour!

లీల — అయ్యో! మరి నా మాటో!

పట్టా — యీ అమ్మాయి papers revalue చేసి మీరే యీమెను select చేయండి.

బాల — ఆను.

కుమా — మహాప్రభో! నన్ను మఱచితిరి.

పట్టా — కవిసార్వభౌములు! మూర్ఖాగ్రేసర చక్రవర్తులు మిమ్మల్ని మరుస్తామా? యీ కవిగారినికూడా పంపించండి! మీరు జాగ్రత్తగా చూచి,

కుమా — భేష్! మంచి title యిచ్చేరు. యింక ప్రతీపేపరులోను నా title వ్రాసుకుంటూ ఉంటాను మీ ధర్మమా అని.

బాల & లీల — శలవు తీసికొంటాము.

పట్టా—మంచిది యింతటితో మాగిద్దాము నేటికి.
కుమా—అయ్యా ! శలవు.
పట్టా—వెళ్ళిరండి ! కవిగారూ !
కుమా—చిత్తము (నడచుచుతననలో) మీబోటి పెద్దలు అలామమ్మల్ని ఆశీర్వదించాలి యింతటినుండి 'కుమార్' కవి అయ్యేడు భేష్
(అందరు నిష్క్రమింతురు)
(తెర పడును)

## నాల్గవ రంగము

ప్రవేశము : వ్రాలియున్న తెర ముంగిట

[ప్రవేశము : లీల, కుమార్, బాలకృష్ణన్]

లీల—మేష్టారు ! మీఋణం తీర్చుకోవడం కష్టం నాకోసము చాలా శ్రమతీసికొన్నారు.
బాల—అది ఎంత ? ఏదీ ? నీపని అయిందికదా ! నీవుద చెప్పింది మఱువకూడదు.
లీల—అబ్బెబ్బె ! మరచిపోతానా ? రేపు మిమ్మల్ని తప్పక కలుసుకుంటాను.
బాల—మొత్తంమీద ఆ Head master కి తగినశాస్తి చేస్తిని సరే నేనుద వెళ్ళివస్తును. నీవుద ఆవిషయం మఱచిపోకు.
లీల—మఱచిపోను వెళ్ళిరండి.
బాల—ఆను (అని పోవుచుండ)
కుమా—(ఎదురుగాపోయి) Good evening sir !
బాల—(నవ్వి) Good evening. (నిష్క్రమించును)
కుమా—ఆ పిచ్చిముండావాడు పాపం బ్రద్దలయి మనతో విరోధం పెట్టుకొన్నాడు Principal గారు అడిగినా Marks వేయనంటాడే ? మామంచిపని జరిగింది.

లీల—ఓయి ! పిచ్చిపంతులా ! యీ ఆడసింగముతో ఏల విరోధము పెట్టుకుంటివయ్యా !

సీ. అబలననుకొంటివే నెయి సీ ♦ ఆత్మయుఁడు
లీలతో విరోధ మిదియే ♦ లేశమేని
దయదలంపబోకు మూర్ఖ ♦ దాంధ ! శాసి
నీకిదే చాలదింతతో ♦ నిన్ను నీడ !
నిన్ను పీల్చి పిప్పిచేయువఱకును విడువను.

కుమా—అవును చెఱుకుముక్కను పీల్చినట్లు పీల్చెయ్యాలి లేకపోతే మనకు మూర్ఛలు వేయనంటాడే?

లీల—కుమార్ ! వీడి నింతటితో విడువకూడదు వీడి ప్రాణాలన్నీ ఆ పూర్ణపై ఆధారపడి యున్నాయి ఆమె బ్రతుకంతా ఆనందుపై నిలబడివుంది అందుచేత యీ పూర్ణానందులను వేఱుచేసామంటే వీడు దెబ్బతో ప్రాణాలొదిలేస్తాడు యీ ఉద్యోగం పోవడానికితోడు అపచారంకూడా తెచ్చిపెట్టామంటే మనిషిమళ్ళా మంచంమీదనుండి లేవకుండా పడతాడు.

కుమా—అవును పూర్ణానందులను సంపూర్ణంగా వేఱుచేయాలి Yes. you are right ఆలోచించు ఏదో బాణము విసురు దెబ్బతో చస్తారు.

లీల—(ఆలోచన నభినయించి) కుమార్ ! నాకొక ఊహ తట్టింది.

కుమా—ఏమది?

లీల—హెడ్మాష్టరుగారిని Sudden గా Dismiss చేసినట్లు, తనతండ్రికి వచ్చిన కష్టమును, లోకాపవాదమును సహించలేక పూర్ణ ఆత్మహత్య చేసికొనినట్లు ఆనందుకు ఒక ఉత్తరం Post చేద్దాము పూర్ణ మరణవార్త వింటే ఆనంద్ ఆత్మహత్య చేసుకుంటాడు.

కుమా—మా భాగుంది Head master గారు వ్రాసినట్లు వ్రాద్దాము తప్పకుండా నమ్ముతాడు. ఆయన Writing నేను imitate చేయగలను మరి పూర్ణమాటో?

లీల—"ఆనందుకు మా బంధువులమ్మాయిని వివాహము చేస్తాము కాబట్టి మీరు అమ్మాయిని వివాహము చేసుకో" అని ఆనందు తల్లిదండ్రులు వ్రాసినట్లు, పూర్ణకు ఒక letter అందజేద్దాము ఆవార్త వినగానే యీపిడ ప్రాణత్యాగం చేస్తుంది ఆ దెబ్బతో Head master గారు నుయ్యో, గొయ్యో, వెతుక్కుంటారు.

కుమా—భేష్! ఉపాయం బాగానే ఉంది కాని, ఆనంద్ తల్లిదండ్రులు వ్రాసినట్లు వ్రాయడమెందుకు? అతడే వ్రాసినట్లుండకూడదా?

లీల—ఆనందు Writing వీళ్ళకు బాగా తెలుస్తుంది Intermediate వరకూ, Head master గారి వద్దనేఉండి చదువుకొన్నాడుటగా?

కుమా—సరే! మంచిఆలోచన కాని ఆతని తల్లిదండ్రుల ఊరునుంచి ఆ ఉత్తరము వచ్చినట్లుpost చేయడమెలాగ?

లీల—ఓయి వెఱ్ఱివాడా? యింత చేసినవాళ్ళము ఆమాత్రం చేయలేమా? ఎవరినైనా ఆఊరు పంపించి వారిచే అక్కడ psot చేయిద్దాము.

కుమా—యింకనేమి? యీదెబ్బతో స్వర్గలోకం చేరుకుంటాడా ముండావాడు నడు. అన్నిపనులు యివాళే జరగాలి తగు ప్రయత్నంలో ఉందాము నడు.

లీల—అవును రెండు Letters కూడా యివాళే post చేసేలా చూద్దాము అంతా నిముషాలమీద జరగాలి నడు.

కుమా—(నడచుచు) కాని, లీలా! రాత్రికి Principal గారు రమ్మన్నారుగదా! వెడతావా?

లీల—యింకెందుకు? మనపని అయిపోయినది గదా! తర్వాత చూసుకుందాము. అంతగా మళ్ళీ కబుర్లంపి నిర్బంధించేడంటే అసమయానికి మళ్లా ఉపాయము పన్నుతానుగా ?

కుమా—యింకెందుకు అవసరం తీరిందిగా! నిజమే అడవాళ్ళతో పనింతే

పాట. కోర్కె కొనసాగు నందాక నె
అటుపిమ్మాట మోమైన
చూడ రాయాగదా !
ఆడవారి నడతె నమ్మరాదు గదా!

లీల—ఊఁ! నడు.

(నిష్క్రమింతురు)

——

# డాక్టరు

## చతుర్థాంకము

### మొదటి రంగము

ప్రదేశము : గృహము

[ప్రవేశము : ఆనంద్]

ఆనం—(విచారముతో, నిట్టూర్పు విడచి) ఆహా! పరమేశ్వరా!
ఏమి నీవిచిత్ర నిర్మాణము!

ఉ. బీజము వేసినావది యు ♦ భవ్యముగా స్థిరమై మనోస్థలిన్
త్మాజముగాను నిల్చితగు ♦ మాత్రపు శాఖలు వేయుచుండ నీ
తేజముతోడ దాని నటు ♦ ఖైళ్ళగ చేసితి వీవు క్రూరతన్
ఓ! జపమాలికాభరణ! ♦ ఒప్పుగ నిన్ను భజింపనేటికిన్!

ఎంత వైపరీత్యము Head master గారు Dismiss అయేరా? అందుచే నాపూర్ణ ఆత్మహత్య చేసుకొనినదా? ఆహా! పూర్ణా! ఆనాటి తోటలో ఆలింగనమే కడసారి ఆలింగనమైనదా? యీప్రపంచమును వీడిపోతివా? పూర్ణా! ఆనంద్‌కు పూర్ణలేనిదే పూర్ణానందము చేకూరునా? యింక నీప్రేమస్వరూపము నాకన్నుల కగపడదా? (ఆలోచించి) ఆ! యిది నిజమని ఎట్లు నమ్మగలను? లేకొకవేళ ఎవరయినా విరోధులు కల్పించిరేమో? (అప నొకింతయాగి) కాదు యిదిగో! ప్రత్యక్షనిదర్శనము ఉత్తరము యిది హెడ్మాష్టరుగారి స్వహస్తలిఖితమే? నిజమే? నాపూర్ణ నన్ను వీడిపోయినది పూర్ణా! నిన్ను వీడి

నేను జీవించగలనా? యింకనూ యీదీనుని పతిగా స్వీకరించకుండగనే వీడిపోతివా? (మాటల విచారించి) ఎన్నటికిని నా పూర్ణ నన్ను వీడి పోదు, పోదు. నన్ను వీడిపోదు నేను నా పూర్ణను కలసికొంటాను (పోబోయి మాటల ఆగి) ఏమి నా వెఱ్ఱి ఎక్కడకి ప్రయాణాము.

(వచ్చి కూర్చుని. నిస్పృహతో విచారవదనముతో కూర్చొని యుండును)

ప్రేమలేని జీవితము వృథా? తప్పక హృదయ రాధ దేవతను చేరాలి నా జీవిత పరమావధి చూడాలి.

[ప్రవేశము : రాజ్యం]

రాజ్యం—(చూచి) ఆనంద్

ఆనం—(ఆశ్చర్యముతో చూచి సంతోషమును నటించుచు) రాజ్యం! రా! యిలా కూర్చో! ఎంత సేపయింది నీవు వచ్చి?

రాజ్యం—నా రాక కేమి? నేను స్పృహాడ మాకారము మేఘావృతమైనట్లున్నదే!

ఆనం—లేదు నిర్మలముగా నే యున్నది

రాజ్యం—ఆనంద్! నన్ను మోసపెట్టకు నీవు విచార సాగరములో నీదు లాడుచున్నట్లు నీ ముఖవిలాసమే స్పష్టముగ విశదపఱచుచున్నది

ఆనం—రాజ్యం! నిజమే ఒక స్త్రీ వ్యక్తి వలన నా జీవిత మహారణ్యమైనది ఆశాజ్యోతి ఆరిపోయింది.

రాజ్యం—స్త్రీ వ్యక్తా! ఎవరది?

ఆనం—రాజ్యం! నా జీవితనౌక అలలలో నిండిన మహాసముద్రములో పడుతూంది కెరటాలు దాన్ని ముంచేస్తాయో, దరిజేర్చుతాయో తెలియదు.

రాజ్యం—ఆనంద్! నావద్ద దాస్తానికి నేను పరాయిదాననా?

ఆనం—రాజ్యం! సంగతంతా చెప్తాను విను తల్లిదండ్రులను వీడి, పట్నము చేరి నేను కాలేజీలో చదువుచుండగా ఆ School Head master గారు నా తెలివి తేటలను చూచి పయిగా ఎక్కడా ఉండక యిక తనవద్దనే ఉండమని కోరినారు ఆయన

యిష్టప్రకారము నేను వారియింట్లో నేఉంటూ, intermediate వరకు చదువుతున్నాను. అప్పుడే ఆయన కుమార్తె పూర్ణ, నేను గాఢంగా ప్రేమించుకున్నాము. అచ్చట చదువు పూర్తియిన తరువాత, డాక్టరు Course కి యీవూరు చేరేను. యిక్కడుంటూన్నా నాహృదయమంతా ఆమెయందే ఉండేది. సెలవులు దొరకడమే తరువాయి, వెళ్ళేవాడిని. గతించిన క్రిష్టమస్ సెలవులకికూడా వెళ్ళి వచ్చాను. Headmaster గారు యెంతంతోషంగా మా యిద్దరికీ వివాహం చేస్తానన్నాడు. యీ Course finish అవగానే తప్పకుండా marriage చేసుకుంటానని promise చేసాను. యిలా ఉంటుండగా యీ మధ్యను జరిగినసంగతి యీ letrte మూలంగా తెలుస్తుంది.

రాజ్యం—(ఉత్తరం చదివి, నిస్పృహతో) నిరాశ భగ్నహృదయుడు.

ఆనం—రాజ్యం, యిట్టి పరిస్థితిలో నా ఆత్మకు శాంతియేది? యింక యీ ఆశలేనందుకు యీజీవితంలో ఆనందం ఉందా?

రాజ్యం—అలాగయితే యిప్పుడేమి చేయతలచుకున్నావు?

ఆనం—నా ప్రియురాలు ఆత్మలో నా ఆత్మను ఐక్యం చేయతలంచుకున్నాను.

రాజ్యం—మరణమా? బలవన్మరణము తగనుసుమా!

ఆనం—జీవించి చేసెడునదేమి? సారములేని భూమి ఎట్టిదో, ప్రేమలేని హృదయముకూడ అట్టిదే! యింక అది నిష్ప్రయోజనము

రాజ్యం—భూమి సారవిహీనమైనప్పుడు ఎరువువేసి దానిని సారవంతముగా చేయవచ్చును గదా!

ఆనం—ఎరువువేసి సారవంతముగా చేసినను ప్రథమమున నుండెడి సారము కాదుగదా!

రాజ్యం—అట్లయిన నీజీవితాన్ని ఒక స్త్రీ వ్యక్తికోసం బలీయదలచుకొన్నావా?

ఆనం—ఆ! అంతే.

రాజ్యం—యిదేనా! పురుషార్థము. రైలు ఎంతమంది జనాన్నైనా ఎక్కించుకొని దాని గమ్యస్థానాన్ని చేరుకుంటుంది? ఆలాగే మన జీవితంకూడా ఎన్నికష్టములున్నా సహించి గమ్యస్థానాన్ని చేరుకోవాలి. అంతేగాని మధ్యను వచ్చే చిన్నఅడ్డంకులకే ఆగిపోతే యెలాగ?

ఆనం—రాజ్యం! యికనీ వెన్ని చెప్పినా యీబుద్ధికెక్కవు. వృథా ప్రయాసవలదు.

రాజ్యం—అట్లైన నిన్నే నమ్ముకొనియున్న ఒక ఆడుదానిని అగాధమున త్రోసివేయ సిద్ధపడుదువా?

ఆనం—నన్ను నమ్ముకొనిన ఆడుదా? నాపూర్ణతప్ప ఎవ్వరును లేరే?

రాజ్యం—ఆనంద్! ఎవ్వరో యననేల? నేనే ఆనంద్!

గీ. హృదయమదియేమొ? నీయదె ♦ హత్తుకొనియె
నిలుపలేనింక నినువీడి ♦ నిముసమేని
నామనోనాథుడవు నీవె ♦ నమ్మియింక
నీటముంచినన్ తేల్చినన్ ♦ నీవెగావె!

ఏనాడు నీవు మాయింట్లో కాలుపెట్టేవో ఆనాడే నామనోనాథుడవు నీవేనని నిశ్చయించుకున్నాను. నన్ను భగ్నహృదయను చేస్తావా!

ఆనం—రాజ్యం! క్షమించు యిన్నాళ్ళు నీహృదయం గ్రహించుకోలేక నీతో చనువుగా మసలేను అది నీవు ప్రేమగా భావించేవు. యిదివరకే ఒరులచే ఆక్రమింపబడిన నాహృదయములో యితరులకు తావెక్కడిది?

రాజ్యం—ఆనంద్! నాఆశాసౌధాలన్నీ ఒక్కసారిగా కూల్చేస్తావా? నన్ను నట్టడవిలో విడుస్తావా? నాఆశయాన్ని నెరవేర్చవా?

(అని బ్రతిమాలును)

ఆనం—వెర్రిదానా! నాకింక జీవితముపై యాశలేదు. నన్నేల పట్టుకొని ప్రాకులాడుతావు నిష్ప్రయోజనం నీ ఉద్దేశాన్ని మార్చుకో!

రాజ్యం—ఆనంద్! నీవు పూర్ణనుండి నీహృదయము నెట్లు వేఱుచేయ లేవో, అట్లే నిన్ను నాపవిత్రహృదయమునుండి వేఱుచేయ లేను. అందుచే నీకోసమేగాదా నేను బలికాగోరుచున్నాను.

(అని ఆనందు పాదములచెంత మోకరించి యుండును)

ఆనం—ఏమి? నీవుకూడ మరణించుదువా? పరమేశ్వరా! ఎంతకఠిన పరీక్ష చేయుచుంటివి పూర్ణా! నా కిప్పుడు మార్గమేది? పూర్ణా! (అని టేబిలుపైనున్న ఉత్తరమును దీసి నలుపుచు, ఏదో క్రొత్త విశేషమును గాంచినటుల చటాలున ఆగి, ఆ ఉత్తరమును విప్పి) ఏమిది? (అని ఇట్లు చదువును) 'పూర్ణ చని పోవుచు, తనకు ఆత్మశాంతి చేకూరాలంటే, నీవింకొక కన్యను వివాహమాడాలని చెప్పింది ఆమె ఆశయాన్ని వృథాచేయక తప్పక వివాహంచేసుకో' ఆ! ఏమి? పూర్ణ ఆత్మశాంతి కొఱకు నాకు వివాహమా? ఇంకొక కన్యకు నాహృదయమున ఆశ్రయమీయనా? పూర్ణా! నాకు వివాహమా? (నిదానించి) ఆ! అవును తప్పను నాపూర్ణ ఆత్మశాంతి కొఱకు నేను వివాహం చేసుకొనుట తప్పదు ఆమె కోరిక నెరవేర్చాలి చేసుకుంటాను వివాహం చేసుకుంటాను ఆమె ఆత్మశాంతియే నాఆత్మశాంతి (అని రాజ్యంనుజూచి) రాజ్యం! లే! నాపూర్ణ ఆత్మశాంతికొఱకు నాయందు బద్ధానురాగవై యున్న నిన్ను వివాహము చేసికుంటాను తప్పక వివాహం చేసుకుంటాను లే (అని రాజ్యంను లేవదీసి, దగ్గరగా చేర్చుకొని) పూర్ణ ఆత్మశాంతియే నాఆత్మశాంతి వివాహం చేసికుంటాను. (అని కౌగలించుకొనును)

(తెర పడును)

## రెండవ రంగము

ప్రదేశము : పూజామందిరము

[ప్రవేశము : సీతాపతిరావు]

సీతా—(పూజచేసి) హే! ఆదిమధ్యాంతరహిత! అనాథరక్షణ! ఆశ్రితపోషణ! అసురాంతక! మునిజనవందిత! పాహిమాం.

ఉ. భక్తులనయ్య నమ్ము నని ♦ పాలనసేయక గావుమంచు నా
శక్తి గొలంది నిన్ గొలువ ♦ జాగొనరింపక వచ్చి బ్రోచునా
భక్తులబ్రోచి ముక్తి నిడు ♦ సార్థమటంచు కృపామతిన్ సదా
శక్తి నిగామునో ఘనుడ ♦ జాలిగ నీకిదె మ్రొక్కెదన్ ప్రభో!

(అని కన్నులు మూసికొని ధ్యానించుచుండును)

[అంత జనార్ధనం, చేత కాగితములతో ప్రవేశం]

జనా—(సీతాపతిని జూచి) ఆహా! ఏమి యీతని భక్తివిశేషము యీకలికాలమునందింకను యిట్టిభక్తశిఖామణులుండబట్టియే దానదయాధర్మములు పూర్తిగా నశించలేదు సుగుణనిధి యీయన గుణశేషముల నేమని వర్ణింపగలను.

సీ. బీదవిద్యార్థులన్ ♦ ప్రేమ మీఱ పోషించి
ఆదరించెడి పట్టి ♦ మాపు డితడు
'అన్నమో! రామచం ♦ ద్రా!' యంచు వాపోవు
యార్తులపాలిట ♦ అమరవిభుడు
దేశాభిమానము ♦ దీపింప సర్వ మ
ర్పింప సంసిద్ధుడౌ ♦ వీరుడితడు
ఎంతధనికుడైన ♦ యీశ్వరు చరణంబు
వదలక సేవించు ♦ భక్తపరుడు

గీ. పుణ్యచరితుండు విజ్ఞాన ♦ మూర్తి యితడు
ధనికులందెల్ల పేర్గాన ♦ దగినవాడు

యిట్టి చరితార్థులను గని ♦ ఎంత ధన్య
చరితయో! పావనాత్మ నా ♦ భారతాంబ!

ఆహా! మూర్తీభవించిన దేవతాస్వరూపములా! యెంత నెమ్మది ప్రజ్వలించు చున్నాడో! (అంత సీతాపతి పూజముగించి జనార్దనునిజూచి)

సీతా—ఓహో! నీవా? నాయనా! ఎంతసేపయింది వచ్చి?

జనా—యిప్పుడే మీరు పూజచేస్తున్నారని, తరువాత కలసికొందా మని అనుకుంటున్నాను

సీతా—ఏమిపనిమీద వచ్చేవు?

జనా—రాబోయే శుక్రవారం మీరు Trusty లుగాయున్న పాండు రంగ దేవాలయములో ఆ దేవదేవుని ఉత్సవము జరుగ బోయేది జ్ఞాపకముందా ?

సీతా—ఆ! పాండురంగని ఉత్సవము కదా ?

జనా—ఆ విషయంలో ఏమి ఏర్పాటులు చేయించాలో తెలుసుకుందా మని వచ్చేను.

సీతా—నాయనా! యీ ఉత్సవాలలో యింత డబ్బు అనవసరంగా వ్యయపరచడం మంచిది కాదు. సద్వినియోగం చేయాలి మనం, యిప్పుడీ ఉత్సవంలో దేవుడికి పదివేల టెంకా యలు కొట్టినందువల్ల, తిరునాళ్ళు జరిపించే మనుషులకు, అదిగాక బోగం మేళాలు, హరి కథలు, గానకచేరీలు, యిటువంటి వన్నీ పెట్టి చాలాగొప్పగా చేసినందుకు వీటన్నిటికీ డబ్బు ఖర్చుపెట్టడమే కాని, ఏమై నా ప్రయోజనముందా ?

జనా—ఏమి లేదండి.

సీతా...అందుచేత అటువంటి హంగామీ ఏమీ లేకుండా, ఉత్సవము టూకీగా జరిపించేసి, ఆనాలుగు రోజులు, ఎంతమంది వస్తే అంతమందికీ లేదనకుండా. దేవుడి పేరుమీద అన్నదానం చేయించు.

జనా—భేష్! చాలా చక్కగా ఉంది మీ అభిప్రాయము. యీ

విధంగా చేస్తే ప్రస్తుత కలకత్తారోజుల్లో తిండిలేకుండా బాధపడుచున్న ప్రజల యాకలిబాధ కొంత చల్లారుతుంది. నలుగురు సంతోషిస్తారు. యీవిధంగా ప్రజాసేవ చేయడం భగవంతుడు కూడా మెచ్చుతాడు.

సీతా—అదే మనకు కావలసినది. ప్రజాసేవయే పరమాత్ముని సేవ. ప్రజాసంతోషమే పరమాత్ముని సంతోషము. అందుచేత యీ ఏడాది పాండురంగ జన్మదినోత్సవం అన్నదానంతో మహావైభవంగా జరిగించు.

జనా—ఆదర్శప్రాయమైన పని చేస్తున్నారు. మరి నేను తగుప్రయత్నంలో ఉంటాను. శలవా?

లతా—మంచిది, వెళ్ళిరా! యీవిషయంలో ఎంతడబ్బు ఖర్చు అయినాసరే వెనుదీయకు.

జనా—అలాగే శలవు.

సీతా—మంచిది. (జనార్దనం నిష్క్రమించును)

సీతా—తదేకధ్యానంతో, జనార్దనం వైపు జూచి) యీతని చరిత్రము, నడవడి అంతయు నాకుమారుని మాడుమూర్తుల బోలుచున్నది సరే యీతని విషయములో కలకత్తా పోలీసు వారికి వ్రాసితిసిగదా! ఏమి సమాధానమొస్తుందో! పరమేశ్వరా! అనంతకోటి బ్రహ్మాండనాయకుండవగు నీఅసమాన విలాసాదులను గుర్తింప అజ్ఞులమగు మాకలవియగునా? సదా నీపద ధ్యానము తప్ప మాకితరము లేదు. నీటముంచినను, పాలముంచినను నీదేభారము. (అని నమస్కరించును) (తెర)

---

## మూడవ రంగము

ప్రదేశము : యిల్లు

ప్రవేశము : పూర్ణ

పూర్ణ—(విచారము సూచించు) పరమేశ్వరా! అమాయకుడును, న్యాయపథుడును అగునా తండ్రికి ఉద్యోగము పోగొట్టితివి.

నా ప్రేమఫలము. నా హృదయాధినాథుని, ఆనందుని వేఱు చేసితివి గంగా! ఎన్నెన్ని కష్టపరంపరల పాలుగావింప చేసిన పాపమేమయ్యా? గంగా (అని విచారించుచుండును)

జగ్గన్న, చేతిలో పుస్తకముతో ప్రవేశం)

జగ్గ—అమ్మాయి! అర్ధరాత్రి కావచ్చిందికదా! యింకా నిదుర పోలేదే? తల్లీ! అయ్యయ్యో! యిలా రాత్రులు జాగారము చేస్తుంటే శరీరసౌఖ్యము చెడదా తల్లీ!

పూర్ణ—నాన్నగారూ! యీజీవితకు ఒక్కటేనిద్దుర యీ శరీరమునకు తీఱని విశ్రాంతిమే కలుగనున్నది.

జగ్గ—అమ్మా! కష్టాలు ఎల్లకాలము కాపురముండవు కొన్నాళ్ళు చీకటి తెలుపులాగ వెన్నెల ప్రతిజీవికి ఆదినో మధ్యముననో, లేక అంత్యముననో కష్టదశ తప్పదు.

పూర్ణ—నాన్నగారూ! నాకు సుఖ మెక్కడిది? అన్నివిధాలఆపదలే గదా? ముళ్ళకంపచే ఆవరింపబడిన యీ చిన్న మొక్క అణగి పోతుంది కాని అభివృద్ధి పొందుతుందా?

జగ్గ—అమ్మా! ఆ ముళ్ళకంపను "జ్ఞాన" మనేటి అగ్నిచే దహింప చేయాలి చూడు అటువంటిజ్ఞానాన్ని యిచ్చేవి యీ Books షేక్స్పియరు మహాకవి వ్రాసిన యీనాటకాన్ని చదువు ఎటువంటి చక్కని భావంతో కూడుకొనిఉందో!

పూర్ణ—నాన్నగారూ! నా బ్రతుకే మహానాటకమైతే యింక వేరొక నాటకాన్ని చదవడమెందుకు? అంతా ప్రత్యక్షంగా అనుభవిస్తూన్నదే గదా!

జగ్గ—చిట్టితల్లీ! నీవెంత బేలవై పోతివమ్మా! జీవకోటి కంతటికి ప్రత్యక్ష దైవములైనటువంటి ఆసూర్యచంద్రులకే గ్రహణమనెడి ఆపద తప్పలేదు కాని గ్రహణస్థుడైన చంద్రుడలాగే ఉంటాడా? ఆగ్రహణము విడిపోగానే తిరిగి తనచల్లని కిరణములతో ప్రకాశించడా? అటువంటిది మనమెంత తల్లీ! విచారించకు సుఖదినములు రాకపోవు రసాలవృక్షము గ్రీష్మఋతువు

రాగానే ఆకులు రాల్చేస్తుంది తిరిగి వసంతకాలము రాగానే ఫలపుష్పభరితమై జనులకు ఆహ్లాదకము నిచ్చుట లేదా ?

పూర్ణ—నాన్నగారూ! మీరెంత చెప్పినను నామనస్సుకు శాంతి ఎలా చేకూరుతుంది చెప్పండి? మీకు, ఉద్యోగము పోయి నది నా ప్రేమమూర్తి ఆనందా, వెర్రైపోయినాడు యిక ఆనందము లేనాగదా ! (నిట్టూర్పు విడచును)

జగ్గ—అమ్మా! నా ఉద్యోగం తీసివేయడానికి బుద్ధిపూర్వకముగా నే నెవరికి హానిచేయలేదుగదా! జాతిమతవైషమ్యాలను మన స్సులో ఉంచుకొని, తన ఆనందానికి అడ్డుతగులుచున్నానని తనయాజ్ఞను పాటించి, ఆలేలా. కులాంగ్‌లకు మార్కులు వేయ లేదని తప్పుదిద్దినాననని, ఆప్రిన్సిపాల్ జమీందారుకి నా మీద చాడీలు చెప్పి ఉద్యోగం తీయించేసెను యిందులో నాదేమి తప్పు లేదుగదా !

పూర్ణ—నాన్నగారూ. యిందులో ఎవరిదీ తప్పులేదు అంతా ఆ పరమేశ్వరునిదే తప్పు అతను మంచివారలకే కష్టాలు కల్గిస్తూ ఉంటాడు చూడండి! సాధుసంతుడైన క్రీస్తుత్యాగము నాభి లో జనులకు మహోపకారియైన "క్రీస్తు"నుంచలేదా? అదే ఏ అస్పృశ్యతాలయాని కే యిచ్చియైన నుంచినవో ఎంత బాగుండును.

జగ్గ—నిజమే గ్రహస్థుల ఏమి కాలేదు అను చేతనే అన్ని అలాగ ఒకేసమయానికి సంకూడేయి పోసి ఆ జమీందారుగారికి సర్వము హానిచేసుకుంటామని వెడితే, దర్శనమీయటానికి వీల్లేదు; వెళ్ళిపొమ్మన్నారు అదిగాక కాలేజిసొమ్ము నేను నాలుగువేల రూపాయలు అపహరించేనని, దానికి సముజా యిషీ చెప్పకపోతే నామీద action తీసికొని ఆస్తి జప్తుచేయ వలసి ఉంటుందని నోటీసుయిచ్చేరు యింక యీదీనుని ఆల కించేవారెవ్వరమ్మా !

పూర్ణ—ఏమిటేమి? దర్శనము యీయడానికి వీల్లేదన్నారూ అదిచాలక మీరు సొమ్ము అపహరించేరని అపవాదా ? ఆహా ! రంగా!

ఎంతవిపరీత పరీక్ష! దీనికంతకూ దుర్మార్గుడు, ఆ ప్రిన్సిపాలే కారకుడు ఆయన చెప్పుడుమాటలువిని నన్ను యీనిందంటే; దూడనికట్టుకుంటున్నా డీజమీందారు. తుచ్ఛుడు ప్రిన్సిపాల్.

జగ్గ— తల్లీ! ప్రిన్సిపాలుగాదు తుచ్ఛుడు యుక్తాయుక్త విచక్షణాలేని ఆ గ్రుడ్డి జమీందారు ధనమున్నదికదా యని గర్వాంధకారమున చెప్పుడు మాటలువిని పశుప్రాయుడగుటయేనా? ఆశ్రయితుల చేతులలో కీలుబొమ్మనై ఆడుటయేనా? యిటువంటి జమీందారు లుండిన నేమి? మండిన నేమి?

పూర్ణ— నాన్నగారూ! నేడు సత్యానికి తావులేదు. అసత్యానికి ఆశ్రయం ఎక్కువయింది యిటువంటి తుచ్ఛజమీందారులకే, సభలలో అగ్రస్థానము పెద్దగౌరవము ఇస్తుంది యీలోకం, లోకాన్ని ఎదిరించగల సమర్థులేరి?

జగ్గ— యిటువంటి జమీందారులే కాలేజీపోషకులు అయ్యయ్యో! విద్యలకు కేంద్రస్థానమయి భావిప్రపంచ స్థితికి ఆధారభూతులయిన విద్యార్థులను తయారుచేసి వారిజీవితములను దిద్ది, లోకానికి మహోపకారము చేయవలసిన యీసంస్థలు నేడు లంచగొండులతోను, వ్యభిచారులతోను, త్రాగుబోతులతోను, మిత్రద్రోహులతోను, అబ్బబ్బ! పంచపాతకులతోను నిండియున్నదికదా!

పూర్ణ— నాన్నగారు! మీరు చెప్పింది వాస్తవము యీ సంస్థలు బాగుపడు మార్గములేదు ఏలనందురా?

సీ. చెప్పుడుమాటల ♦ చేత సంధాత్ములా
పోషకులెందరో ♦ పుడమినుండ
జాతిభేదములెంచు ♦ జడులెందరో ప్రిన్సి
పాలురై వేధించు ♦ ప్రభువులుండ
కొద్ది గొప్పలుమేసి ♦ పెద్దమార్కులు వేయు
మేష్టరులెందరో ♦ మేదినుండ

చదువు సంధ్యలు మాని ♦ చవటలైతె తిరిగెడి
విద్యార్థులెందరో ♦ వెలసియుండ
గీ. యిన్ని రీతుల కాలేజి ♦ లింపుమీరగ
వర్ధిల్లుచునుండగా మంచి ♦ బాగుండును
తావుగలదె? వినాశము ♦ దాపురించె
నిజముగా సంస్థలో నింక ♦ నిలకడేది?

జగ్గ—తల్లీ! నా ఉద్యోగము మాటకేమి? నీ ఆనందానికి భంగం వచ్చిందికదా! యని నేను విచారిస్తున్నాను

పూర్ణ—నాన్నగారూ! నిజంగా "ఆనందు" యింకొక కన్యను వివాహం చేసుకున్నా డంటారా?

జగ్గ—అమ్మా! ప్రబలనిదర్శనము అతని తల్లిదండ్రులు వ్రాసిన ఉత్తరము లేదా? మరీ అనుమాన మెందుకు?

పూర్ణ—నాన్నగారూ! ఆనందు, అంతటి ద్రోహియా? త్రికరణశుద్ధిగా నన్ను ప్రేమించి తప్పక నన్ను వివాహము చేసుకుంటానని పంచభూతములు సాక్షిగా ప్రమాణము చేసి ఇప్పుడు ఇంకొక కాంతను వివాహము చేసుకుంటాడా? అసంభవము అలా ఎన్నటికిని జరుగదు.

జగ్గ—పిచ్చితల్లీ! నీకు ప్రపంచజ్ఞానము తక్కువనమ్మా! ఎవరెంత చెబితే అంత నమ్మేతావు మాటలకు ప్రీతులకు చాలా భేదముంటుంది అదికాక చూడు పుష్పములలో మధువు వున్నంతవరకే దాని దరి చేరుతుంది భ్రమరము అటుపిమ్మట?

పూర్ణ—నాన్నగారు! మీరు పొరబడుచున్నారు. చిన్నతనమునుండి ఆనంద్ హృదయము నేను ఎరుగుదును అతడంతటి ద్రోహి కాదు అతనిది నిష్కల్మష హృదయము. నాకు ద్రోహము చేయ సమకట్టడు నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాడు.

జగ్గ—అమ్మా! అతనికి నాయందు ప్రేమ యుండవచ్చును కాని తల్లి దండ్రులు ఇంకొక పిల్లను చేయబోతుంటే కాదని వారిని ఎది

రించగలడా? అతడంతటి సమర్థుడు కాడు. అందుచేతనే వారి యిష్టప్రకారమింకొక కన్యను చేసికున్నాడు

పూర్ణ—ఆతడు, తన ఆత్మను తల్లిదండ్రులకొరకు బలి ఇయ్యాడు. అతడు స్వాతంత్ర్యభావాలు గలిగిన యువకుడు. నా ఆనందు నానుండి వేరుగాను ఎప్పుడు మా యిరువురి ఆత్మలు ఒక్కటే.

జగ్గ—తల్లీ! ఇంకెక్కడి ఆనంద్! అతడింకొక స్త్రీని వరించి సుఖిస్తున్నాడు. నీవింక విచారించేసుకో. నిష్కారణముగా బాధపడి శరీరసౌఖ్యము పాడుచేసికోకు.

పూర్ణ—పాడు శరీరము, ఆనంద్ లేనిదే నాకు సౌఖ్యమెక్కడిది? అతనిని కలుసుకుంటాను. యథార్థము తెలుసుకుంటాను. వివాహము చేసికోవడమే నిజమైతే నా ప్రాణాలు అతనిపాదాల దగ్గరే వదలేస్తాను. అప్పుడు ఆనంద్‌ను కలుసుకుంటాను.

జగ్గ—ఓహో! నీకు పిచ్చి ముదురుతూంది ఇటువంటాడు అప్పుడే రెండుగంటలు దాటింది తల్లీ! నామాట విను. లేనిపోని తలంపులు పెట్టుకొని మనస్సు పాడుచేసికోనక హాయిగా పడుకో నామాట విను. ఊఁ. తే.

పూర్ణ—నేను పడుకుంటాను లెండి. మీరు శ్రమపడకండి. వెళ్ళి పడుకోండి.

జగ్గ—అలాగే తల్లీ! ఏమి దుర్భాగ్యము చేసుకున్నామో! ఏకైకపుత్రికవు. నిన్ను చూసుకొని నేను బ్రతుకుతున్నాను. నన్ను అధోలోకానికి తోసేయడము చూడు అతడు కాకపోతే ఇంక మనకు పెండ్లికొడుకులే, లేరా ఏమిటి! చేయిజారిన తరువాత విచారిస్తే లాభమేమిటి? మరి నే వెళతాను

పూర్ణ—వెళ్ళిరండి.

జగ్గ—జాగ్రత్తగా పడుకో తల్లీ! ఆ! మనస్సు పాడుచేసికోకు.

పూర్ణ—మంచిది మీరు పోయి పడుకోండి.

జగ్గ—అలాగే. (నిష్క్రమించును)

పూర్ణ—వెఱ్ఱితండ్రీ! నా ఆనంద్ లేనిదే నేజీవించుటయా? అతనిని వివాహమాడాలి. లేదా నా ప్రాణాలతనికి సమర్పించాలి. నా ఆనంద్‌ని చేరుకుంటాను. వీధిగీధుల సందుసందుల గాలిస్తాను. నా ప్రేమను వెల్లడిచేస్తాను. ఆనంద్ లేని నాకీ సంసార మెందుకు? నా ఆనంద్‌ని కలుసుకుంటాను. నా హృదయాధి నాథుని కలుసుకుంటాను. ఆనంద్! ఆనంద్! యిదే మంచిసమయం నిన్ను చేరుకుంటాను. (అని ఇటునటుజూచి) నిజానిజాలు తెలిసికుంటాను. ఇదిగో ఆనంద్! చెప్పు! నిజం చెప్పు ఆనంద్! ఆనంద్! ఆనంద్.

(నిష్క్రమించును)

తెరపడును

---

## నాల్గవ రంగము

ప్రదేశము : హాస్టలులో గది

[ప్రవేశము : లీల]

లీల—(పుస్తకముల సర్దుకొని) చాలకాలమయింది పుస్తకము ముట్టుకొని. కాస్సేపు చదువుకుంటే మంచిది (చదువుకొనుచుండును)

(తెరలో లీలా! లీలా!)

లీల—(చదువునాపి) కుమార్.

(తెరలో ఆ! నేనే!)

లీల—Servant maid కి నాకోసము వచ్చేనని చెప్పి లోనికిరా! తలుపు తీసే ఉంది.

(తెరలో ఆ అలాగే)

[కుమార్ : ప్రవేశము]

కుమా—నమస్తే! లీలాదేవి!

లీల—నమస్తే! సుస్వాగతము. కవిసార్వభౌమునికి.

కుమా—భేష్! కుమార్, కవికుమార్! No No కవిసార్వభౌముడు.

లీల—Welcome.

కుమా—యీ Welcome కేమి? ముందు తలుపు లేసిరా! లేకపోతే ఎవరైనావొస్తే చవడ శుద్ధవుతుంది.

లీల—నీకా! నాకా!

కుమా—యిద్దఱకూ.

లీల—యింకా భయమేమిటోయి ఆ కాలము వెళ్ళిపోయిందిగా!

కుమా—కాలం మారిందంటే కర్ర పామై కాటేస్తుందట. ఎందుకైనా మంచిది వేసిరద్దు.

లీల—సరే. (తలుపు వేయుటకు బోవును)

కుమా—(పద్యంవలె చదువును).

ఏమితపం బొనర్చి జనియించినవాడనొ!

నేను లీలా దేవి గృహాంగణమునకున్.

లీల—(ప్రవేశించి నోరునొక్కి) గట్టిగా మాట్లాడకు. ప్రక్కనిఉన్న వాళ్ళు వింటారు.

కుమా—సరే! నెమ్మదిగా మాట్లాడుతానులే. కాని, లీలా! ఎంత నిర్భయంగా కలుసుకొన్నాం. యిదివఱ కెప్పుడైనా యిలా కలుసుకొన్నామా? హాస్టలుగదిలో నే! యిప్పు డెవరైనా చూస్తేనో?

లీల—వెఱ్ఱివాడా! యిది బాలకృష్ణన్‌గారి ప్రభుత్వం. యిప్పుడు మనలను Check చేసేదెవరు? అంతా విచ్చలవిడి. అయినా ఒకవేళ ఎవరైనా వచ్చినా నీవే గోడదాటివచ్చి బలాత్కరిస్తున్నావని అంతా నీమీదకు తోసేస్తాను. నాకేమి?

కుమా—అయ్యబాబోయి! అలాగయితే ముందేపోతాను. బాబోయి.

(పోబోవును)

లీల—(ఆపి) ఆగవోయ్. యింత ధైర్యస్తుడవన్నమాట! నేను నీ మీద తోసేస్తే సరియైన సమాధానం చెప్పలేవు. యిదేనా పురుష లక్షణము.

కుమా—అన్ని లక్షణాలు సలక్షణంగానే ఉన్నాయి. గాని ముందు నన్ను వదలిపెట్టు నేను పోతాను.

లీల—ఓరి! పిరికిపందా! వేళాకోళానికి నీ ధైర్యం పరీక్షిద్దామని అన్నానుగాని నిజంగా అలా చేస్తానా?

కుమా—ఓసి! మూర్ఖురాలా! నీ వేళాకోళము గ్రహించే నేనలాగ అన్నానుగాని నిజంగా పారిపోతానా? ఎదురుగా నిలచి ఘంటాపథంగా వాదించి మరీ సమాధానము చెబుతాను. నాకేమి భయము? నా ధైర్యము నీ కెరుగవు?

లీల—గొప్ప ప్రగల్భాలు పలుకుతావు నా బుర్రా మొఖ్ఖ! అలసిపోయేవు. (ఆసనముపై కూలబడును)

కుమా—సెబాస్! నా ప్రజ్ఞా విశేషములను నేటికి గ్రహించితివి. (కూర్చుండును)

లీల—అదిగో! ఆ భాషే నన్ను మాట్లాడవద్దంటి.

కుమా—స్వర్ణాలకేశ్వరి [illegible] నాకీపోరు తప్పించదు కొద్దో, గొప్ప కవిని గదా! నన్నిలా మాట్లాడుకోనిద్దూ.

లీల—గొప్ప కవిత్వమే. చాలు. నీకో నమస్కారము. విన లేక చస్తున్నాము నీ కవిత్వం. యింకా మళ్ళీ అలా మాట్లాడే వంటే మూతాను.

కుమా—సరే! అయితే యిప్పటికేదో అయిపోయింది. కావలిస్తే క్షమించుకో. పొరపాటే.

లీల—ఆ పొరపాట్లు యింకా పరిపాటే!

కుమా—యిక్కడనుంచి అలా మాట్లాడనని apology యిస్తున్నానుగా

లీల—నాకు apology యివ్వడం కాదు. తొందరపడకు. రోజులు ముందున్నాయి.

కుమా—(గంగారుతో) ఏం కొంపమునిగింది ? సంగతేమిటి ?

లీల—ఏముంది. మనం వ్రాసిన ఉత్తరానికి ఫలితంగా పూర్ణ యిల్లు విడచిపోయిందట.

కుమా—అయితే ఆ head master ముండావాడు వచ్చేడా ? లేదా ?

లీల—మన్ని చంపడానికి సిద్ధంగా ఉన్నాడు. పూర్ణను ఆ ప్రిన్సిపాల్ గారు, మనము కలసి అపహరించి ఉంటామని ఎలాగో తంటాలుపడి జమీందారుగారిని దర్శించి సంగతంతా నివేదించుకున్నాడట,

కుమా—ఏడిసాడు. ఆ జమీందారుగారు వీడిమాట వినవద్దు. మన చేతిలో కీలుబొమ్మ కాదూ. ప్రిన్సిపాలుగారు బాగా పోసీరుగా తైరువాడికే.

లీల—వినవోయి సంగతంతాను. జరిగిన సంగతంతా పూసగ్రుచ్చినట్లు చెప్పినాడుట. కావలిస్తే నా character, ప్రిన్సిపాలుగారి character బుజువు చేస్తానన్నాడుట.

కుమా—కొంపమునిగిందే ? యిదంతా నీకెలా తెల్సింది ?

లీల—జమీందారుగారింటివద్ద బంట్రోతు, హెడ్మాష్టరుగారు, జమీందారుగారు మాట్లాడుకుంటుండగా విని, మన దాసీదానితో చెప్పేడుట. అంతవరకూ ఎందుకు నిన్నరాత్రి హెడ్మాష్టరుగారు, జమీందారుగారుకలసి హాస్టలు checking కి వచ్చేరు. నేను అదృష్టవశాత్తు ఎక్కడికీ వెళ్ళకుండా నిన్న roomలోనే ఉండబట్టి గండం గడచింది.

కుమా—కాలం సమీపించినదన్నమాటే అయితే యిక చల్లబడితే మంచిది.

లీల—Principal గారినికూడా watch చేస్తున్నారుట.

కుమా—సరిగాని Principal గారిని తిరిగి దర్శించేవా ?

లీల—లేదు. అనేకలక్షలసార్లు కబుర్లమీదకబుర్లు పంపుతున్నారు

కుమా—యింకెన్ని ఏడుస్తేనేమి? మనపని జరిగిందికదా. మంచి టోకరా యిచ్చేవు ముండావాడికి.

లీల—హాయిగా Enjoy చేయక యిప్పుడవన్నీ యెందుకు?

కుమా—Yes. Come on. kiss........(ముద్దిడుచుండును)

(తెరలో లీలా! లీలా!)

కుమా—(ఉలికిపడి) అయ్యబాబోయి! కొంప మునిగిపోయింది. ఎవరోవచ్చేరు చూడు.

లీల—ఎవరూ లేదు ఊరుకుండూ.

(మరల తెరలో లీలా! లీలా!)

కుమా—ఏమీ లేదంటావేమిటి? అదిగో! నీవు జమీందారుగారి గొంతుకలాగ ఉంది. అయ్యబాబోయి! యిప్పుడేదిదారిరా బాబు, (కంగారుపడుచుండును).

(మరల తెరలో లీలా! లీలా!)

లీల—ఎవరో అమ్మాయిలాగుంది. ఎందుకైనా మంచిది. నువ్వీ దొడ్డిదారిని వెళ్ళిపో. ఊఁ; లే.

(మరల తెరలో లీలా! లీలా!)

లీల—(గట్టిగా) వొస్తున్నా. (కుమార్‌తో) ఊఁ! లే,

కుమా—పగవాడికన్నా వొద్దురా బాబీయవస్థ. అన్నిదారులు కట్టుబడితే దొడ్డిదారి. ఆదారి లేకపోతే గోదారి శరణ్యం. యీ మూలనుండి సంగతంతా కనిపెడతా! (అని సైడుకు వచ్చి నిలచియుండును).

లీల—(తలుపు తీయుటకు లోనికిబోయి తిరిగి ప్రవేశించుచు) ఓహో! Principal గారా! దయచేయండి. యిలాకూర్చోండి.

(బాలకృష్ణన్ ప్రవేశించి)

బాల—ఆమ. రొంబ Thanks. (కూర్చుండును).

కుమా—ఆరిపిస్తున్నా. నీవ్వటరా? పానకంలో పుడకలాగ నీయబ్బసొమ్ము పోయినట్లు రోజుకుంటూ వచ్చేవేం? సరే! యిప్పుడో మహా నాటకం జరుగుతుంది కాబోలు!

లీల—మొద్దుసీనుగను నిద్రలో మీ పిలుపు వినిపించుకో లేదు. తలుపు దగ్గఱ నిలబెట్టేసేను, క్షమించాలి.

బాల—ఆ! Never mind. Never mind.

లీల—నా మూలాన్ని చాలా శ్రమతీసికొన్నారు. నేనే వద్దామను కుంటున్నాను మీవద్దకు. అనవసరంగా శ్రమయిచ్చేను.

బాల—అది ఎంతమాట! ఏదీ! మఱచిపోయావేమో అని నేనే వొస్తిని. నీ నిద్రకు నిండా ఆటంకం యిస్తినా?

లీల—అబ్బే! దానికేమిలెండి. మిమ్మల్ని మఱచిపోతానా? ఎప్పటి కప్పుడే వద్దామనుకుంటున్నాను. యీమధ్యను ఒంట్లో ఏమీ బాగుండడము లేదు. కొంచెము కులాసాగా ఉన్నా వద్దామని ఊరకున్నాను.

బాల—O! My God! ఒంట్లో బాగులేదా! నాకీసంగతి తెలిస్తే Doctor ని arrange చేసిఉందునే?

కుమా—అబ్బ! ఎంత అభిమానం. అవునుమఱి, లంచాలుదొబ్బిన డబ్బు ఎలా ఖర్చవుతుంది?

లీల—మీవద్దనుండి నాకు కబుర్లు తీసికొచ్చిన వాళ్ళని మీకీ సంగతి తెలియబర్చమన్నాను. తెలివితక్కువ పీనుగలు, మఱచి పోయేరు కాబోలు.

బాల—సరిదా! తలుపు గడియవేస్తివా?

లీల—అబ్బే! ఎందుకండి మీరుండగా ఎవరొస్తారు? ఎలాగా మీరు వెళ్ళినతరువాత తలుపేసి పడుకోవచ్చును. అస్తమానువేయడం తీయడం ఎందుకు?

కుమా—గ్రంథంజరిపితేనేగాని కదలడీ గాడిద.

బాల—దానికేమిగాని లీల! యిందాక యిక్కడ గుసగుసలు దా వింటినే.

లీల—అబ్బే! అదేమీ కాదు. ఎలకల చప్పుడేమో!

బాల—ఆహా! అడ్డడ్డ. లీలా! నీవుదా నిలబడితివా? రొంబకష్టమే యిక్కడకు రావ్వో! రా!

(అని తాను కూర్చున్న సోఫాపై కూర్చుండమని చూపును)

లీల—అలాగే లెండి. (కూర్చుండును)

బాల—(కొంచెము దగ్గరగా చేరును లీల కొంచెం దూరముగా జరుగును)

కుమా—ఓహో! వాడు మునుపటిగానే మన చేతులకి పని చెప్పేలా గున్నాడు

[అంత మరియొకప్రక్క జమీందారు, హెడ్మాష్టరు జగ్గన్నగార్లు ప్రవేశించి ప్రిన్సిపాలుగారిని చూచి వెనుకకు తగ్గి ఒకసైడుకి పోయియుందురు]

బాల—లీలా! నీవుదా వింటివా? యీ సంగతి ఆ హెడ్మాష్టరు కూతురు ఎవడితోనో లేచిపోయిందట అది నేనుదా చేయిస్తి ననకొని రొంబ కష్టపడి, జమీందారుగారితో సంగతంతా చెప్పినాడట. దానివలన నాకుదా జమీందారుకి కొంచెందా Splits వస్తున్నవి నన్ను Watch చేస్తున్నాడా జమీందారు.

లీల—మేష్టారు! నాకీసంగతి తెలుసు పూర్ణ ఎవరితోనూ లేచిపోలేదు దానికంతకీ కారణము నేనే. పూర్ణానందులను వేఱు చేస్తే హెడ్మాష్టరుగారు దెబ్బతింటారన్న ఉద్దేశ్యంతో పూర్ణ చనిపోయినట్లు ఆనందుకు, ఆనందు యింకొక కన్యను వివాహం చేసుకున్నట్లు పూర్ణకు ఉత్తరాలు అందచేసాను అందుచే ఆ బెంగతో పూర్ణ ప్రాణత్యాగానికి ఇల్లు విడచి పోయింది

జగ్గ—(ఉలికిపడి) ఎంతఘోరం

పట్టా—ఖంగారు పడకండి

బాల—ఆను మంచిపని చేస్తివి. లీలా! యిటు చూడు. నీకుదా మార్కులు వేస్తినిగదా! నీవూలందా ఆజగ్గన్నను Dismiss చేయిస్తిని. మరి ఏదీ బహుమతి.

లీల—దానికేమి లెండి. కొంచెం ఒంట్లో కులాసాగా ఉన్నాక మిమ్మల్ని ఆనందింప చేస్తానుగా తొందర ఎందుకు?

బాల—నీవుదా చాలకాలమునుండి యిలా గడిపితివి అడ్డడ్డ యింక లాభంలేదు ఏదీ ఒక్కసారి enough ఏదీ ముద్దు.

(ప్రిన్సిపాలు దగ్గఱగా చేరుచుండగా, లీల దూరముగా జరుగుచుండును)

లీల—మేష్టారు! యివాళకు పోనియ్యండి. పోనీ రేపలాగే చేద్దాములెండి.

బాల—అది ఏమిరా? అబ్బబ్బ! లీలా! యివాళ నిన్నుదా తప్పక అనుభవించాలి ఏదీ! ఒక్కసారి only one kiss come on (అని చేయి పట్టుకొనబోవును)

లీల—(విడిపించుకొని) అబ్బ! ఉండండి చెప్తుంటే మీకు కాదూ!

బాల—అది ఏమిదా లాభంలేదు ఏదీ only once (అని నిర్బంధించుచుండును)

కుమా—ఆ! ఆ! ఎంతఘోరం (అని రాబోవును)

పట్టా—అనుభవిద్దురుగాని కొంచెం ఆగండి. అయ్యా! బాలకృష్ణన్ గారూ!

(ప్రిన్సిపలు లీలనువిడి, నిశ్చేష్టుడై నిలువబడును. లీలకంగారుపడుచుండును. కుమార్ జమీందారుని జూచి కంగారుపడి ప్రక్కకు తప్పుకొనును)

లీల—అయ్యా! చూడండీ! ప్రిన్సిపాలుగారు ఏమి చేస్తున్నారో!

పట్టా—నంగనాచీ! యింక నాదగ్గఱ యీటక్కులు కుదరవు. కట్టిపెట్టు ప్రిన్సిపాలుగారు చేసింది, నీవు చేసింది వీనులారా

విన్నాము. చేయబోతూన్నది కళ్ళారా చూచేము యింకెందుకు బొంకుతావు?

జగ్గ—అయ్యా! నిజము బయటపడినదా? దీనికోసమే మిమ్మల్ని నాతో త్రిప్పుకొని మీకు నకనకగుండగా శ్రమ యివ్వవలసివచ్చింది.

పట్టా—(ప్రిన్సిపాలును జూచి) మహాశయా! మీరింతటి ప్రతిభావంతులని తలంచ లేదు. విద్యార్థినులు! ఎందుకయ్యా నీ చదువు తగులబెట్టనా? నీకెందుకేనా ప్రతివాళ్ళూ వందలకొలదీ జీతాలిస్తూంట? జాతిమతవైషమ్యాలను పోషించి, లంచగొండివై, జారుడవై, సంస్థనంతటిని పాడుచేసి అందుకు ఆటంకము వచ్చిన వారిమీద చాడీలు చెప్పి పోని కల్పించుటకేనా నిన్నిక్కడ నియమించుట? పెద్ద డిగ్రీ ఉండగానే సరా? ప్రిన్సిపాలట! నీవంటి ప్రిన్సిపాలులు ఉండే యిలా సంస్థలను పాడుచేసే బదులు ఏగంగలోనైనా పడితే మంచిది. మర్యాదస్థులు మిమ్మల్ని యింకేమన్నా ప్రయోజనం లేదు దయచేయండి. మర్యాదగా యీక్షణం మొదలుకొని తిరిగి యీ కాలేజీ ground లో దర్శన మీయకండి. వెళ్ళిరండి. నీవంటివాడిని నమ్మి యీసంస్థలో తావియడం నాదే తప్పు.

(ప్రిన్సిపాలు పిచ్చెత్తినట్లు నటించుచుండును)

పట్టా—కదలవేమి! get out; quick. get out.

(ప్రిన్సిపాలు విచారము సూచించుచు పిచ్చివానివలె నిష్క్రమించును)

పట్టా—(లీలను జూచి) ఎంత అవినీతిప్రవర్తన అమ్మాయి! నీకా మాత్రం జ్ఞానం లేదా? తల్లిదండ్రులను వదలి చదువుకని వచ్చి నీవు చేయవలసిన పని యిదా? సరిగా చదువుకోక పరపురుషులతో విచ్చలవిడిగా సుఖిస్తూ, పరీక్ష ఫెయిలై, మార్కులు హెడ్మాష్టరుగారు వేయలేదని ఆయన్ని సర్వనాశనం చేయడానికి బూనుకున్నావా! విద్యార్థినికీ ప్రవర్తన తగునా

నీవంటివాళ్ళిలాగ hostel లో ఉంటే మాసంస్థ కంతటికీ అపఖ్యాతి. చాలు నీకీ చదువు చాలు. నీవు యింక ఎచ్చట చదవకుండా debar చేస్తున్నాను తెల్లవారడంతోనే నీవీ hostel వదలి వెళ్ళిపోవాలి. తెలిసిందా! లేకపోతే మర్యాద దక్కదు.

(లీల కంగారు పడుచుండును)

జగ్గ—అయ్యా! తొందర పడకండి. ఆపిల్లజీవితము పాడుచేయవద్దు.

పట్టా—ఎంత దయార్ద్రహృదయము మీదివారా! అయ్యా! నేను చెప్పుడు మాటలు విని, న్యాయాన్యాయ విచారణలేక మిమ్మల్ని తొలగించాను నేటికి ఆభగవంతుని దయవలన నిజము తెలిసికొన్నాను. క్షమించండి మళ్ళీ మిమ్మల్ని head-master గా appoint చేస్తున్నాను. సంస్థని తిరిగి అభివృద్ధిలోనికి తీసికొని వచ్చే పూచీ మీదే. ధనమదాంధతచే యుక్తాయుక్తవిచక్షణ లేక పరిపాలించే యీగుడ్డి జమీందారుకి మంచినీతి పాఠము నేర్పేరు.

జగ్గ—అయ్యా! యిదంతా ఆ భగవంతుని చిద్విలాసం; ముందు నా ఉద్యోగంకన్న నా కూతురు జాడ తెలిసికోవడం ముఖ్యం అందుచేత ఆమెను కలిసికున్న తర్వాత మీకోర్కె ప్రకారం తిరిగి ఉద్యోగంలో ప్రవేశిస్తాను.

పట్టా—అలాగే! నడవండి నేను మిమ్మల్ని అనుసరిస్తాను మీ అమ్మాయిని వెదకడానికి. తర్వాతసంగతి చూచుకుందాము.

జగ్గ—అయ్యా! మీకెందుకు శ్రమ? వద్దు. నేను వెదతాను.

పట్టా—నామాటను తోసివేయకండి నడవండి యిద్దరమూ కలసి గాలిద్దాము ప్రపంచమంతటా!

జగ్గ—సరే మీచిత్తము

పట్టా—అమ్మాయి తెలిసిందా? నేను చెప్పింది అలాగ చేయకపోతివా నీమర్యాద దక్కదు జాగ్రత్త అయ్యా నడవండి

(నిష్క్రమింతురు)

లీల——ఆహా! ఎంత విపరీతసంఘటన !

కుమా—(ప్రవేశించి) అమ్మయ్యా! చావుతప్పి కన్ను లొట్టపోయిన ట్లయింది నేనుకూడా యిక్కడనే ఉంటే నా రోజులు కూడా మూడిపోయేవే ?

లీల—కుమార్! సంగతంతా చూసేవుగా ! యిప్పుడేది దారి ?

కుమా—గోదారి అమ్మా! లీలాదేవిగారూ! చాలు మీదారి మీరు చూచుకోండి యింక నేను నిష్క్రమిస్తాను మీకుమీప్రేమకు ఒక నమస్కారము శలవు.

లీల—(ఆశ్చర్యంముతో) కుమార్! నన్నిప్పు డనాథనుచేసి విడచి పోతావా? యింతటి దేనా? నీప్రేమ ?

కుమా—యింతకాక యింకెంత? నీకింట్టిదానవని తెలిసుంటే మొదటే ప్రేమించకుండా ఉండేవాడిని చాలుబాబుచాలు బ్రతికుంటే బలుసాకైనా తినవచ్చు శలవు

లీల—నన్నీస్థితిలో విడచిపోవడం నీకు తగునా? మనప్రేమ పాటింపవా? నాబ్రతుకు సార్థకము చేయవా ?

కుమా—నీవేమిచెప్పినా ప్రయోజనంలేదు అయ్యబాబోయి యీ సంగతి మాతల్లిదండ్రులకు తెలిస్తే బ్రతుకనిస్తారా? కొంప మునిగిపోదూ ?

లీల—అయితే నా జీవితమింతేనా? నీతల్లిదండ్రుల నెదిరించలేవా ?

కుమా—ఎదిరించి తినేదేమిటి? యింకేమీలాభంలేదు ఏదోపూర్తిగా పాడయిపోకుండా నీ దయవలన ఆ selection పరీక్షలలో మార్కులు వేయించావు యింకముందు ప్రమాదమేమీ రాకుండా ఆజమీందారుగారి దగ్గరకు మా father ని పంపించి కాళ్ళు, చేతులు పట్టుకోమంటాను హాయిగా చదువు కుంటాను నా కెందుకీ గోల? శలవు.

లీల—అంతేనా ?

కుమా—అంతే మరి శలవు Good bye (పోబోవును)

లీల – కుమార్ నన్నాదరింపవా ?

కుమా—ఏలినాటి శనిలాగ వదలదలచుకొనలేదా ? యింకేమిలాభం లేదు నన్నింతటితో వదలెయ్యి good bye (విదలించుకొని ముందునకువచ్చి) వెనకాముందూ ఆలోచించకుండా ప్రేమిస్తే వచ్చేఫలితమేయిది బుద్ధివచ్చింది.

(నిష్క్రమించును)

లీల—(విచారముతో) ఆహా. పరమేశ్వరా ! నాజీవితమెంత నిరర్థకమైనదిగా చేసితివి నేనిప్పుడు తల్లిదండ్రుల ముఖమేవిధి చూతును ? తెల్లవారితే నలుగురిలో మొగమెత్తుకొని తిరుగుడెలాగ ? అన్నివిధములు భ్రష్టురాలనైతిని నా దుష్ట చైదములకు తగినప్రాయశ్చిత్తమైనది ఆహా ! పురుషజాతిని కలనైన నమ్మకూడదు ఆ మోసగాని కల్లబొల్లి ప్రేమను నమ్మి భ్రష్టురాలనైతిని హృదయపూర్వకముగా ప్రేమించిన నా హృదయారాధకుడు నన్ను విడిపోయెనుగదా ! యిక నాకే సౌఖ్యమును వలదు అవివాహితనై, సంఘసేవ చేయుచు ఆదర్శప్రాయమైన జీవనము గడపెదగాక ! రంగా ! యిక నీవే శరణ్యము.

(నిష్క్రమించును)

(తెర పడును)

—— ——

# డాక్టరు

## పంచమాంకము

### మొదటి రంగము

ప్రదేశము : గృహాంతర్భాగము

[ ప్రవేశము : రాజ్యం ఆనంద్ ]

ఆనం—రాజ్యం! నన్ను Disturb చేయకు ఏదీ ఆ పుస్తకముయిలా యిచ్చెయ్యి.

రాజ్యం—నేనివ్వను ఏం చేస్తావు?

ఆనం—మర్యాదగా అడుగుచున్నాను యిచ్చెయ్యి.

రాజ్యం—నేను మర్యాదగా చెబుతున్నాను, యివ్వనని.

ఆనం—ఆహా! అలాగా (అని రాజ్యం చేతిలోని పుస్తకమును బలవంతముగా లాగికొని సోఫాపై కూర్చుండి చదువుకొనుచుండును)

రాజ్యం—పాపం. అంతశ్రద్ధగా చదువుకొనేవాళ్ళను పాడుచేయడమెందుకు? నేను వెళ్ళిపోతాలే. (పోవుచుండును)

ఆనం—(చూచి) రాజ్యం! రాజ్యం! యిటురా.

రాజ్యం—నేను రాను. (పోబోవ)

ఆనం—(ఆపి) Book తీసుకొన్నానని కోపమొచ్చిందా?

రాజ్యం—నాకు కోపంవస్తే నీకేమి? నన్ను వొదిలెయ్యి. వెళ్ళిపోతాను. (విడలించుకొని పోబోవును)

ఆనం—ఓహో! ప్రణయకోపమా? యీ రోగానికి నాకుమందు తెల్సును, ఉండు. (ముద్దిడును)

రాజ్యం—మంచిమందే. (అని నవ్వును)

ఆనం—మంచిమందు గాదేమి? నేనుపయోగించిన మందువలన టక్కున ఆరోగ్యం కుదిరిందా? లేదా?

రాజ్యం—డాక్టరుగారు యిటువంటి రోగాలను కుదర్చడములో Specialist అనుకుంటాను ఏమాత్రం experience ఉందండి. డాక్టరుగారూ?

ఆనం—యిదివరకేమీ experience లేకపోయినా యిప్పుడు సంపాదిస్తున్నాను.

రాజ్యం—మామంచి డాక్టరువే!

ఆనం—రా! యిటురా! కూర్చుందాము. (కూర్చుండచేయును)

రాజ్యం—పాపం నీ చదువుకు భంగమేమో!

ఆనం—ఏనాడు నిన్ను వివాహం చేసుకుంటానని Promise చేసేనో ఆనాడే భంగమయింది నా చదువు.

రాజ్యం—ఆనంద్! అస్తమానం ఏదోపుస్తకము చదువుకుంటూ ప్రపంచంలో సంబంధం లేకుండావుంటే ఏమిప్రయోజనం? లోకజ్ఞానము సంపాదించవద్దా! ఆనందంగా కాలము గడిపేదెప్పుడు?

ఆనం—పుస్తకాలు చదువుకుంటూ ఉంటే మటుకు ఆనందం ఉండదా? ఎటువంటి చక్కని భావాలు తెల్లడవుతాయి? ఎంతజ్ఞానము సంపాదించవచ్చు. నిజంగా యీ విద్య ఎంత ఉపయోగకర మైనదో తెల్సునా? విద్యయే అజ్ఞానాంధకారమును తొలగించెడి అద్భుతజ్యోతి.

రాజ్యం—నేను కాదనను. గాని యీ Books వల్ల సంపాదించే Knowledge కన్న ప్రకృతిని study చేస్తే మంచి Know-ledge సంపాదించవచ్చునని నా అభిప్రాయము. యీ ప్రకృతి

అంతా ఒక పుస్తకంకాదూ. యీ పుస్తకాన్ని Careful గా study చేస్తే ఎంత జ్ఞానసంపన్నులు కావచ్చును !

ఆనం—ప్రకృతిపుస్తకములోని విషయములను త్వరగా Grasp చేయ లేము. కాని అనుభవజ్ఞులగు మహాకవులు వ్రాసిన యీ గ్రంథములను చదివితే మనకు సర్వము సులభంగా విశద మౌతుంది. అందుచేత వీలైనంతవఱకూ చదువుతూఉండాలి.

రాజ్యం—చదువు చదువంటావు. యీ చదువువలన ప్రయోజన మేమిటి ? యిలాగ పెద్ద పెద్ద చదువులు చదివినవా రందరు చేస్తున్న ఘనకార్య మేమిటి ? చివఱకు కాఫీహోటలులో చిప్పలు కడుక్కోటానికి ఉపయోగిస్తుం దీవిద్య. ఏమిటీ విద్యవలన ఉపయోగం ?

ఆనం—ఎంతపొరబడుచున్నావు రాజ్యం ! విద్యవలన ప్రయోజన మేమిటా ? చూడు.

సీ. జ్ఞానముకలిగించు ♦ సర్వసంపదలిచ్చు
విశ్వమందింక నీ ♦ విద్యకాదె ?
దొంగలకును కూడ ♦ దొరకకుండు ధనము
విశ్వమందింక నీ ♦ విద్యకాదె ?
సంఘగౌరవమిచ్చు ♦ శాశ్వతసుఖమిచ్చు
విశ్వమందింక నీ ♦ విద్యకాదె ?
వినయవంతునిచేయు ♦ విమలచరితుఁజేయు
విశ్వమందింక నీ విద్యకాదె ?

గీ. విద్యయేగద జనులకు ♦ వేడ్కనిచ్చు
విద్యగలవాడె చక్కగ ♦ వినుతికెక్కు
విద్యనేర్చిన వ్యక్తియే ♦ విబుధుడగును
విద్యనేర్వనివా డిల ♦ వింతపశువె !

రాజ్యం—నిజమే. విద్య అంత ప్రయోజనమైనది గావచ్చును. గాని, యీ ఇంగ్లీషువిద్యమాత్రం కాదు. చక్కగా ఏ భారతభాగవ

తాదులో, ఏ రామాయణ గ్రంథమో, చదువుకుంటూ,
ఏ వేదాధ్యయనమో చేస్తే ఆ విద్య చాలా ఉపయోగిస్తుంది.

ఆనం—అలాఅనకు ఏ విద్యకుండవలసిన importance ఆ విద్యకుంది.
అందుచేత అన్నివిద్యలలోనూ ప్రపూర్ణుడయితే చాలమంచిది.

రాజ్యం—సరే, అయితే అన్నిశాస్త్రాలు చదువు ముందీశాస్త్రం
నేర్చుకో. (అని ముద్దిడుచుండును)

[ ప్రవేశం : సీతాపతిరావు ]

సీతా—అమ్మాయీ! ఏమిచేస్తున్నావు?

రాజ్యం—ఆనందుతో మాట్లాడుచున్నాను. రండి నాన్నగారూ!
యిలాకూర్చోండి.

సీతా—మంచిది. (కూర్చుండి) నాయనా! ఆనంద్! యిటురా!
కూర్చో. నీతో కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలి.

ఆనం—అలాగే. (కూర్చుండును. రాజ్యంతండ్రివద్ద నిలిచియుండును)

సీతా—నాయనా! మీరు ఇరువురూ అన్యోన్యంగా అతి గాఢంగా
ప్రేమించుకుంటూన్నట్లు నేను గ్రహించేను. అమ్మాయిని
వివాహం చేసుకోమంటే నిన్నుతప్ప యింకొకడిని చేసుకో
నంది. అందుచేత ఆమెను వివాహం చేసుకోవడానికి నీకే
మైనా అభ్యంతరముందా?

ఆనం—నాకేమీ అభ్యంతరము లేదు రాజ్యాన్ని తప్పక వివాహం
చేసికుంటాను.

సీతా—సరే. చూడునాయనా! మన కిదివరకే బంధుత్వముంది.
నీ ఆస్తిపాస్తులతో నాకేమీ సంబంధంలేదు. నాకు కావలసి
నది మీరిద్దరూసుఖంగా కాలక్షేపం చేయడమే! తెలిసిందా!
నాపిల్ల సౌఖ్యానికిమాత్రం నీవేమీ భంగం చేయకూడదు.

ఆనం—మామగారూ! నేను రాజ్యం సౌఖ్యానికేమీ భంగంచేయను.
తప్పక వివాహం చేసుకొని, ఆమెను సుఖపెడతానని దేవుని
సాక్షిగా మీ ఎదుట ప్రమాణము చేస్తున్నాను.

సీతా—చాలు ఏమమ్మా! నీకేమీ అభ్యంతరము లేదుకదా!

రాజ్యం—(మౌనము సూచించును)

సీతా—అయితే మీ యిద్దరిని తప్పక దంపతులను చేస్తాను. యింకో వారంరోజులలో ముహూర్తము నిశ్చయించేను. యిదివరకే ఆనందు తండ్రితో సంప్రదించేను ఆయన ఏమీ అడ్డుచెప్ప లేదు. చిట్టితల్లీ! నీకోర్కె నెరవేఱుతుందిలే.

[జనార్దనం ప్రవేశించి]

జనా—May I step in?

సీతా—Yes! Come along. what is the matter?

జనా—ఎవరో ఒక అమ్మాయి, పిచ్చిదిలా ఉంది. ఆనంద్‌కోసము వెతుక్కుంటూవచ్చి ఆనంద్‌ను చూపించమంటూంది.

ఆనం—నా కోసమా? ఎవరది?

సీతా—లోపలికి రమ్మను.

జనా—అలాగే! (తెరవంక జూచి) యిలా రావమ్మా! లోపలికిరా!

(పూర్ణ పిచ్చదానివలె ప్రవేశించి)

పూర్ణ—నా ఆనందుకు వివాహమౌతూం? చెప్పు. ఆనంద్! నన్ను విడ చేవా? ఆనంద్! నా ఆనందును చూపించండి. అడుగో! ఆనంద్! పెళ్ళిచేసుకున్నావా? ఆనంద్!

ఆనం—(ఆశ్చర్యంతో) పూర్ణా!

పూర్ణ—ఆనంద్! (అని పడిపోవును)

(ఆనందు దగ్గఱగా కూర్చుని యుండును)

సీతా—ఎవరీమె?

రాజ్యం—ఏమిటి! హెడ్మాస్టరుగారి కూతురు పూర్ణా! యీ విచిత్ర మేమిటి?

పూర్ణ—(మెల్లగా) ఆనంద్! అబ్బా! దాహం. దాహం.

సీతా—పాపం యీపిల్ల చాలా అలసినట్లున్నది. ఒంట్లో స్థిమితం లేదు. రండి లోనికి తీసికొనిపోయి ఉపచారాలు చేద్దాము.

(పూర్ణను ఎత్తుచుందురు)

(తెర పడును)

## రెండవ రంగము

ప్రదేశము : వ్రాలియున్న తెరముంగిట

[ప్రవేశము : బాలకృష్ణన్]

బాల—అడ్డడ్డ! ఎంతపని జరిగింది? I never expected this! యిప్పుడా ఏమిచేయుదును? నాకుదా నిండా అవమానము జరిగింది యిప్పుడా నలుగురిలో ఎటతిరిగేది అడ్డడ్డ (అని కొంచెమాలోచించి) యిది ఎల్లా నాన్ దా cast feeling చూడబట్టి కదా! నాన్ దా ఎంతదుర్మార్గుణ్ణి Though I am an educated gentleman I behaved like a brute. అంతా దొంగమాదిరి పనిచేస్తిని. నామూలంగాదా హెడ్మాష్టరు పనిపోయింది. ఆతనుదా నిండా మంచివాడు. Self interest చే అతగాడిమీద నా జమీందారుకి చాడీలు చెప్తిని. O! my God! అవి ఎల్లాం తెలుసుకుంటే నాకుదా గుండె పగులుచున్నది. అడ్డడ్డ! ఎంతపని చేస్తిని? లంచంపుచ్చుకుంటిని. రొంబ చెడ్డ పని చేస్తిని. యిది ఎల్లారుం నన్నుదా ఎంతతిట్టుచున్నారోగదా! రామచంద్రా! నాకుదా మార్గమేది? What to do? యింక యిక్కడాఉంటే అందర్నీ ఎలాగ చూస్తాను (అటు యిటు తిరిగి) Love is blind? Really Love is blind! ఆ లీలమీద ఉండే love కి కదా యింత చేస్తిని. నామూలందా కాలేజీకి ఎంత bad name వచ్చింది. Not only to college దేశానికంతకీ bad name తెచ్చితిని. దానికిదా ఫలం అనుభవిస్తిని. రామచంద్రా! యిప్పుడా నాకేది దారి? ఎంగపోతాను? అడ్డడ్డ! ఏమి చేయుదును?

(విచారించుచుండును)

[పట్టాభిరామయ్య జగ్గన్న ప్రవేశింతురు]

జగ్గ—అయ్యా! నావలన అనవసరమైన శ్రమ తీసికుంటున్నారు.

పట్టా—(అపవారించి) దానికేమిలెండి. చూడండీ! అయన ప్రిన్సి
పాల్‌గారు కాబోలునే!

జగ్గ—(విదానించి) చిత్తము. ఆయనే.

పట్టా—(ముందుకు నడచి ప్రిన్సిపాలును సమీపించి) ఓహో! ప్రిన్సి
పాలుగారు ఇంకా ఊళ్ళో ఉన్నారా!

బాల—(విచారవదనముతో) Sir, నేనుదా నిండా మోసగాణ్ణి: మీ
ముఖము చూచుటకు నాకుదా చాలా సిగ్గుగా నున్నది. బుద్ధి
వచ్చింది Sir. బుద్ధివచ్చింది. మీకుదా నిండా అపకారము
చేసిస్తిని. క్షమించండి.

పట్టా—మీరు నాకేమీ అపకారం చేయలేదు. సరస్వతమ్మ తల్లికి
కేంద్రస్థానమై, పవిత్రమైనటువంటి మహాసంస్థకు అమాయకు
డగు యీ హెడ్మాష్టరుగారికి అపకారం చేశారు. యీనాటి
కైనా తప్పు గ్రహించుకున్నారు. సంతోషమే.

బాల—(హెడ్మాష్టరును సమీపించి) అయ్యా! నేనుద మీకు రొంబ
కష్టం తెచ్చి పెడితిని. అధికారగర్వముచే క్రిందుమీదు గానక
లంచగొండినై, జారుడనై, మతద్వేషినై మీకుద నిండా
ఆపద తెచ్చి పెడితిని. నన్నుద క్షమించండి. Sir!

జగ్గ—అయ్యా! మీరు పొరబడుచున్నారు నాకేమీ మీరపకారం
చేయలేదు. వైరివీరులను చీల్చి చెండాడి, శత్రుభయంకరులై,
అన్యదేశస్థులను సైతము హడలగొట్టి, మహాసామ్రాజ్యము
స్థాపించి భారతీయ విజయపతాకము నాటిన మహాప్రభువులను
కనిన భూమి మన భరతభూమి. విద్యల కగ్రస్థానము వహించిన
భూమి మన భరతభూమి. మహాపతివ్రతామతల్లులను గన్న
భూమి మన భరతభూమి. సర్వసంపదలకు నిధియని పేరొందిన
భూమి మన భరతభూమి. అట్టి పవిత్రమైన మాతృభూమికే

తీరని కళంకము కల్గించేరు. యిలాగ మనలో మనము జాతిమత వైషమ్యాల నుంచుకొని దుష్టులమై ప్రవర్తించినచో మన భారతజనని దాస్యశృంఖలము లెప్పుడువిడును. మనము భారతీయులము గాదా? మన పూర్వీకుల ఉడుకురక్తము మన ప్రతీ నాళములలోనూ ప్రవహించుట లేదా? భారతీయుల పౌరుషము అణగిపోయినదా? భారతీయుల ఖ్యాతి బూడిదలో పోసిన పన్నీరయినదా? చూడండి. అసహాయులనుగు మనలను జూచి పూత చరిత, ఆహా! మన భరతమాత కంటి వెంట రక్తబిందువు లెట్లు రాల్చుచున్నదో! భారతీయులమై జన్మించినందులకు మాతృసేవ చేయవలదా? ఆమెను సంతోష పెట్టవలదా? ఆమె కంటినీరు తుడిచివేయుటకు మన మందఱము నడుము కట్టాలి! అందుకు ముందు ఐకమత్యత కావాలి. అందుచే మన మందఱము సుహృద్భావముతో, సోదరభావముతో మన శాయశక్తులా పనిచేయాలి. అణగియున్న భారతీయుల పౌరుషాన్ని చూపించాలి. ఢంకామీద దేశదేశముల భారతీయుల విక్రమాన్ని చాటాలి.

పట్టా—చక్కగా చెప్పేరు హెడ్మాష్టరుగారు. విద్యాధికులమైనందుకు మనము మన బాధ్యతను గుర్తించుకొని సన్మార్గులమై విద్యాహీనులను సరియైన త్రోవలో పెట్టాలిగాని, మనమే పశుప్రాయులమైతే దేశానికెంత అపయశము?

బాల—Sir! మీరు చెప్పింది నిజం. అంతా గ్రహించేను. బుద్ధి వచ్చింది. యికముందుగా సంఘసేవ చేయుచు, ప్రశాంతమైన జీవితము గడుపుతాను. మావూరు కుంభకోణం పోయుందును. శలవు. దయమాత్రం ఉంచండి. I will dedicate my life for our mother land అన్నిచోట్ల lectures యిస్తూ యిటువంటి దోషాలను బాపుతాను.

పట్టా—అది చాలా మంచిపని. మీరు సరిగా ఉంటే తిరిగి మిమ్మల్ని appoint చేస్తాను.

బాల—అయ్యా! క్షమించండి నాకు నా ఉద్యోగం వొద్దు యింక కాలేజీలో ఏకొలుగంతో ఉద్యోగం చేద్దును వొద్దు కుంభకోణము పోయి సంఘసేవ చేయుచూ, ఉన్నదానితో ప్రశాంతమైన జీవనము గడుపుతాను

జగ్గ—సరే! ఒక సంతోషవార్త చెప్పడం మరచిపోయాను నా పూర్ణ ఎక్కడకూ పోలేదు ఆనందువద్దనే ఉన్నదట ఇదిగో wire వచ్చింది అక్కడనుంచి మేమిప్పుడు అక్కడకు పోతున్నాము ఆ అపవాదు మీమీద వేసినందుకు క్షమించండి.

బాల-నిండా సంతోషం ఎప్పుడు మంచివారియందు God ఉన్నాడు అను నాకిది నిండా సంతోషంగా ఉంది తప్పక పూర్ణానందులకు marriage చేయుడు.

పట్టా—train దాటిపోతుందేమో, పదండి మరి.

జగ్గ—అయ్యా! తెలుపు యిదే ఒకసారి ఏదో మీవద్ద పనిచేశాను అనేక తప్పులుండవచ్చును అవన్ని క్షమించాలి.

బాల—అడ్డెడ్డా! ఎన్నటికాలు చెప్పినా నా తప్పులుంద మీరు క్షమించాలి (అని చేతులు పట్టుకొనును)

పట్టా—అందరికీ ఆ భగవంతుడే క్షమిస్తాడు లెండి కాని ప్రిన్సిపాలు గారూ! మీరు సంఘకోణం వెళ్ళినతర్వాత ఉత్తరాలు వ్రాయుస్తూ ఉండాలి.

బాల—అను యింతటినుండి ఆంధ్రులు, అరవలు అన్న feeling లేకుండా అందరమూ ఐకమత్యంతో ఉండాలి.

Trust no future, howe'er pleasant!
Let the dead past bury its dead?
Act—act in living present!
Heart within and God o'er head

అని, ఆంగ్లకవి Long Fellow వ్రాసిన వాక్యములను ద అనుసరించి ప్రవర్తించాలి,

పట్టా & జగ్గ—శెలవు.

బాల—అను శెలవు (ప్రిన్సిపాలు ఒకప్రక్కను, పట్టాభిరామయ్య, జగ్గన్నగార్లు మరియొక ప్రక్కను నిష్క్రమింతురు)

---

## మూడవ రంగము

ప్రదేశము : రాజబాట

[ప్రవేశము : కుమార్]

కుమా—(సభాసదుల నుద్దేశించి) ఓ! మహాజనులారా! పురవాసులారా! నా దొక విజ్ఞప్తి. Well Ladies and gentlemen! Boys and girls! Now I a n going to deliver a lecture on Modern education anb Modern students. (కొంచెం ఆగి) అయితే మీరెవరూ చప్పట్లు కొట్టరేమిటి? పోనీలెండి నేనే కొట్టుకుంటాను (అని చప్పట్లు కొట్టి) My dear సోదరులారా! నేనీ సమయమున, Modern విద్యగురించి, విద్యార్థులను గురించి. యీ మధ్యను నేను సంపాదించినకొద్ది experience తో lecture deliver చేయ సమకట్టినందులకు నన్ను excuse చేసి, Market వీధిలో పెట్టేదేమిటి, ముందుల షాపులాగ, Meeting అని మండి పడక, నా speech లోని Mistakes Count చేయక Merits మాత్రము గ్రహింతురని నా belief. మహాజనులారా! యీ కాలంలో కారబూంది, అటుకులు వగైరాలు Mix చేసి Hotels లో మనము eat చేస్తున్నట్లుగా, ఇంగ్లీషు, తెనుగు Mix చేసి మాట్లాడకపోతే అర్థం చేసుకోవడం కష్టం ఆ విధంగా నేటి Modern విద్యాభిమాను లందఱు యీ సంకర

భాష speak చేయుకమానరు మన ప్రస్తుత విద్య అలా మనలను తయారుచేసింది Student సోదరులారా! నేటివిద్య ఉదరపోషణార్థమే కాని విజ్ఞానముకొఱకు గాదని మీరూ గ్రహించాలి B. A. పరీక్షప్యాసయి అప్పుడే School leaving student ని బజారులోనికిపోయి 1 గజం గుడ్డ తీసికొని రమ్మంటే దాని నాణ్యము తెలియక తబ్బిబ్బు పడతాడు యీ విధంగా ఉపయోగిస్తూంది మనకీవిద్య. దీని వలన శుచి శుభ్రతలు, జాతిభేదాలు, వర్ణాశ్రమధర్మాలు వల్లకాట్లో కలిసేయి. జందేలు తీసి కుర్చీ మెడలో వేసేము Table meals కోసం Try చేస్తున్నాము Dhowaties (ధోవతి) leaving, Trousers wearing వచ్చింది పిలక మాని క్రాపింగు పెట్టేము పౌరుషం తగ్గించుకొని మీసాలను ముక్కులోనికి తీసుకున్నాము కచిక బూడిద వదలిface powder use చేస్తున్నాము సంధ్యావందనాలు సంతచెఱువుగట్టుబట్టేయి ఖర్మంచాలక మా father లాంటి వృద్ధ Devils బాధ పడలేక ఏ two months కో ఒకసారి సంధ్యావందనానికి కూర్చుంటే, అసలు మంత్రంవదిలేసి "ఓం! కేశవాయనమః ఓం నారాయణాయ నమః! ఓం హిట్లరాయనమః! ఓం! Queen Victoria య నమః! ఓం! Great war య నమః!" అని జపించ వలసి వస్తుంది Student సోదరులారా! బాగా ఆలోచించండి బజారులోనికిపోయి ఒక వీశె వంకాయలు కొనలేని S. S. L. C. student కి జహాంగీరు కాలములో వచ్చిన రాయబారి సంగతెందుకు? తన వంశావళి తెలియనివానికి Henry II వంశవృక్షమెందుకు? కావున నోసోదరులారా! యీనాకు అవురోజుల్లో కిరస్నాయిలుకి దొంగచీట్లు produce చేసి నానాతంటాలుపడి, రాత్రంతా మధ్యమధ్యను ధూపదీప నైవేద్యాలతో జాగారం

చేసి ఆనాలుగు ముక్కలు బట్టీపట్టి ఆపరీక్ష పేపరుమీద చీదేసి రావడంకన్న మంచి లోకజ్ఞానాన్ని, అంటే English లో Wordly knowledge gain చేయడానికి try చేయడం best అని నా belief. Then next point నేటి విద్యార్థులము మన మందఅము నవనాగరికతే వ్యామోహంలో పడి పోయి, క్రాఫు Y V. Rao లా cut చేసుకున్నానా లేదా ? మీసాలు Hitler మీసాలులాగ ఉన్నాయా లేదా ! Shirt అశోక్ కుమార్ లాగ తొడిగేనా లేదా అని యిటువంటి పిచ్చిభ్రమలలో ఏడుస్తున్నామేగాని మన Position మనము realise చేసుకోవడం లేదని నా belief. యింతే గాకుండా నాలాగ love affairs లో పడిపోయి, అమ్మాయికోసము Special lodgings తీసికొని వృథాప్రయాసపడి చివరకు మన గొంతుకకు స్వహస్తములతోనే ఉరిత్రాడు వేసుకుంటున్నామని నా belief. కావున నో సోదరులారా ! యిప్పటికే చాలా కాలతీతమయినది నే deliver చేసిన speech లోనివి ఏవైనా మీ కన్వ యిస్తే చెంపలు వాయించుకొని, క్షమించుకో వలసినదని కోరుతూ, లేనిపోని వేషభాషలకు లోనుగాక విద్య నభివృద్ధి చేసుకోవలసినదని విన్నవిస్తూ, Students ని శుద్ధపట్టీరాయుళ్ళాగ తయారు చేయవద్దని ఉపాధ్యాయ మహాశయులను ప్రార్థిస్తూ, యీ విధంగా అడుగంటు చున్న విద్యను Reconstruct చేసి కీర్తిశేషులు కండని పెద్ద పెద్దలను Request చేస్తూ,

(తెరలో ఓ ! భారతీయ సోదర సోదరీ మణులారా !)

కుమా—(తెరవంకజూచి) అమ్మబాబోయి! లీలవస్తూంది నేను కంట బడితే ప్రమాదము తన్ని love చేయమంటుంది సోదరులారా ! యింతటితో నా Market meeting end చేస్తూ

తిరిగి మిమ్మల్ని ద్వారకాలంచి హోమ్‌దగ్గరో, బ్రహ్మసమాజందగ్గరో, సంతచెరువుగట్టుమీదనో, జగన్నాథపురం వంతెన దగ్గరో కలసికొంటానని విన్నవిస్తూ నిష్క్రమిస్తాను. లీలకూడా ఏదో Lecture ఇస్తుందట బోలు. మీరెవ్వరు మాత్రము దానిని love చేయకండి. అదిగో! యీ దారినే వస్తుంది. Good-bye, Good-bye. (అని ఒకప్రక్కగున తెరలోనికి బోవును,)

లీల—(ప్రవేశించి) ఓ భారతీయ సోదరసోదరీమణులారా! నాదొక చిన్నమనవి నేడు మన భరతభూమి క్రూరవ్యాఘ్రములవందగు శత్రుపీడలకును, దరిద్రపిశాచములకును విహారభూమిగా మారినది. ఎన్నో కుటుంబాలు వీరి పాదములక్రింద ప్రాణముల గోల్పోవుచున్నవి. ఎందరో తమకన్నీటిధారలచే భారతమాత పదముల నింపుచున్నారు. ఎందరో తమ జీవితములను ధారవోయుచున్నారు దీనికి కారణమేమి? శత్రువు. కావున సోదరులారా! మాతృదేశమును రక్షించుకొనుట మన విధియైయున్నది ఇంకా పూర్తిగా శత్రువులు మన దేశమును కబళించలేదు, మెల్లమెల్లగా గుటుకలు వేస్తున్నారు. ఈ విషయంలో మనకు ప్రభుత్వము సహాయము చేస్తానంటూన్నది. కాబట్టి మనము ప్రభుత్వము వారికి సహాయకారులమై నిల్చి మన దేశాన్ని శత్రుహస్తముల పడకుండా రక్షించుకోవడం సమంజసమని నా ఊహ.

అది యటుండ మన భరతదేశములో ననంకోటి సోదరు లెందరో ఆకలిబాధకు తమ ప్రాణముల నర్పించుచున్నారు. మీరు పేపర్లలో చదివేవుంటారు. కలకత్తా పట్టణములో ఎందరో స్త్రీలు ఒకపూట తిండికొఱకు వ్యభిచరిస్తున్నారట! దీనిని బట్టి ఆలోచించండి. ఎంత దీనదశలో నున్నారో? సోదరీమణు

లారా! తమ పాతివ్రత్య మహిమచే పంచభూతములను, భూమ్యాకాశములను తారుమారు చేసిన మహా పతివ్రతామ తల్లులను గనిన మన భరతమాత నేడెట్టి హీనదశలోనున్నదో ఆలోచించండి. ఆ కలకత్తా పురవాసులందరు,

చ. మలమల మాడుచుండ నిట ♦ మాకిది ఏలయటంచు మీరు వ్యా
కులతనుగాంచి డెందమున ♦ గుందక ధీరతె నిల్చియుండియున్
కలుషముగా సుఖంబులను ♦ గాంచి హసింపక తోడివారి బా
ముల తొలగంగ జేయుట ప్ర ♦ మోదముగూర్చును గాదె
యిమ్మహిన్.

కాబట్టి మహాశయులారా! మన తోటి సోదరుల కడుపుమంట చల్లార్చకుండా మనము లేనిపోని వ్యసనములకు లోనై డబ్బు వృథా ఖర్చు చేయడం సమంజసము కాదు. ధనికులు, దరిద్రులనిగాని, ఆడవారు మగవారు అనిగాని ఏవిధమైన భేదము లేకుండ మీకు తోచినది దానిమొదలుకొని మీ శక్తి ఉన్నంతవరకు Bengal క్షామనివారణార్థమై సహాయం చేయండి! సోదరీమణులారా! మీ బంగారము మానవసేవమవుతుంది సహాయము చేయడానికి సందేహించకండి. మీరు పుష్పాలను కొనుక్కోవటం మాని ఆ డబ్బే యీ విధంగా ధర్మము చేయండి. మీ భర్తలకు బోధించి సహాయము చేయించండి. మీ కాయకష్టముల శ్రమపడి తోచినదే సహాయముచేసి, మన సోదరుల ఆకలి మంట నణచివైచి భారతీయ ఐకమత్యతను, విజ్ఞానాన్ని, సంఘీభావమును వెల్లడిచేయండి. మహాశయులారా! భారతీయుల ఖ్యాతికి చిరస్థాయిగా చేయుటకిదే సమయము లేవండి. యింకా నిద్రపోకండి. మీ అజ్ఞానమగ్రమును జ్ఞానమనెడి జ్యోతిచే తొలగించివైచి ముందు రాబోయే ఆపదలకు కాచుకొండి. ప్రజాసేవయే భగవంతునిసేవ. కాబట్టి Bengal క్షామనివారణార్థము సహాయం చేయండి. బోలో భారత్ మాతాకు జై. (నిష్క్రమించును.)

## నాలుగవ రంగము

ప్రదేశము : గృహాంతర్భాగము

[ ప్రవేశము : పట్టాభిరామయ్య, జగ్గన్న, సీతాపతిరావు ]

పట్టా—అయ్యా ! యీ విషయములో అంతగా ఆలోచించవలసిన దేముంది ? పూర్ణా, రాజ్యము లిరువురు ఆనందుని అధికంగా ప్రేమిస్తున్నారు. ఇపుడు యిరువురిలో ఏ ఒకరికి ఆనందుని వివాహం చేసినా వారు బాధపడక తప్పదు. అందుచే యిరువురిని ఆనందుకు వివాహం చేయడం మంచిదని నాఊహ. మీా అభిప్రాయ మేమిటి ?

జగ్గ—నాకేమీా అభ్యంతరము లేదు అలాగ చేయడమే మంచిదని నా అభిప్రాయము.

సీతా—I too second it.

పట్టా—మన అడ్డులేదు. కాని మరి వారి అభిప్రాయమేమిటో ?

సీతా—నేను మా అమ్మాయిని యీ విషయంలో అడిగితే అంగీకారమే సూచించింది.

జగ్గ—పూర్ణకూడా వొప్పుకుంది.

పట్టా—సెభాష్ ! యింకనేమి ? అయితే ఆనందు యిరువురిభార్యల భర్త అవుతాడన్నమాట. ఎక్కడకు వెళ్ళేరు వీళ్ళు.

సీతా—షికారుకి.

పట్టా—భేష్ ! అంతా ఏకమత్యంతో నే మసలుచున్నారన్నమాట.

[ ప్రవేశం : జనార్దనం ]

జనా—(సీతాపతితో) అయ్యా ! మీాకేదో letter వచ్చిందండి.

సీతా—ఏమిటది ? (అని జనార్దనం చేతిలోని ఉత్తరమును తీసికొని, చదువుకొని, అమితానందముతో) నాయనా ! జనార్దనా ! ఎన్నాళ్ళకు నిన్ను కలసుకొన్నానురా! యిటురా! నాయనా! (అని జనార్దనమును కౌగలించుకొనును)

జనా— (సంతోషముతో) నాన్నగారూ! ఆ భగవంతుని దయవలన చివఱకు మిమ్ములను కలసుకొన్నాను. (జగ్గన్న, పట్టాభిరామయ్యలు ఆశ్చర్యమును సూచించుచుందురు)

సీతా—నాయనా! నాజన్మసార్థక మయినది. నేటికి ఆభగవంతుడికి నాపై యనుగ్రహము కల్గినది. నా ఏకైక పుత్రుని నాకప్పగించాడు. నాయనా! యివాళెంత సుదినము! (అని కౌగలించుకొనును)

పట్టా—ఏమిటి విశేషము ?

సీతా—అమ్మాయ్! ఈతడు నాకుమారుడు. చిన్నతనమందే దొంగలచే తస్కరింపబడి ఎచ్చటికో తీసుకుపోబడినాడు. ఎంత ప్రయత్నించినా యీతనిజాడ తెలిసికొనలేక పోయినాము. అలాగవుండగా యీమధ్యని అప్రయత్నంగా నాకొకనాడు యితనిని కలుసుకోవడం తటస్థించింది. యీతని దీనచరిత్ర విని నేనాదరించేను. యీతని చరిత్ర నాకుమారుని చరిత్రను బోలియుండుటచే నాకనుమానముకల్గి కలకత్తా పోలీసువారికి యీ విషయంలో enquiry చేసి నాకు తెలియబఱచవలసినదని వ్రాస్తే, వారు యీతడు నాకుమారుడే అని నిర్థారణ చేస్తూ యిదిగో report పంపించేరు.

పట్టా—మాబాగుంది. నాటకంలో యిదొక అంతర్నాటక మన్నమాట.

జగ్గ—యిదంతా జగన్నాటక సూత్రధారుని మాయానాటకము.

జనా—(తెఱవంక జూచి) అదుగో! పూర్ణానందులు, అమ్మాయి వొస్తున్నారు.

[ ఆనంద్, రాజ్యం, పూర్ణ ప్రవేశము ]

సీతా—(రాజ్యంతో) అమ్మా! తప్పిపోయిన నీ అన్నగారు దొరికేడు. యిదుగో. (అని జనార్దనమును జూపును)

రాజ్యం—అన్నయ్యా!

జనా—అమ్మాయి (అని కౌగలించుకొందురు)

ఆనం—ఆవంక యీవంక కూడా కానరుచి లేదని విచారిస్తున్నాను. నేటికి నాకోరిక ఫలించింది. Good morning బావగారూ!

జనా—Good morning!

పూర్ణ—నాన్నగారూ యీ ఆనందసమయంలో యింకొక సువార్త. ఆనందు "డాక్టరు"పరీక్షయందు తీర్ణుడయినట్లు ప్రకటించేరు.

అందరు—ఆనందము. మహానందము.

పట్టా—నాయనా! నిన్ను పూర్ణానందరాజ్యానికి పట్టాభిషిక్తుని చేయదలచుకొన్నాము. (అని పూర్ణను. రాజ్యంనుచూపి) యీ యిద్దురిని నీకు వివాహం చేయదలచుకొన్నాము. ఏమంటావు?

ఆనం—అమ్మయ్యా! మనస్సు స్థిమితపడింది, యిద్దురికి promise చేసాను. యిప్పుడెలాగా అని నా mind అంతా puzzle అయిపోయింది. మార్గము చూపించేరు. అలాగే కానివ్వండి.

పట్టా—మీ రేమంటారమ్మా?

రాజ్యం—మేమిద్దురము సవతులమై ఆదర్శప్రాయమైన జీవితము గడుపుచూ ఆనందుతో ఆనందిస్తాము.

పూర్ణ—సవతులకు పడదను లోకనామెతకు వ్యతిరేకం కలిగించి అత్యంత ప్రేమతో ఆదర్శకంగా కాలము గడుపుతాము.

సీతా—అయితే అందరి అభిప్రాయాలు ఒక్కటే. కానిచ్చేదా మిప్పుడే వివాహం.

జగ్గ—అవును. అనుకున్నదేదో అయిపోతే మంచిది.

పట్టా—అవును. తలుచుకొన్ననాడే తాతపెళ్ళి కానివ్వండి. శుభ సమయము.

సీతా—అది జమీందారుగారి చేతులతోనే జరగాలి.

జగ్గ—అయ్యా! మాకోర్కె నెరవేర్చాలి.

పట్టా—దానికేమి! పూలమాలలు తెప్పించండి.

సీతా—నాయనా ! జనార్దనం లోనికిపోయి దేవుని మెడలోని పూల మాలలు తీసికొనిరా.

జనా—అలాగే. (అని లోనికిబోయి తిరిగి పూలమాలలతో ప్రవేశించును)

పట్టా—అయ్యా ! డాక్టరుగారూ యిలాదయచేయండి. మీరిలారండి అమ్మా (అనిహస్తములకు లిపిపూలమాలలుధరింపచేయును.)

అందరు—డాక్టరుగారికి జై.

పట్టా—డాక్టరుగారూ ! యిద్దరు పిల్లలమధ్య యిటువంటి బాధ పడక జాగ్రత్తగా కాలం గడపాలి.

ఆనం—అంతా మీ యాశీర్వచన ప్రభావము.

(దంపతులు పెద్దలకు నమస్కరింతురు)

జగ్గ—బిడ్డలారా ! యీ ఆనందఫలాన్ని యిద్దరు సమంగా పంచుకుంటూ, ఐకమత్యంతో సుఖజీవనము గడుపుదురుగాక !

సీత—సంఘసేవ చేయుచు, ఆదర్శప్రాయమైన జీవితము గడుపుదురుగాక !

పట్టా—డాక్టరుగారూ మంచి మందులిస్తూ గొప్ప ఖ్యాతిగడించెదరుగాక !

జనా—అంతా ఆ భగవంతుని లీలావిలాసము. క్షణములో ఆనందము. మరుక్షణములో విచారము. యిలాగ ఆడిస్తూ ఉంటాడు.

సీతా—బంధువులందరికీ త్వరగా ఉత్తరాలు వ్రాయిద్దాము.

జగ్గ—మన Princpal గారిని కూడా పిలవాలి.

పట్టా—అయ్యా ! యీ వివాహ సందర్భంలో డాక్టరుగారికి నేను పది హేను వేలు కట్నముగా సమర్పిస్తున్నాను. అఖండవైభవంగా, అన్ని వినోదములతోనూ, దేశ దేశముల మారు మ్రోగేటట్టు వివాహం జరిగించాలి.

ఆనం—అయ్యా! మీరింకా పెరటిత్రోవనే ఉన్నారు. మన వినోదముల కిదియా సమయము? దేశ మొకవంక శత్రుభీతిచేతను, క్షామముచేతను బాధపడుచుండ మన వినోదములకు తావేది? చూడండి Bengal లో ఎంతోమంది ప్రజలు. అన్నమో! రామచంద్రా! అని విలపించుచు ఆకలిబాధకు ప్రాణముల నర్పించుచున్నారు. అందుచే మన వినోదముల తగ్గించుకొని మన భారతీయులకు సహాయం చేయాలి. మన దేశానికి శత్రువు రాకుండా సురక్షితము చేసుకోవాలి. అందుచే ముందు మన సోదరుల ఆకలిమంట చల్లార్చడానికి, దేశమును సంరక్షించుకొనుటకును, జమీందారుగా రిస్తానన్న డబ్బులో కొంత Bengal క్షామ నివారణమునకును మిగిలినది. యుద్ధనిధికిని వినియోగిస్తాను.

పట్టా—ఎంత ఉదారస్వభావము!

జనా—నాన్నగారూ! ఆనందు అభిప్రాయము చాలా బాగుంది. అందుకు మనము సహాయకారులమై నిలవాలి.

సీతా—అవును. నేనుకూడా యీ విషయంలో ఆనందుకు సహాయం చేస్తాను.

జగ్గ—సెభాష్! భారతీయుల ఖ్యాతి నిలబెట్టాలి.

పట్టా—లేవండి. భోజనానికి.

అందరు—డాక్టరు ఆనందుకు జై! భరత్ మాతాకు జై!

(నిష్క్రమింతురు)

(తెరపడును)

సమాప్తము.

**UNIVERSITY OF HYDERABAD**
**LIBRARY**
**HYDERABAD (A. P.)**

*Cl. No.* 752 R12P *Acc. No.* 129706

**DATE DUE**

DURATION OF LOAN - Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

**UNIVERSITY OF HYDERABAD LIBRARY**

Acc. No. 129706

Call No. T82 R12 D

Author [illegible]

Title [illegible]

**UNIVERSITY OF HYDERABAD**

**LIBRARY**

**HYDERABAD (A. P.)**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**